

సిరా చుక్క

ఎవడేలుతున్నాడోరో తెలంగాణా...
ఎవడి పాలవుతున్నదిరో తెలంగాణా!
అమరుల రక్తతర్పణంతో, ఉద్యమకారుల
ఉసురుతో పురుడు పోసుకున్న తెలంగాణా...
నీ త్యాగాల పునాదులపై
అధికార పీఠమెక్కిన పాలకులారా...
ప్రజలకు మీ సమాధానమేది?నీళ్లు, నిధులు,
నియామకాల నినాదం ఏమైంది?
ఉద్యమ ఆకాంక్షల తెలంగాణ ఎటు పోయింది?
నాడు గొంతెత్తిన ప్రజలే నేడు ప్రశ్నిస్తుంటే...
పాలకులారా, మీ మౌనానికి అర్థమేమిటి?
సకల జనుల సమ్మె స్ఫూర్తి ఎక్కడ?
విద్యార్థుల బలిదానాల ఆశయం ఎక్కడ?
రాష్ట్ర సాధనలో వెన్నెముకైన రైతన్నకు
భరోసా ఏది? నిరుద్యోగ యువతకు
న్యాయం ఏది?ప్రజల సమస్యలు పక్కనపెట్టి,
ఆస్తుల పంపకాలు, స్కాముల ఆరోపణలు,
కమిషన్ల వివాదాల మధ్య పాలన సాగితే...
తెలంగాణ కల సాకారమైనట్టా?
నాడు తెలంగాణ ద్రోహులంటూ వేలెత్తినవారే
నేడు అధికారంలో ఉంటే...
ప్రజలారా, పాలకుల మాటలు కాదు,
చేతలు చూడండి! అమరుల త్యాగాలను
అధికార సోపానాలుగా మార్చే రాజకీయాలకు
చరమగీతం పాడండి!
అంబేద్కర్ ఇచ్చిన ఓటు బానిసత్వానికి కాదు...
పాలకులను ప్రశ్నించే ప్రజాశక్తికి ప్రతీక!
తెలంగాణ పౌరుషం మేల్కొనాలి...
ఉద్యమ స్ఫూర్తి ఉప్పెనై ఎగసిపడాలి!
ప్రజలే ప్రభువులు... ప్రజాతీర్పే అంతిమ తీర్పు!
జై తెలంగాణ! జై ఉద్యమ స్ఫూర్తి!

నరసింహా... ,కోటపల్లి, వికారాబాద్ జిల్లా.

ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

WWW.PRAJAVOICE.IN

సంపుటి: 02 | సంచిక:100 | ఎడిటర్: మేనం శ్యామ్ | శనివారం 31-10-2026 | పేజీలు: 10

దీపావళికి నామినేటెడ్ పోస్టుల భర్తీ

- ఢిల్లీకి చేరిన లిస్ట్ షార్ట్ లిస్ట్ చేసే పనిలో ఢిల్లీ పెద్దలు
- కష్టపడ్డా సెకండ్ క్యాడర్ కి బంపర్ ఆఫర్
- రేవంత్ రెడ్డి మదిలో కొత్త క్యాండిడేట్లు
- సీఎం మంత్రులు స్పీకర్ కోటాలో నామినేటెడ్ పోస్టులు
- కార్పొరేషన్ చైర్మన్లు వైస్ కార్పొరేషన్ చైర్మన్ల పదవుల పంపకం పాత వారిలో 5గురికి రెన్యువల్

ప్రజా వాయిస్ హైదరాబాద్/తెలంగాణ రాష్ట్రంలో ఎప్పుడు ఎప్పుడు అని ఎదురుచూస్తున్న నామినేటెడ్ పోస్టుల పంపకానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ శ్రీకారం చుట్టారు అనే వార్త ఢిల్లీలో విశ్వాసనీయంగా తెలుస్తుంది. దీపావళి పండుగకు ముందు కార్పొరేషన్ చైర్మన్ల మరియు వైస్ కార్పొరేషన్ చైర్మన్ల పదవులు ఇచ్చి సెకండ్ కాంగ్రెస్ క్యాడర్ కి భరోసా నింపాలన ఉద్దేశంతో రేవంత్ చూస్తున్నట్లు తెలుస్తోంది. దాదాపుగా 90% కొత్తవారికి అవకాశం ఇవ్వాలని పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి అనుకున్నట్టు సమాచారం. దీనితో దీపావళి పండుగ సందర్భంగా పదవులు వస్తున్న వారికి డబల్ దీపావళి పండుగ కానున్నదని ఢిల్లీ వర్గాల నుంచి విశ్వసనీయ సమాచారం.



ఢిల్లీకి లిస్టు పంపిన సీఎం, పీసీసీ

ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలో ఎవరెవరు కష్టపడుతున్నారో ఇంటలిజెంట్స్ వ్యవస్థ ద్వారా వాళ్ల గురించి తెలుసుకొని కాంగ్రెస్ పార్టీ కోసం నిబద్ధతగల కార్యకర్తలను గుర్తించి ఆ లిస్టును సీఎం రేవంత్ రెడ్డి పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఢిల్లీకి పంపినట్లు వార్తలు వస్తున్నాయి. ఆ లిస్టును షార్ట్ లిస్టు చేసి దాదాపుగా 30కి పైబలుకు కార్పొరేషన్ చైర్మన్లు వైస్ కార్పొరేషన్ చైర్మన్ గా అవకాశం ఇవ్వబోతున్నారు ఇందులో అందరూ ఎక్కువగా కొత్త వాళ్ళు ఉండడం గమనహర్షం.

సీఎం,మంత్రులు,స్పీకర్ కోటాలో

సీఎం రేవంత్ రెడ్డి కోటలో దాదాపు 15 కి పైచిలుకు కార్పొరేషన్ చైర్మన్లు, మంత్రుల కొట్టాలో 10 వరకు, స్పీకర్ కోటలో రెండు కార్పొరేషన్ చైర్మన్లు రానున్నట్లు సమాచారం. ఇప్పటికే మొదటి సారి విడతలో చాలావరకు మంత్రులు వాళ్ళ అనుచరులకు కార్పొరేషన్ చైర్మన్ ను ఇప్పించుకున్నారు..

స్పీకర్ కోటాలు

స్పీకర్ గడ్డం ప్రసాద్ కోటాలో అంటే ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఒక మంచి కూడా లేదు ఇప్పటికే వచ్చే మంత్రివర్గంలోకి గడ్డం ప్రసాద్ కుమార్ ని తీసుకునే అవకాశం ఉన్నట్టు వార్తలు జక్కర్లు కొడుతున్నాయి.

ఈ నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా కోటాలో ఒక కార్పొరేషన్ తన సొంత నియోజకవర్గ వికారాబాద్ కోటాలో ఇంకొక కార్పొరేషన్ చైర్మన్ 100% వచ్చే ఛాన్స్ కనిపిస్తున్నట్లు తెలుస్తుంది ఎందుకంటే తను స్పీకర్గా గెలిచినప్పటి నుంచి ఏది ఆశించకుండా కాంగ్రెస్ పార్టీ కోసం రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండుకుంటూ చాలా పర్ఫెక్ట్ గా పని చేసుకుంటూ ముందుకు వెళ్తా ఉన్నారు స్పీకర్ ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనూ తన అనుచరులకు ఇద్దరికైనా కార్పొరేషన్ చైర్మన్లు ఇప్పించుకునే విధంగా పావులు కదిరినట్లు ఢిల్లీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం.

పాతవారికి 5గురికి రెన్యువల్

మొదటి విడతలో కార్పొరేషన్ చైర్మన్ గా ఉన్న వాళ్లకి ఒక ఐదు గురికి మాత్రం మళ్లీ రెండువేలు చేసే ఛాన్స్ కనిపిస్తుంది. దానిలో నిర్మల జగ్గారెడ్డి, పటేల్ రమేష్ రెడ్డి, మెట్టు సాయికుమార్, ఫాయిమ్ ఖురేషి, నూతి శ్రీకాంత్ గౌడ్ లా పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఎందుకంటే సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి తన కుటుంబ సభ్యులైన తన భార్యకు ఇవ్వకపోతే రచ్చ రచ్చ చేస్తాడు అన్న ఒక కోణం. పటేల్ రమేష్ రెడ్డి కోసం వేం నరేందర్ రెడ్డి అండగా ఉన్నారు. ఫయిమ్ ఖురేషి సీఎం కి దగ్గర మిత్రుడు మరియు నమ్మకస్తుడు. మెట్టు సాయికుమార్ యువకునికి మళ్లీ అవకాశం కల్పించాలని రేవంత్ రెడ్డి చూస్తున్నట్లు సమాచారం ఎందుకంటే కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు కష్టపడుతూ రేవంత్ రెడ్డికి అండదండలుగా ఉంటూ ఎవరు మాట్లాడినా మాట్లాడకపోయినా కాంగ్రెస్ పార్టీ పైన రేవంత్ రెడ్డి పైన ప్రతిపక్షాలు మాట్లాడితే అదే స్టైల్ లో సమాధానం ఇస్తూ అందరి దృష్టిలో పడ్డాడు మెట్టు సాయికుమార్. నూతి శ్రీకాంత్ గౌడ్ కూడా మళ్లీ రెన్యువల్ ఛాన్స్ ఉన్నట్టు సమాచారం వస్తుంది. ఎందుకంటే ఈ మధ్యలో ఫయిమ్ ఖురేషి తో సత్సంబంధాలు కొనసాగిస్తూ నూతి శ్రీకాంత్ గౌడ్ వెళ్తున్న నేపథ్యంలో నూతి శ్రీకాంత్ గౌడ్ కూడా మళ్లీ కార్పొరేషన్ చైర్మన్ దగ్గర అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది. ఇక రిమైనింగ్ వాళ్లకు స్వస్తి పలకాలని పిసిసి ముఖ్యమంత్రి చూస్తున్నట్టు సమాచారం.

గర్ల్స్ హాస్టల్ ముసుగులో అక్రమ అండాల దందా?

- బేగంపేటలో పోలీసుల ఆకస్మిక దాడులు
- 10 మంది యువతుల గుర్తింపు
- ప్రకాశ్‌నగర్ అపార్ట్‌మెంట్‌లో 'అమీ నీతా గర్ల్స్ హాస్టల్'పై తనిఖీలు
- బిహార్, యూపీ, ఒడిశాకు చెందిన యువతులు ఉన్నట్లు గుర్తింపు
- అండాలు సేకరించి సంతాన సాఫల్య కేంద్రాలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు
- వ్యభిచారం నిర్వహిస్తున్నారనే కోణంలోనూ దర్యాప్తు
- యువతుల సమ్మతి, వైద్య నిబంధనలపై పోలీసుల ఆరా

2 లో

సినిమా ప్రమోషన్లకు కాలేజీ సెలవులా?

- మల్లారెడ్డి విద్యాసంస్థలకు ఉన్నత విద్యామండలి నోటీసులు
- ఆదర్శ కుటుంబం సినిమా ట్రైలర్ ఆవిష్కరణతో మొదలైన వివాదం
- సినిమా విడుదల రోజున ప్రత్యేక సెలవు ప్రకటించడంపై అభ్యంతరాలు
- విద్యార్థి సంఘాల ఫిర్యాదుతో స్పందించిన ఉన్నత విద్యామండలి
- అకడమిక్ క్యాలెండర్ ఉల్లంఘనపై వివరణ కోరినట్లు సమాచారం



2లో



తెలంగాణకు మూడు హైస్పీడ్ రైలు కారిడార్ల పనులు వేగవంతం చేయండి

- రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు సీఎం రేవంత్ విజ్ఞప్తి
- హైదరాబాద్–పుణె, బెంగళూరు, చెన్నె కారిడార్లపై చర్చ
- అలైన్‌మెంట్ ఖరారయ్యాకే భూసేకరణ చేపడతామని వెల్లడి
- వికారాబాద్–కృష్ణా కొత్త రైలుమార్గానికి మంజూరు కోరిన సీఎం
- ఆర్ఆర్ఆర్ పక్కనే రీజినల్ రింగ్ రైలు నిర్మాణానికి ప్రతిపాదన

న్యూఢిల్లీ, ప్రజా వాయిస్: తెలంగాణకు ప్రతిపాదించిన మూడు హైస్పీడ్ రైలు కారిడార్ల పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు. హైదరాబాద్–పుణె, హైదరాబాద్–బెంగళూరు, హైదరాబాద్–చెన్నె కారిడార్లకు సంబంధించి కేంద్రం పంపిన ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం సమీక్షించి, కొన్ని మార్పులను సూచిస్తూ తిరిగి ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు.

మిగతా 2లో

తూర్పు హైదరాబాద్ ఐటీకి కొత్త కళ

- పోచారంలో ఇన్ఫోసిస్ నూతన క్యాంపస్ ప్రారంభం
- 1.1 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో నూతన భవనం
- తొలిదశలో 10 వేల మంది ఉద్యోగులకు వసతులు
- హైబ్రిడ్ విధానంలో మరో 13 వేల మందికి పైగా అవకాశాల లక్ష్యం
- భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు చేతుల మీదుగా ప్రారంభం
- ఏఐ, క్లౌడ్, సైబర్ భద్రత విభాగాలకు ప్రాధాన్యం

2 లో



రైతుకు మేలు చేసే పరిశోధనలే చేయండి.!

- తక్కువ పెట్టుబడి.. అధిక దిగుబడులే లక్ష్యం
- రైతుల సాగు కష్టాలు తగ్గించే కొత్త వంగడాలు అభివృద్ధి చేయాలి
- పంట నష్టాలు తగ్గించి ఉత్పాదకత పెంచేలా పరిశోధనలు
- ఐసీఏఆర్ శాస్త్రవేత్తలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ పిలుపు
- రాజేంద్రనగర్‌లో రైతు దినోత్సవం
- బీజేపీలోకి పలువురు యువకులు చేరికలు



ప్రజా వాయిస్,రాజేంద్రనగర్: రైతు సాగు కష్టాలు తగ్గాలి.. పెట్టుబడి భారం దించాలి.. దిగుబడులు పెంచాలి.. పంట నష్టాలను అరికట్టాలి.. ఈ లక్ష్యంతో పరిశోధనలు సాగించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ వ్యవసాయ శాస్త్రవేత్తలకు పిలుపు నిచ్చారు. పర్యావరణానికి, మానవ ఆరోగ్యానికి హాని కలగకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కొత్త వంగడాలు, మెరుగైన సాగు పద్ధతులను అభివృద్ధి చేయాలని సూచించారు.రాజేంద్రనగర్‌లోని ఐసీఏఆర్,భారత వరి పరిశోధనా సంస్థ (ఐఐఆర్ఆర్)లో శుక్రవారం నిర్వహించిన రైతు దినోత్సవానికి బండి సంజయ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి 24వ విడత నిధుల విడుదల నేపథ్యంలో పీఎం కిసాన్ ఉత్సవ్ దివస్‌ను నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వికసిత్ భారత్–2047 లక్ష్య సాధనలో రైతుల పాత్ర అత్యంత కీలకమన్నారు. దేశవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సాగు సమస్యలు, పెట్టుబడి భారం, పంట నష్టాలను దృష్టిలో పెట్టుకుని పరిశోధనలు కొనసాగించాలని స్పష్టం చేశారు. ప్రయోగశాలల్లో జరిగే పరిశోధనలు క్షేత్రస్థాయిలో రైతులకు ఉపయోగపడినప్పుడే వాటికి

మిగతా 2లో

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ బరిలో ఆకాశ్ కొల్లూరు

- హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ అభ్యర్థిగా ప్రకటన
- సీనియర్ జర్నలిస్టుకు అవకాశం కల్పించిన కల్వకుంట్ల కవిత
- వరంగల్–ఖమ్మం–నల్గొండ స్థానం నుంచి నలమాస శ్రీకాంత్ గౌడ్ పోటీ
- ఎన్నికల ప్రచారానికి ప్రత్యేక ఇన్‌చార్జీల నియామకం
- వార్ రూమ్ నిర్వహణ బాధ్యతలు రామ్ కల్యాణ్ చల్లాకు

2 లో



చేవెళ్ల ఫామ్‌హౌస్‌లో విద్యార్థుల పార్టీ.. ముగ్గురికి గంజాయి పాజిటివ్!

- 108 మందికి డ్రగ్స్ పరీక్షలు.. ముగ్గురిలో గంజాయి ఆనవాళ్లు
- ప్రధాన నిర్వాహకుడు మన్నన్ అదుపులోకి
- ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఆహ్వానాలు
- ఒక్కొక్కరి నుంచి రూ.2 వేల వరకు వసూలు
- ఫామ్‌హౌస్‌లో భారీగా మద్యం బాటిళ్లు స్వాధీనం
- గంజాయి సరఫరా, ఇతరుల ప్రమేయంపై పోలీసుల దర్యాప్తు



చేవెళ్ల, ప్రజా వాయిస్:హైదరాబాద్ శివారులోని రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో విద్యార్థుల పార్టీ కలకలం రేపింది. కమ్మెట గ్రామ సమీపంలోని ఓ ఫామ్‌హౌస్‌లో అనుమతులు లేకుండా నిర్వహించిన పార్టీపై స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్ఓటీ), స్థానిక పోలీసులు సంయుక్తంగా దాడులు చేశారు. ఈ పార్టీలో పాల్గొన్న 108 మందికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా.. ముగ్గురికి గంజాయి పాజిటివ్‌గా వచ్చినట్లు పోలీసులు వెల్లడించారు. ప్రధాన నిర్వాహకుడు మన్నన్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఫామ్‌హౌస్‌లో భారీగా మద్యం బాటిళ్లను కూడా స్వాధీనం చేసుకున్నారు

ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రచారం.. చివరి నిమిషంలో లొకేషన్

చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో

మిగతా 2లో

సినిమా ప్రమోషన్లకు కాలేజీ సెలవులా?



హైదరాబాద్, ప్రజా వాయిస్: మల్లారెడ్డి విద్యాసంస్థల్లో సినిమా ప్రమోషన్ల నిర్వహణ వివాదం మరింత ముదురుతోంది. నూతన సినిమా విడుదల సందర్భంగా విద్యార్థులకు ప్రత్యేక సెలవు ప్రకటించిన వ్యవహారాన్ని తెలంగాణ ఉన్నత విద్యామండలి తీవ్రంగా పరిగణించినట్లు తెలుస్తోంది. విద్యాసంస్థల ప్రాంగణాలను సినిమా ప్రచార కార్యక్రమాలకు వినియోగించడం, నిబంధనలకు విరుద్ధంగా సెలవులు ప్రకటించడంపై యాజమాన్యానికి నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై సమగ్ర వివరణ ఇవ్వాలని మండలి ఆదేశించినట్లు తెలిసింది.

ట్రైలర్ వేడుకతో మొదలైన వివాదం

ఈ నెల 23న మల్లారెడ్డి విద్యాసంస్థల ప్రాంగణంలో ‘ఆదర్శ కుటుంబం’ సినిమా ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా సంస్థల వైస్ చైర్‌పర్సన్ ప్రీతిరెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. సినిమా విడుదల రోజున కళాశాలకు ప్రత్యేక సెలవు ప్రకటించనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రకటనపై విద్యావేత్తలు, విద్యార్థి సంఘాల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. విద్యాసంస్థలను సినిమా ప్రమోషన్లకు వేదికగా మార్చడం, అందుకోసం సెలవు ప్రకటించడం ఏమిటంటూ విమర్శలు వెల్లువెత్తాయి.

విద్యార్థి సంఘాల ఫిర్యాదు

ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు రజినీకాంత్ నేతృత్వంలో విద్యార్థి సంఘాల ప్రతినిధులు తెలంగాణ ఉన్నత విద్యామండలిని కలిసి ఫిర్యాదు చేశారు. కళాశాలల్లో సినిమా ప్రచార కార్యక్రమాలను నిలిపివేయాలని, నిబంధనలు ఉల్లంఘించిన యాజమాన్యంపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు సైతం ఈ వ్యవహారంపై నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థుల చదువులకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన విద్యాసంస్థలు సినిమా ప్రచారాలకు ప్రాధాన్యం ఇవ్వడం విద్యావ్యవస్థపై ప్రభావం చూపుతుందని అభిప్రాయపడ్డారు.

అకడమిక్ క్యాలెండర్‌పై వివరణ కోరిన మండలి

విద్యార్థి సంఘాల ఫిర్యాదుల నేపథ్యంలో ఉన్నత విద్యామండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్ మల్లారెడ్డి విద్యాసంస్థలకు నోటీసులు పంపినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఆమోదించిన అకడమిక్ క్యాలెండర్‌కు భిన్నంగా ప్రైవేటు విద్యాసంస్థలు సొంత నిర్ణయాలతో సెలవులు ప్రకటించడంపై మండలి అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. దీనిపై యాజమాన్యం నుంచి వివరణ కోరినట్లు తెలిసింది.

ప్రమోషన్లపై ప్రీతిరెడ్డి సమర్థన

మరోవైపు, క్యాంపస్‌లో సినిమా ఈవెంట్లు నిర్వహిస్తే తప్పేముందని ప్రీతిరెడ్డి ఇటీవల ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రశ్నించారు. విద్యార్థులు నిరంతరం చదువులతో బోర్ ఫీలవుతారని, అప్పుడప్పుడు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తే వారి మానసిక ఉత్సాహం పెరిగి తిరిగి చదువులపై దృష్టి పెడతారని పేర్కొన్నారు. విజయ్ దేవరకొండ కూడా ఓ యూనివర్సిటీని ప్రమోట్ చేస్తున్నారని ఉదహరించారు.‘యానిమల్’, ‘టాక్సిక్’ వంటి అడల్ట్ సినిమాల ప్రమోషన్లకు క్యాంపస్‌ను వేదికగా చేసుకోవడంపై వచ్చిన విమర్శలపైనా ఆమె స్పందించారు. 16 ఏళ్లు పైబడిన విద్యార్థులే క్యాంపస్‌లో ఉన్నారని, అడల్ట్ సినిమాల ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తే తప్పేమిటని సమర్థించుకున్నారు. తమ క్యాంపస్‌లో సినిమా ఈవెంట్లు నిర్వహించడం వల్ల పదిరెట్లు ఎక్కువ ప్రచారం లభిస్తుందని, అదంతా మల్లారెడ్డి బ్రాండ్ అని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో ఉన్నత విద్యామండలి నోటీసులపై యాజమాన్యం ఇచ్చే వివరణ, తదుపరి చర్యలపై ఆసక్తి నెలకొంది.



తూర్పు హైదరాబాద్ ఐటీకి కొత్త కళ

పోచారం, ప్రజా వాయిస్: తూర్పు హైదరాబాద్ ఐటీ రంగంలో మరో కీలక ముందడుగు పడింది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పోచారంలోని ఇన్ఫోసిస్ ప్రాంగణంలో సంస్థ నిర్మించిన నూతన క్యాంపస్ శుక్రవారం ప్రారంభమైంది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ముఖ్య అతిథులుగా హాజరై నూతన భవనాన్ని ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. వర్షం కురుస్తున్నప్పటికీ ప్రారంభోత్సవ వేడుకలు కొనసాగాయి.

10 వేల మందికి తొలిదశలో ఉద్యోగాలు

సుమారు 1.1 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన ఈ నూతన భవనంలో తొలి దశలో 10 వేల మంది ఉద్యోగులు పనిచేసేందుకు అవసరమైన సదుపాయాలు కల్పించారు. హైబ్రిడ్ పని విధానంలో మరో 13 వేల మందికి పైగా ఉద్యోగులకు అవకాశాలు కల్పించే లక్ష్యంతో సంస్థ ముందుకెళ్తోంది.

కృత్రిమ మేధ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ భద్రత, ఇంజినీరింగ్, తదుపరి తరం డిజిటల్ సేవల విభాగాల్లో ఈ కేంద్రం కీలక పాత్ర పోషించనుంది.

450 ఎకరాల్లో విస్తరించిన ప్రాంగణం

ఇప్పటికే పోచారంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఇన్ఫోసిస్ ప్రాంగణం సుమారు 450 ఎకరాల్లో విస్తరించి ఉంది. ప్రస్తుతం 4.58 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏడు సాఫ్ట్‌వేర్ అభివృద్ధి భవనాలు ఉన్నాయి. తాజాగా మరో భవనం అందుబాటులోకి రావడంతో సంస్థ కార్యకలాపాలు మరింత విస్తరించనున్నాయి. బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా, రిటైల్, లైఫ్ సైన్సెస్, తయారీ రంగాల్లోని అంతర్జాతీయ సంస్థలకు ఈ కేంద్రం సేవలందిస్తోంది.

ఆధునిక సదుపాయాలు.. స్థానికంగా ఉపాధి

కొత్త భవనంలో పునరుత్పాదక ఇంధన వినియోగం, స్మార్ట్ లైటింగ్, నీటి పునర్వినియోగం, మురుగునీటి శుద్ధి వంటి ఆధునిక సదుపాయాలు ఏర్పాటు చేశారు. క్యాంపస్ విస్తరణతో పోచారం, ఘట్‌కేసర్ పరిసర ప్రాంతాల్లో ఐటీ కార్యకలాపాలు మరింత ఊపందుకోనున్నాయి. ప్రత్యక్ష ఉద్యోగాలతో పాటు రవాణా, ఆహారం, వాణిజ్య రంగాల్లోనూ ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంది. స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు తూర్పు హైదరాబాద్ అభివృద్ధికి ఈ క్యాంపస్ దోహదపడనుంది.

రైతుకు మేలు చేసే పరిశోధనలే చేయండి.!

మొదటి పేజీ తరువాయి

నిజమైన ఫలితం ఉంటుందని పేర్కొన్నారు.పీఎం కిసాన్ సమ్మాన్ నిధి రైతులకు ఆర్థికంగా అండగా నిలుస్తోందని తెలిపారు. శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ శాస్త్రీయ సాగు పద్ధతులను అనుసరించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం శాస్త్రవేత్తలు రైతులతో ముఖాముఖి నిర్వహించి నూతన వరి వంగడాలు, వ్యవసాయ ఆవిష్కరణలను ప్రదర్శించారు. క్రిమిసంహారక మందుల వినియోగంపై అవగాహన కల్పించారు.

బీజేపీలోకి పలువురు యువకులు

రాజేంద్రనగర్‌లో బీజేపీలోకి పలువురు యువకులు చేరారు. రాజేంద్రనగర్ కూడలి వద్ద నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ సమక్షంలో కాషాయ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.రాజేంద్రనగర్‌కు చెందిన దేశపాగ కిరోసిన్ రాజు, కరణం నారాయణ ముదిరాజ్, వేముల శ్రీనివాస్, బాలరాజ్ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ బుద్వేల్ విలేజ్ ప్రెసిడెంట్ కోరని శ్యామ్, కోరని నరేందర్, బాలు, శివ తదితరులు బీజేపీలో చేరారు.కార్యక్రమాల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోకల శ్రీనివాస్ రెడ్డి, గోల్కొండ,గోషామహల్ జిల్లా ఇన్‌చార్జి వై. శ్రీధర్, వనపర్తి జిల్లా ఇన్‌చార్జి బొక్క బాల్ రెడ్డి, బుక్క వేణుగోపాల్, ఎం. కొమురయ్య, జి. బాబురావు, పులిమామిడి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల ఫామ్‌హౌస్‌లో విద్యార్థుల పార్టీ..

ముగ్గురికి గంజాయి పాజిటివ్!

మొదటి పేజీ తరువాయి

ని కమ్మెట గ్రామ శివారులో ఉన్న ఎల్జీ ఫామ్‌హౌస్‌లో శుక్రవారం ఈ పార్టీ నిర్వహించినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ప్రధాన నిర్వాహకుడు మన్నన్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా స్నేహితులు, ఫాలోవర్లకు పార్టీ గురించి సమాచారం ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు. అయితే పార్టీ జరిగే ప్రదేశం వివరాలను ముందుగానే వెల్లడించకుండా రహస్యంగా ఉంచినట్లు తెలిసింది. ఎంట్రీ ఫీజుగా ఒక్కొక్కరి నుంచి రూ.1,000 నుంచి రూ.2,000 వరకు వసూలు చేసి, డబ్బులు చెల్లించిన వారికి చివరి నిమిషంలో ఫామ్‌హౌస్ లొకేషన్ పంపినట్లు విచారణలో తేలినట్లు సమాచారం.

ఐజీఎస్ విద్యార్థులు అధిక సంఖ్యలో?

ఈ పార్టీలో హైదరాబాద్ పరిసర ప్రాంతాలతో పాటు ఇతర ప్రాంతాల విద్యార్థులు కూడా పాల్గొన్నట్లు పోలీసులు గుర్తించారు. శంకరపల్లి మండలం దొంతన్‌పల్లిలోని ఐబీఎస్ (ఐఎఫ్‌హెచ్‌ఈ) యూనివర్సిటీకి చెందిన బీబీఏ, ఇంజినీరింగ్ విద్యార్థులు అధిక సంఖ్యలో ఉన్నట్లు సంబంధిత వర్గాల సమాచారం. గతంలో అదే విద్యాసంస్థలో ఫ్రెషర్స్ డే కార్యక్రమం నిర్వహించిన సమయంలో మన్నన్‌కు పలువురు విద్యార్థులతో పరిచయాలు ఏర్పడినట్లు తెలుస్తోంది. ఆ పరిచయాల ఆధారంగా వారిని పార్టీకి ఆహ్వానించినట్లు సమాచారం. పార్టీలో పలువురు యువతులు కూడా పాల్గొన్నట్లు తెలిసింది.

ముగ్గురికి గంజాయి పాజిటివ్

ఫామ్‌హౌస్‌లో పార్టీ జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న ఎస్ఓటీ, చేవెళ్ల పోలీసులు ఆకస్మికంగా దాడులు చేశారు. పోలీసులను చూసి కొందరు అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించగా వారిని అదుపులోకి తీసుకున్నారు. మొత్తం 108 మందికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా.. ప్రధాన నిర్వాహకుడు మన్నన్‌తో పాటు మరో ఇద్దరికి గంజాయి పాజిటివ్‌గా వచ్చినట్లు పోలీసులు తెలిపారు. దీంతో వారికి గంజాయి ఎక్కడి నుంచి అందింది? సరఫరా చేసిన వ్యక్తులు ఎవరు? ఈ వ్యవహారంలో మరెవరైనా కీలకంగా వ్యవహరించారా? అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

ఫామ్‌హౌస్ యజమాని పాత్రపైనా ఆరా

పార్టీ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు ఎవరు చేశారు? ఎంట్రీ ఫీజు రూపంలో వసూలు చేసిన డబ్బులు ఎవరికి చేరాయి? గతంలోనూ ఈ ఫామ్‌హౌస్‌లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించారా? అనే అంశాలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఫామ్‌హౌస్ యజమాని పాత్ర, పార్టీ నిర్వహణకు అవసరమైన అనుమతుల అంశాలను కూడా పరిశీలిస్తున్నారు.రాష్ట్రవ్యాప్తంగా మత్తు పదార్థాల నియంత్రణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్న వేళ.. చేవెళ్లలో విద్యార్థుల పార్టీ వెలుగులోకి రావడం చర్చనీయాంశమైంది. డ్రగ్స్ సరఫరా వెనుక ఉన్న వ్యక్తులు, పార్టీ నిర్వహణలో ఇతరుల ప్రమేయంపై దర్యాప్తు పూర్తయితే మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

తెలంగాణకు మూడు హైస్పీడ్ రైలు కారిడార్ల

పనులు వేగవంతం చేయండి

మొదటి పేజీ తరువాయి

శుక్రవారం సాయంత్రం ఢిల్లీలోని రైల్ భవన్‌లో కేంద్ర మంత్రితో సీఎం భేటీ అయ్యారు.

అలైన్‌మెంట్ ఖరారయ్యాకే భూసేకరణ

ఈ మూడు కారిడార్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు భూసేకరణ ప్రక్రియ ప్రారంభించలేదని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అలైన్‌మెంట్‌ను ఆమోదించిన తర్వాతే భూసేకరణ చేపడతామని తెలిపారు. సాధ్యమైనంత త్వరగా అలైన్‌మెంట్ ప్రక్రియను పూర్తి చేయాలని కేంద్ర మంత్రిని కోరారు.

వికారాబాద్–కృష్ణా మార్గానికి మంజూరు కోరిన సీఎం

వికారాబాద్–కృష్ణా మధ్య 130 కిలోమీటర్ల కొత్త రైలు మార్గాన్ని వెంటనే మంజూరు చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. వికారాబాద్ జిల్లా టేకల్‌కోడ్ పరిసరాల్లో భారీ సున్నపురాయి నిక్షేపాలు ఉన్నాయని, ఈ ప్రాంతాన్ని సిమెంట్, వస్త్ర పరిశ్రమల కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని వివరించారు.

ఆర్ఆర్ఆర్ పక్కనే రీజినల్ రింగ్ రైలు

హైదరాబాద్ చుట్టూ సుమారు 360 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్న ప్రాంతీయ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) పక్కనే రీజినల్ రింగ్ రైలు అలైన్‌మెంట్ రూపొందించాలని రేవంత్‌రెడ్డి కోరారు. ఈ రైలు మార్గం అందుబాటులోకి వస్తే పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కలుగుతాయని పేర్కొన్నారు.

మరిన్ని కొత్త రైలు మార్గాల ప్రతిపాదనలు

డోర్నకల్–గద్వాల, కల్వకుర్తి–మాచర్ల, కాచిగూడ–జగ్గయ్యపేట (250 కి.మీ.), పటాన్‌చెరు–ఆదిలాబాద్ (320 కి.మీ.), బోధన్–లాతూర్ (175 కి.మీ.) కొత్త రైలు మార్గాలతో పాటు అక్కన్నపేట బైపాస్ లైన్ (8 కి.మీ.)కు వెంటనే అనుమతులు మంజూరు చేయాలని సీఎం కోరారు.

మహబూబాబాద్ సమీపంలో మెగా డిపో

దక్షిణ మధ్య రైల్వే ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న మెగా కోచింగ్, ఫ్లైట్ మెయింటెనెన్స్ డిపోను మహబూబాబాద్ సమీపంలోని అనంతారం గ్రామంలో ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన 409 ఎకరాల ఒక గుంట భూమిని రైల్వే శాఖకు అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించిన విషయాన్ని గుర్తుచేశారు. మెగా ఫ్లైట్ మెయింటెనెన్స్ డిపోకు త్వరగా అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు

ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీలు డాక్టర్ మల్లు రవి, వేం నరేందర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, అనిల్‌కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ అద్వైత్ కుమార్ సింగ్ పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ బరిలో ఆకాశ్ కొల్లూరు

హైదరాబాద్, ప్రజా వాయిస్: రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు తెలంగాణ రక్షణ సేన పార్టీ సన్నాహాలు ముమ్మరం చేసింది. హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా సీనియర్ జర్నలిస్ట్ ఆకాశ్ కొల్లూరును పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత ప్రకటించారు. ఇప్పటికే వరంగల్–ఖమ్మం–నల్గొండ స్థానం నుంచి నలమాస శ్రీకాంత్ గౌడ్‌ను అభ్యర్థిగా ప్రకటించిన ఆమె, తాజాగా రెండో స్థానానికి కూడా అభ్యర్థిని ఖరారు చేశారు.

ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక బృందాలు

ఎన్నికల నిర్వహణ, ప్రచార సమన్వయం కోసం పార్టీ సీనియర్ నాయకులకు కీలక బాధ్యతలు అప్పగించారు. హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి అబ్జర్వర్, కోఆర్డినేటర్‌గా డాక్టర్ చిట్నేని రఘును నియమించారు. రెండు ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించి ప్రచార వ్యూహాలు, వార్ రూమ్ నిర్వహణ బాధ్యతలను న్యాయవాది రామ్ కల్యాణ్ చల్లాకు అప్పగించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

జిల్లాల వారీగా ఇన్‌చార్జీల నియామకం

క్షేత్రస్థాయిలో ప్రచారాన్ని సమన్వయం చేసేందుకు ఉమ్మడి జిల్లాల వారీగా ఇన్‌చార్జీలను నియమించారు. హైదరాబాద్ బాధ్యతలను సురభి, మతీన్, బండారి మహేందర్ ముదిరాజ్‌లకు అప్పగించారు. రంగారెడ్డి జిల్లాకు అర్చనా సేనాపతి, మహబూబ్‌నగర్ జిల్లాకు రంజిత్ గొంగళ్లను ఇన్‌చార్జీలుగా నియమించారు. నల్గొండకు సుజిత్, ఖమ్మంకు గట్టు కరుణ, వరంగల్‌కు మాడుగుల రాజిరెడ్డి బాధ్యతలు నిర్వహించనున్నారు.

రెండు దశాబ్దాల జర్నలిజం అనుభవం

అభ్యర్థిగా ప్రకటించిన ఆకాశ్ కొల్లూరు హైదరాబాద్‌కు చెందినవారు. జాతీయ స్థాయిలో దాదాపు రెండు దశాబ్దాలుగా జర్నలిస్టుగా పనిచేశారు. ఇండియా టుడే, రిపబ్లిక్ టీవీ, సీఎన్ఎన్ న్యూస్18, డెయిలీ హంట్ వంటి మీడియా సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో పాఠశాల విద్యను పూర్తి చేసిన ఆయన, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ పట్టా పొందడంతో పాటు గోల్డ్ మెడల్ సాధించారు.

ఎన్నికల బరిలో జర్నలిస్ట్

రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించడంతో తెలంగాణ రక్షణ సేన ఎన్నికల కార్యాచరణపై దృష్టి సారించింది. అభ్యర్థుల ప్రచారం, జిల్లాల వారీగా పార్టీ యంత్రాంగం సమన్వయం, ఓటర్లను చేరుకునే కార్యక్రమాలపై పార్టీ నాయకత్వం దృష్టి పెట్టింది.

బియ్యం తూకాల్లో తేడాలపై కొరడా.!

- **మిల్లులు, దుకాణాలపై అధికారుల దాడులు**
- **మిర్యాలగూడలో 8 కేసులు నమోదు**
- **బస్తా బరువుతో కలిపి తూస్తే మోసమే**
- **నికర బరువు చూసి కొనాలని సూచన**



ప్రజా వాయిస్,మిర్యాలగూడ: బియ్యం బస్తాల్లో బరువు తేడాలపై లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. మిర్యాలగూడ పట్టణంలోని రైస్ మిల్లులు, బియ్యం విక్రయ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారులపై 8 కేసులు నమోదు చేశారు. వినియోగదారులకు తూకాల్లో మోసం జరగకుండా అధికారులు తనిఖీలు చేపట్టారు.అసిస్టెంట్ కంట్రోలర్, లీగల్ మెట్రాలజీ, నల్గొండ పర్యవేక్షణలో జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి తనిఖీలు నిర్వహించారు. ఐదు రైస్ మిల్లులు, మూడు రిటైల్ బియ్యం దుకాణాలను పరిశీలించారు. నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి ఐదు రైస్ మిల్లులు, మూడు బియ్యం దుకాణాలపై కేసులు నమోదు చేశారు.

బస్తా బరువుతో మాయాజాలం వద్దు.!

బియ్యం కొనుగోలు చేసేటప్పుడు బస్తాపై ప్రకటించిన నికర బరువును వినియోగదారులు పరిశీలించాలని అధికారులు సూచించారు. బస్తాతో కలిపి మొత్తం బరువును మాత్రమే కాకుండా, బస్తా బరువును మినహాయించి అందులోని బియ్యం నికర బరువును తూకం వేయించుకోవాలని తెలిపారు. ప్రకటించిన బరువుకు అనుగుణంగా బియ్యం ఉన్నాయో లేదో నిర్ధారించుకున్న తర్వాతే కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు.

తేడాలుంటే ఫిర్యాదు చేయండి

తూకాల్లో తేడాలు లేదా ఇతర ఉల్లంఘనలు గుర్తిస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని వినియోగదారులకు సూచించారు. వ్యాపారులు తూనికలు, కొలతల చట్టం, ప్యాకేజ్డ్ కమోడిటీస్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

గర్ల్స్ హాస్టల్ ముసుగులో అక్రమ అండాల దందా?

హైదరాబాద్, ప్రజా వాయిస్:హైదరాబాద్‌లో గర్ల్స్ హాస్టల్ పేరుతో సాగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమ అండాల సేకరణ వ్యవహారం కలకలం రేపుతోంది. యువతుల నుంచి అండాలు సేకరించి సంతాన సాఫల్య కేంద్రాలకు విక్రయిస్తున్నారనే సమాచారంతో పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. బేగంపేటలోని ప్రకాశ్‌నగర్ ప్రాంతంలో ఓ అపార్ట్‌మెంట్‌లో చేపట్టిన తనిఖీల్లో బిహార్, ఉత్తరప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన సుమారు 10 మంది యువతులను గుర్తించినట్లు సమాచారం. గర్ల్స్ హాస్టల్ ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్నారనే ఆరోపణలు కూడా తెరపైకి రావడంతో పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేపట్టారు.

ఏడాదిగా హాస్టల్ పేరుతో కార్యకలాపాలు?

పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం.. ప్రకాశ్‌నగర్‌లోని నజ్రాన్ అపార్ట్‌మెంట్‌లో ‘అమీ నీతా గర్ల్స్ హాస్టల్’ పేరుతో గత ఏడాది కాలంగా కార్యకలాపాలు సాగుతున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ నివసిస్తున్న యువతుల నుంచి అండాలు సేకరించి సంతాన సాఫల్య కేంద్రాలకు విక్రయిస్తున్నారనే సమాచారం పోలీసులకు అందింది. దీంతో మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి ఆదేశాల మేరకు శుక్రవారం తెల్లవారుజామున బేగంపేట పోలీసులు, ఎస్ఓటీ బృందాలు సంయుక్తంగా దాడులు నిర్వహించాయి.

నలుగురు యువతులు అదుపులోకి?

తనిఖీల్లో అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న సుమారు 10 మంది యువతులను పోలీసులు గుర్తించి విచారిస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో నలుగురు యువతులను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. అండాల సేకరణ, విక్రయాలు, సరఫరా వెనుక ఎవరున్నారు? సమీపంలోని సంతాన సాఫల్య కేంద్రాలకు వాటిని చేరవేస్తున్నారా? అనే అంశాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ నెట్‌వర్క్‌లో ఓ మహిళ కీలకంగా వ్యవహరిస్తున్నట్లు అనుమానిస్తూ ఆమెను కూడా ప్రశ్నిస్తున్నట్లు సమాచారం.

సమ్మతి ఉందా? నిబంధనలు పాటించారా?

అండాల సేకరణతో పాటు వాటి విక్రయాలు, సరఫరా వ్యవస్థలో ఎవరెవరి పాత్ర ఉందనే దానిపై దర్యాప్తు కొనసాగుతోంది. పురుషుల వీర్యకణాల సరఫరాకు కూడా ఈ వ్యవహారంతో సంబంధం ఉందా అనే కోణంలోనూ విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు, హాస్టల్ ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్నారనే ఆరోపణలు కూడా వెలుగులోకి వచ్చాయి. అయితే వీటిపై పూర్తి వివరాలు, పోలీసుల అధికారిక నిర్ధారణ ఇంకా వెల్లడికావాల్సి ఉంది.

బోడుప్పల్ టౌన్ ప్లానింగ్‌లో చైన్‌మెన్ల పెత్తనమా?

- **అక్రమ నిర్మాణాలకు పరోక్ష సహకారం**
- **స్థానికుల ఆరోపణలు**
- **ఏళ్ల తరబడి ఒకే చోట విధులు నిర్వహిస్తున్నారనే విమర్శలు**
- **నిర్మాణదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారంటూ ప్రచారం**
- **ఒకరికి ఒక న్యాయం.. మరొకరికి మరో న్యాయం అంటూ ప్రజల ఆవేదన**
- **ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోవడం లేదని స్థానికుల అసంతృప్తి**

బోడుప్పల్, ప్రజా వాయిస్:బోడుప్పల్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ విభాగంలో కొందరు చైన్‌మెన్ల వ్యవహారశైలి వివాదాస్పదంగా మారుతోంది. ఏళ్ల తరబడి ఒకే ప్రాంతంలో విధులు నిర్వహిస్తూ తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారి కనుసన్నల్లోనే కొన్ని ప్రాంతాల్లో టౌన్ ప్లానింగ్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన సిబ్బందే వాటికి పరోక్షంగా సహకరిస్తున్నారనే ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి.

మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నారా?

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొందరు చైన్‌మెన్లు అక్రమ నిర్మాణదారులకు, ఉన్నతాధికారులకు, రాజకీయ నాయకులకు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. నిర్మాణదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తూ వ్యవహారాలను చక్కబెడుతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది.



ఆదమరిస్తే అంతే సంగతులు..
..శిథిల వంతెనపై మృత్యుపాశం.!

- చెన్నారావుపేట రహదారిపై ప్రమాదకరంగా కల్వర్టు
- రక్షణ గోడలు మాయం.. గుంతలమయంగా మారిన వంతెన
- రాత్రివేళ ప్రయాణమంటేనే వాహనదారులకు హడల్
- 40 ఏళ్ల నాటి నిర్మాణం.. పట్టించుకోని అధికారులు
- కొత్త కల్వర్టు నిర్మించాలని ప్రజల డిమాండ్

ప్రజా వాయిస్, చెన్నారావుపేట: ఆదమరిస్తే ప్రమాదం, ఏమరపాటుగా ప్రయాణిస్తే ప్రాణాలకే ముప్పు చెన్నారావుపేట మండలంలోని ముద్దంపురం గ్రామ శివారు వద్ద ఉన్న కల్వర్టు వాహనదారులకు మృత్యుపాశంగా మారింది. నెక్కొండ,నర్సంపేట ప్రధాన రహదారిపై సుమారు 40 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ కల్వర్టు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. రహదారికి ఇరువైపులా ఉండాల్సిన రక్షణ గోడలు ధ్వంసమైపోవడంతో వంతెనపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది.కల్వర్టుపై పలుచోట్ల గుంతలు ఏర్పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో గుంతలు కనిపించక వాహనాలు అదుపుతప్పే ప్రమాదం పొంచి ఉంది. రక్షణ గోడలు లేకపోవడంతో ఏమాత్రం అదుపుతప్పినా వాహనాలు పక్కకు పడిపోయే పరిస్థితి నెలకొంది. వర్షాకాలంలో సమస్య మరింత తీవ్రమవుతోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఏళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శిథిల కల్వర్టును తొలగించి నూతన వంతెన నిర్మించడంతోపాటు తక్షణమే రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని వాహనదారులు, స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

రోడ్డు వేశారు.. భద్రతను మరిచారు..!

- కోదాడ ఖమ్మం క్రాస్ రోడ్ నుంచి మేళ్లచెరువు రోడ్డుకు కొత్త తారు రోడ్డు
- 20 రోజులైనా మార్జిన్లకు మట్టి లేదు
- రహదారి అంచులు కోత
- మలుపు వద్ద హెచ్చరిక బోర్డు కరువు
- ప్రమాదాలకు ఆస్కారం
- రెండు మీటర్ల మేర పేరుకుపోయిన మట్టి
- దుమ్ము, ధూళితో వాహనదారుల అవస్థలు
- రోడ్డు నిర్మాణం పూర్తయినా భద్రతా చర్యలు చేపట్టని వైనం



ప్రజా వాయిస్,కోదాడ: రోడ్డు నిర్మాణం పూర్తయితే సరిపోతుందా, వాహనదారుల భద్రతను గాలికొదిలేయడమేనా, నిబంధనలను పాటించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రశ్నించేది ఎవరు కోదాడ ఖమ్మం క్రాస్‌రోడ్ నుంచి మేళ్లచెరువు రోడ్డు వైపు కొత్తగా నిర్మించిన తారు రహదారిపై నెలకొన్న పరిస్థితులు ఈ ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. రోడ్డు నిర్మాణం పూర్తయి 20 రోజులు గడుస్తున్నా కనీస భద్రతా చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది.

మార్జిన్లకు మట్టి ఏదీ.?

కొత్తగా తారు రోడ్డు వేసిన తర్వాత రహదారి అంచులకు మట్టి లేదా గ్రావెల్ నింపి రోడ్డు స్థాయికి సమానంగా చేయాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ మార్జిన్లకు మట్టి వేయకపోవడంతో రోడ్డు అంచులు కోతకు గురవుతున్నాయి. వాహనాలు రోడ్డు పక్కకు దిగినప్పుడు అదుపు తప్పే ప్రమాదం ఉంది. రహదారి పక్కన పేరుకుపోయిన మట్టిని తొలగించక పోవడంతో దుమ్ము, ధూళి వాహనదారులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

మలుపు వద్ద బోర్డు కరువు

రోడ్డుపై మలుపు ఉన్నప్పటికీ అక్కడ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయలేదు. కొత్త రహదారిపై ప్రయాణించే వాహనదారులకు మలుపు గురించి ముందస్తు సమాచారం లేకపోవడంతో ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతోంది. రహదారిపై అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్లు, వేగ పరిమితి సూచికలు ఏర్పాటు చేయాల్సి ఉన్నా పట్టించుకున్న దాఖలాలు లేవు.

మార్కింగ్స్ లేక రాత్రివేళ ఇబ్బందులు

కొత్త రహదారిపై అంచులను సూచించే తెల్లటి గీతలు, మధ్య రేఖలు వంటి రోడ్ మార్కింగ్స్ వాహనదారులకు దారి చూపుతాయి. ముఖ్యంగా రాత్రివేళ రిఫ్లెక్టివ్ మార్కింగ్స్ భద్రతకు ఎంతో అవసరం. రహదారిపై అవసరమైన మార్కింగ్స్, హెచ్చరిక సూచికలు లేకపోవడం వల్ల వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది.

రోడ్డు వేయడమే బాధ్యతా.?

రోడ్డు నిర్మాణం పూర్తయిన తర్వాత రహదారి భద్రత, నిర్వహణకు సంబంధించిన చర్యలు కూడా చేపట్టాల్సి ఉంటుంది. రోడ్డు పక్కన మట్టి నింపడం, పేరుకుపోయిన మట్టిని తొలగించడం, అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు, రోడ్ మార్కింగ్స్ ఏర్పాటు చేయడం వంటి పనులు చేపట్టాలి. రోడ్డు ఉపరితలంపై మిగిలిపోయిన వదులైన కంకరను తొలగించడం కూడా అవసరం.అయితే ఇక్కడ రోడ్డు నిర్మాణం పూర్తయి 20 రోజులు గడుస్తున్నా ఈ పనులు చేపట్టకపోవడం అధికారుల పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. రోడ్డు వేసి చేతులు దులుపుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అధికారులు స్పందించేది ఎప్పుడు.?

కొత్త రహదారిపై భద్రతా చర్యలు చేపట్టకపోవడం వాహనదారులకు ప్రమాదకరంగా మారుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మార్జిన్లకు మట్టి నింపడంతో పాటు పేరుకుపోయిన మట్టిని తొలగించాలి. మలుపు వద్ద హెచ్చరిక బోర్డు, అవసరమైన రోడ్ మార్కింగ్స్ ఏర్పాటు చేసి వాహనదారుల భద్రతకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



తుఫాన్ బాధితులకు విద్యుత్ వెలుగులు పంచేందుకు మిర్యాలగూడ బృందాలు ఏపీకి పయనం


- విద్యుత్ పునరుద్ధరణకు తెలంగాణ విద్యుత్ సంస్థ ప్రత్యేక సహాయక చర్యలు
- తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లో సేవలందిం చనున్న సిబ్బంది

ప్రజా వాయిస్,మిర్యాలగూడ.ఆంధ్రప్రదేశ్‌లో తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరించేందుకు తెలంగాణ విద్యుత్ సంస్థ తన సహాయక బృందాలను రంగంలోకి దించింది. ఇందులో భాగంగా మిర్యాలగూడ డివిజన్‌కు చెందిన ప్రత్యేక విద్యుత్ సహాయక బృందాలు ఏపీకి బయలుదేరాయి.టీజీఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ పాటిల్ ఆదేశాల మేరకు నల్గొండ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ బృందాలను ఏర్పాటు చేశారు.తుఫాన్ కారణంగా ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లో విద్యుత్ స్తంభాలు, లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. విద్యుత్ సరఫరాను త్వరితగతిన పునరుద్ధరించేందుకు ప్రత్యేక వాహనాలు, అత్యాధునిక బ్యాటరీ ట్రీ ప్రూనర్లు, అవసరమైన అత్యవసర పరికరాలతో విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది శుక్రవారం తెల్లవారుజామున ఏపీకి పయనమయ్యారు. ఉన్నతాధికారులు జెండా ఊపి బృందాల వాహనాలను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాస్ ఆచారి, డివిజన్ ఏడీఈలు తిరుపతయ్య, కోడిరెక్క రవికుమార్, ఇందిరా, ఏఈలు వినోద్ కుమార్, రవీందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, జానయ్య, కృష్ణారెడ్డి, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్లు మారం శ్రీనివాస్, వీరభద్రం, ఎల్లయ్య చారి, భిక్షం, జలంధర్, భాస్కర్, సతీష్, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

భర్త అంత్యక్రియల మరుసటి రోజే భార్య మృతి

- ఒక్కరోజు వ్యవధిలోనే భార్యాభర్తలు మృతి
- ఛిన్నాభిన్నమైన కుటుంబం
- అనాథలైన ఇద్దరు పిల్లలు..దిక్కుతోచని స్థితిలో వృద్ధ తల్లి
- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన నాగర్ల రఘునాథ్ రెడ్డి

ప్రజా వాయిస్ ,వీపనగండ్ల:ఆ కుటుంబాన్ని విధి వెంటాడింది. నిన్న భర్త మరణం.. నేడు భార్య కన్నుమూత! ఒక్కరోజు వ్యవధిలోనే భార్యాభర్తలు ఇద్దరూ మృత్యువాత పడటంతో కుటుంబం చిన్నాభిన్నమైంది. తల్లిదండ్రులిద్దరినీ కోల్పోయిన ఇద్దరు పిల్లలు అనాథలుగా మిగిలారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లి కొడుకు, కోడలిని కోల్పోయి కన్నీరుమున్నీరవుతోంది. ఈ హృదయ విదారక ఘటన వీపనగండ్ల మండలం పుల్గర్ చర్ల గ్రామంలో చోటుచేసుకుంది.గ్రామానికి చెందిన సాకలి నిరంజన్ ఇటీవల అకాల మరణం చెందారు. ఆయన అంత్యక్రియలు పూర్తయిన మరుసటి రోజే భార్య మొగులమ్మ కూడా మృతి చెందారు. భర్త మరణంతో తీవ్ర మనోవేదనకు గురైన ఆమె అనారోగ్యంతో కన్నుమూసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వరుసగా రెండు మరణాలు ఆ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపాయి.నిరంజన్ దంపతులకు కుమారుడు శివ (17), కుమార్తె కీర్తి (20) ఉన్నారు. తల్లిదండ్రులిద్దరూ దూరం కావడంతో వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు నిరంజన్ తల్లి అలివేలమ్మ (65) కొడుకు, కోడలిని కోల్పోయి దిక్కుతోచని స్థితిలో మిగిలారు. గ్రామస్తులు ఎంతగా ఓదార్చినా కుటుంబ సభ్యుల ఆవేదన తీరనిదిగా మారింది.




బాధితులకు అండగా ఉంటాం

విషయం తెలుసుకున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నాగర్ల రఘునాథ్ రెడ్డి పుల్గర్ చర్లకు చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నిరంజన్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ మంచి కార్యకర్తను కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. అనాథలైన పిల్లలకు, వృద్ధ తల్లికి అన్ని విధాలా అండగా ఉంటామని, ప్రభుత్వ సహాయ సహకారాలు అందేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.

రూ. 22 వేల లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కిన జీపీఓ డి. శ్రీనివాస్

- భూమి వారసత్వ సవరణ నివేదిక కోసం లంచం డిమాండ్
- తన కార్యాలయంలోనే రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న ఆదిలాబాద్ ఎసిబి అధికారులు
- నిందితుడి అరెస్ట్.. కరీంనగర్ ఎసిబి కోర్టుకు తరలింపు

ప్రజా వాయిస్, మంచిర్యాల /ఆదిలాబాద్ వ్యవసాయ భూమి రికార్డుల్లో తండ్రి పేరు సవరించి వారసత్వ హక్కులు కల్పించేందుకు లంచం డిమాండ్ చేసిన గ్రామా పాలనాధికారి (GPO) ఎసిబి అధికారులకు చిక్కిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఆదిలాబాద్ రేంజ్ ఎసిబి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా పరిధిలోని మోసం గ్రామానికి చెందిన జీపీఓ డి. శ్రీనివాస్, బాధితుడి తండ్రి పేరును రెవెన్యూ రికార్డుల్లో సరిచేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపేందుకు గానూ రూ. 22,000 లంచం డిమాండ్ చేశారు. బాధితుడు ఎసిబి అధికారులను ఆశ్రయించడంతో, వారి సూచనల మేరకు గురువారం తన కార్యాలయంలోనే శ్రీనివాస్ రూ. 22,000 లంచం తీసుకుంటుండగా పక్కా ప్రణాళికతో దాడులు చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సదరు సొమ్మును స్వాధీనం చేసుకుని, అధికారాన్ని దుర్వినియోగం చేసిన అధికారిని అరెస్ట్ చేశారు. నిందితుడిని కరీంనగర్ ఎసిబి ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం అడిగితే టోల్ ఫ్రీ నంబర్ 1064 లేదా వాట్సాప్ 9440446106 ద్వారా ఫిర్యాదు చేయాలని ఎసిబి అధికారులు కోరారు.



ప్రజా వాయిస్ కథనంతో కదిలిన యంత్రాంగం..
నకిలీ సిగరెట్ల గుట్టు రట్టు.!

- తుర్కపల్లిలో రూ.4 లక్షల విలువైన 51,100 సిగరెట్లు పట్టివేత
- 206 కార్టన్ల నకిలీ సిగరెట్లు స్వాధీనం.. ఒకరు అరెస్ట్
- కారు, సెల్ ఫోన్ సీజ్ .. అక్రమ వ్యాపారం వెనుక మరెవరున్నారు.?
- బేగంబజార్ నుంచి తుర్కపల్లికి అక్రమ రవాణా
- ప్రజా వాయిస్ కథనంతో స్పందించిన పోలీసులు

ప్రజా వాయిస్,తుర్కపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలో ప్రముఖ బ్రాండ్ల పేర్లతో నకిలీ సిగరెట్ల విక్రయాలు సాగుతున్నాయంటూ ప్రజా వాయిస్ ప్రచురించిన కథనం అధికార యంత్రాంగంలో కదలిక తెచ్చింది. కథనంతో అప్రమత్తమైన పోలీసులు అక్రమ సిగరెట్ల రవాణాపై నిఘా పెట్టి భారీగా నకిలీ సిగరెట్లను పట్టుకున్నారు. ఈ ఘటనలో ఒకరిని అరెస్టు చేసి, 51,100 సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. మార్కెట్ ధరల ప్రకారం వీటి విలువ సుమారు రూ.4 లక్షల వరకు ఉంటుందని అంచనా.అక్టోబర్ 29న హైదరాబాద్‌లోని బేగంబజార్ నుంచి తుర్కపల్లి మండలానికి అనుమానిత నకిలీ సిగరెట్లు తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో రంగా ఫంక్షన్ హాల్ ఎదురుగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఏపీ-29-బీయూ-8155 నంబరు గల బూడిద రంగు మారుతి సుజుకి వాగన్‌ఆర్ కారును తనిఖీ చేయగా, ప్రముఖ సిగరెట్ బ్రాండ్లను పోలిన కార్టన్లు బయటపడ్డాయి. కారులో ఉన్న రాజేంద్రనగర్‌కు చెందిన మెదిశెట్టి సురేందర్ (46)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



206 కార్టన్ల సిగరెట్లు స్వాధీనం

పోలీసులు స్వాధీనం చేసుకున్న సిగరెట్లలో గోల్డ్ ఫ్లేక్ కింగ్స్ 27 కార్టన్లు, గోల్డ్ ఫ్లేక్ లైట్స్ 50, గోల్డ్ ఫ్లేక్ స్మాల్ 27, విల్స్ ఫ్లేక్ 6, మార్ల్‌బరో 96 కార్టన్లు ఉన్నాయి. మొత్తం 206 కార్టన్లలో 5,110 బాక్సులు, 51,100 సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు అక్రమ రవాణాకు ఉపయోగించిన కారును, శామ్‌సంగ్ డ్యూయోస్ మొబైల్ ఫోన్‌ను సీజ్ చేశారు.

కార్టన్ పై రూ.60 వేలు.. విక్రయించేది రూ.80 వేలకు

విచారణలో నిందితుడు బేగంబజార్‌కు చెందిన కైలాష్ యాదవ్ వద్ద ఒక్కో కార్టన్‌ను రూ.60 వేల చొప్పున కొనుగోలు చేసి, తుర్కపల్లి మండలంలోని వివిధ పాన్ షాపులకు రూ.80 వేల చొప్పున విక్రయిస్తున్నట్లు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. ఈ అక్రమ వ్యాపారం వెనుక ఉన్న మూలాలు, ఇతర వ్యక్తుల పాత్రపై దర్యాప్తు కొనసాగుతోంది.



కేసు నమోదు.. నిందితుడి అరెస్టు

ఈ ఘటనపై తుర్కపల్లి పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 212/2026 కింద బీఎన్ఎస్ సెక్షన్లు 318(4), 349, 275 r/w 3(5), కాపీరైట్ చట్టంలోని సెక్షన్ 63 ప్రకారం కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరుస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్, ఐపీఎస్, డీఎస్పీ పి. శ్రీనివాస్ నాయుడు పర్యవేక్షణలో యాదగిరిగుట్ట రూరల్ సీఐ ఎం. శంకర్ ఆధ్వర్యంలో తుర్కపల్లి ఎస్ఐ ఎం. శివకృష్ణ, పోలీసు సిబ్బంది ఈ కేసును ఛేదించారు.ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రజా వాయిస్ చేస్తున్న కథనాలకు అధికారుల నుంచి స్పందన లభించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మూల మలుపులు మృత్యుపాశాలు?..

- పాపన్నపేట మండలంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని గ్రామస్థుల ఆవేదన

ప్రజా వాయిస్, పాపన్నపేట,పాపన్నపేట మండల వ్యాప్తంగా ఉన్న ప్రధాన రోడ్లు, అంతర్గత రహదారులపై ఉన్న మూల మలుపులు ప్రయాణికులకు ప్రాణసంకటంగా మారుతున్నాయి. ఎలాంటి హెచ్చరిక బోర్డులు, సూచికలు లేకపోవడం వల్ల వాహనదారులు, ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రయాణించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు.ప్రమాదాలకు నిలయంగా మలుపులుమండలంలోని పలు గ్రామాలను కలిపే ప్రధాన రహదారులపై అకస్మాత్తుగా వచ్చే మలుపుల వద్ద వాహనాలు అదుపుతప్పి బోల్తా పడుతున్న సంఘటనలు రోజూవారీగా జరుగుతున్నాయి. కొత్త ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులకు రోడ్డు తీరు తెన్నులు తెలియకపోవడంతో మలుపుల వద్ద వేగం నియంత్రించలేక ప్రమాదాలకు గురవుతున్నారు.గ్రామస్థుల ఆందోళనప్రాణనష్టం జరుగుతున్నా స్పందన కరువు: పలుమార్లు ఈ ప్రమాదాలలో అమాయక ప్రజలు గాయాలపాలవుతున్నారని, ప్రాణాలు కోల్పోతున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు విజ్ఞప్తి: ప్రమాదాలు జరగకముందే స్పందించి, వెంటనే ప్రతి మూల మలుపు వద్ద 'ప్రమాదకరమైన మలుపు' సూచిక బోర్డులు, రిఫ్లెక్టర్లు ఏర్పాటు చేయాలని అధికారులను కోరుతున్నారు. రాత్రి వేళల్లో ఇబ్బందులు: స్ట్రీట్ లైట్లు సరిగా లేని చోట్ల మలుపులు అసలు కనబడక ద్విచక్ర వాహనదారులు కిందపడి తీవ్రంగా గాయపడుతున్నారు.సంబంధిత పంచాయతీ మరియు రోడ్లు, భవనాల శాఖ అధికారులు తక్షణమే స్పందించి, మండలంలోని అన్ని మూల మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.



మా తండాకు రోడ్లు వేస్తారా!..వేయరా..?

- రోడ్ల అవస్తలో గిరిజనుల బాధలు కనబడతలేవా..?
- సావు...బతుకుల్లో ఉన్న ఆసౌకర్యాలతో గిరిజనులు
- ఐదుదోనాల తండాపై గిరిజనులు పడుతున్న దుస్థితి
- గిరిజనులపై "ప్రజావాయిస్" ప్రత్యేక కథనం

ప్రజావాయిస్/సంస్థాన్ నారాయణపురం యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని రాచకొండ ప్రాంతంలో అట్టడుగున ఉన్న ఐదుదోనాల తండా గిరిజనులు రోడ్డు రవాణా సరిగ్గా లేక నరకయాతన అనుభవిస్తున్నారు.నాగరికత ఎంతో అభివృద్ధి చెందుతోందని గొప్పలు చెప్పుకుంటున్న కాలంలోనూ,తమ బ్రతుకులు మాత్రం కనీస సౌకర్యాలకు నోచుకోకుండా గోరంగా రోడ్డు దుస్థిస్థి మారాయని తండావాసులు వాపోతున్నారు.కనీసం ఈ ప్రాంతానికి రవాణా సౌకర్యాలు కల్పిస్తామని గత ప్రభుత్వాలు, స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గతంలో హామీలు ఇచ్చారు. కానీ ఇప్పటివరకు ఎలాంటి రోడ్డు రవాణా సౌకర్యం కల్పించలేదని గిరిజనులు ఆరోపిస్తున్నారు. స్థానికంగా ఉన్న ఎమ్మెల్యే కూడా తమ ప్రాంతాన్ని పట్టించుకోకుండా, కేవలం ఎన్నికలు వచ్చే సమయంలోనే మా తండాలు గుర్తుకువస్తాయని మండిపడుతున్నారు. ఈ ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనులు ఎలా బతుకుతున్నారు? కనీసం వారికి రోడ్డు రవాణా సౌకర్యాలు ఉన్నాయా లేదా? అని ప్రజాప్రతినిధులు, అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలన్నా, రాత్రి పూట అత్యవసర సమయాల్లో గర్భిణీలకు, చిన్న పిల్లలకు ఆరోగ్య సమస్యలు ఎదురైనా ఈ రోడ్ల వెంట వెళ్లడం ప్రాణాల మీదకు తెస్తోంది. మట్టి, కంకర తేలిన ఈ రోడ్లపై ప్రయాణిస్తే కిందపడి ప్రమాదాలు జరిగే పరిస్థితి నిత్యం నెలకొని ఉంది. ఒకవేళ ఈ ప్రాంతానికి ఎమర్జెన్సీ కోసం ఒక అంబులెన్స్ రమ్మంటే..రోడ్డు సౌకర్యం కనీసం లేదు,అంబులెన్స్ రాదు అని చెప్పే దుస్థితి నెలకొంది. దయచేసి స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరియు అధికారులు మాపై దయ చూపి గిరిజనుల గోడును ఆలకించాలని తండావాసులు కోరుతున్నారు. రోడ్డు వ్యవస్థను సక్రమంగా సరిచేసి, మాకు రవాణా రక్షణ కల్పించి న్యాయం చేయాలని వారు వేడుకుంటున్నారు.

బల్దియాలో మూడుపార్టీల మంటలు.!

- ఆధిపత్య పోరుతో అస్తవ్యస్తంగా మున్సిపల్ పాలన
- ఆరోపణలు, ప్రత్యారోపణలతో వేడెక్కిన రాజకీయం
- చైర్ పర్సన్ భర్తపై బీజేపీ, బీఆర్ ఎస్ కౌన్సిలర్ల ఘాటు విమర్శలు
- పట్టణ సమస్యలపై బీజేపీ ధర్నా
- స్క్రాప్ అమ్మకాలపై అక్రమార్జన ఆరోపణలు
- రెండు పార్టీలపై కాంగ్రెస్ కౌన్సిలర్ల ఎదురుదాడి
- చికెన్ వ్యర్థాల టెండర్లలో అవకతవకలపై ఫిర్యాదులు
- పనుల కోసం కార్యాలయం చుట్టూ పౌరుల ప్రదక్షిణలు



ప్రజావాయిస్,కామారెడ్డి: కామారెడ్డి మున్సిపల్‌లో రాజకీయ రగడ రాజుకుంటోంది. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య ఆధిపత్య పోరు.. అస్తిత్వ ఆరాటం బల్దియా పాలనను వేడెక్కిస్తోంది. పట్టణ సమస్యల పరిష్కారంపై బీజేపీ కౌన్సిలర్లు ఆందోళన బాట పట్టగా.. చైర్‌పర్సన్ భర్త పెత్తనంపై బీఆర్ఎస్ కౌన్సిలర్లు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ ఆరోపణలను కాంగ్రెస్ కౌన్సిలర్లు దీటుగా తిప్పికొడుతున్నారు. మరోవైపు మున్సిపల్ అధికారుల అవకతవకలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతుండటంతో పాలనపై విమర్శలు తీవ్రమవుతున్నాయి.ఆధిపత్య పోరు.. ఆరోపణల హోరుగత మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు పోటాపోటీగా కౌన్సిలర్ స్థానాలు దక్కాయి. బీఆర్ఎస్ మద్దతుతో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ చైర్‌పర్సన్‌గా, బీఆర్ఎస్‌కు చెందిన కాసర్ల గోదావరి స్వామి వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. అయితే మున్సిపల్ పాలనలో మూడు పార్టీల మధ్య సమన్వయం కరువైందనే విమర్శలు వినిపిస్తున్నాయి.చైర్‌పర్సన్ భర్త శ్రీనివాస్ షాడో చైర్మన్‌గా వ్యవహరిస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని బీజేపీ కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు. పట్టణ సమస్యలను పట్టించుకోవడం లేదని, పండుగల సమయంలో కనీస ఏర్పాట్లు చేయడంలోనూ విఫలమయ్యారని విమర్శిస్తున్నారు.

స్క్రాప్ అమ్మకాలపై రగడ

వినాయక చవితి, దుర్గామాత నిమజ్జనాల సందర్భంగా సుమారు 1,100 విగ్రహాల నిమజ్జనం జరిగిందని, ఈ సందర్భంగా లభించిన టన్నుల కొద్దీ ఇనుప సామగ్రిని అక్రమంగా విక్రయించి మున్సిపల్ ఆదాయానికి గండి కొట్టారని బీజేపీ కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు. లక్షల రూపాయల విలువైన స్క్రాప్ మాయమైన వ్యవహారంపై ధర్నా చేపట్టారు.రోడ్లపై గుంతలు, పట్టణ సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. రెండు నెలలుగా మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించకపోవడంపై కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. వార్డుల అభివృద్ధికి తీర్మానించిన రూ.28 లక్షలు కేటాయించలేదని ఆరోపించారు.

చికెన్ వ్యర్థాల టెండర్లలో అక్రమాలు.?

మున్సిపల్ చికెన్ వ్యర్థాల టెండర్ల వ్యవహారం మరో వివాదానికి కేంద్రంగా మారింది. టెండర్లలో అవకతవకలు చోటుచేసుకుని రంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కోఆప్షన్ సభ్యుడిగా వచ్చిన రియల్ ఎస్టేట్ వ్యాపారి కుంభాల రవి తన వెంచర్‌ను కాపాడుకునేందుకే చైర్‌పర్సన్ భర్తపై ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ కౌన్సిలర్లు ఎదురుదాడి చేశారు. బెదిరింపులకు భయపడేది లేదని స్పష్టం చేశారు.

కార్యాలయం చుట్టూ పౌరుల ప్రదక్షిణలు

మున్సిపల్ పాలన అస్తవ్యస్తంగా మారడంతో పట్టణ ప్రజలు కనీస సేవల కోసం కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంటి నిర్మాణ అనుమతి కోసం రూ.10 వేలు డిమాండ్ చేశారని టౌన్ ప్లానింగ్ అధికారి వాసులు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు.పట్టణంలో రోడ్లు, పారిశుద్ధ్యం, ఇతర సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్ కౌన్సిలర్లు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ కృషితో 49 వార్డుల అభివృద్ధికి, స్టేడియం, మంచినీటి సరఫరా, మిషన్ భగీరథ పనులకు పందల కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయని చెబుతున్నారు.మొత్తంగా కామారెడ్డి బల్దియాలో మూడు పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతుండగా.. ఆరోపణలు, ప్రత్యారోపణల మధ్య పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యలు వెనుకబడుతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది.





మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే జైలుకే

- ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాల మోత
- డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ఇద్దరికి జైలుశిక్ష
- 10 కేసుల్లో రూ.22,700 జరిమానా
- నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవు
- ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ బి. ప్రమోద్ కుమార్

జా వాయిస్||శంషాబాద్:ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై ఆర్జీఐఏ ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝళిపించారు.అక్టోబర్ 30న రాజేంద్రనగర్ పదో ప్రత్యేక న్యాయస్థానంలో నిర్వహించిన కేసుల విచారణలో మొత్తం 10 కేసులను పరిష్కరించి రూ.22,700 జరిమానా విధించారు.మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇద్దరికి న్యాయస్థానం జైలుశిక్ష విధించింది. అబ్దుల్ ఘయాజ్‌కు రెండు రోజుల సాధారణ కారాగార శిక్షతో పాటు రూ.3,000 జరిమానా,కే. ఆంజనేయులుకు ఒక రోజు జైలుశిక్షతో పాటు రూ.3,200 జరిమానా విధించింది.మరో ఐదుగురికి డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో రూ.12,000,డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన ముగ్గురికి రూ.4,500 జరిమానా విధించారు.ఈ సందర్భంగా శంషాబాద్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి.ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ.. రహదారి భద్రత విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.మద్యం సేవించి వాహనాలు నడపవద్దని,డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపకూడదని సూచించారు.వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులకు సహకరించాలని కోరారు.

ఆశా సేవలపై పర్యవేక్షణ ఏదీ?

- గర్భిణుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం
- గ్రామాల్లో వైద్య సేవల తీరుపై ప్రశ్నలు!
- విధుల నిర్వహణపై అధికారుల సమీక్ష కరువు?
- గర్భిణులకు నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలి
- క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని గ్రామీణ ప్రజల డిమాండ్



ప్రజా వాయిస్/వికారాబాద్ జిల్లా బ్యూరో: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషించాల్సిన ఆశా వర్కర్ల పనితీరుపై పర్యవేక్షణ కొరవడుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలకు సకాలంలో వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం జరుగుతోందనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి.గర్భిణుల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకోవడం, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించడం, రక్తహీనతపై అవగాహన కల్పించడం, అవసరమైన మందులు అందేలా చూడటం ఆశా వర్కర్ల ప్రధాన బాధ్యతలు. అయితే కొన్ని గ్రామాల్లో ఈ సేవలు ఆశించిన స్థాయిలో అందుతున్నాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ఆశా వర్కర్లు విధులను సక్రమంగా నిర్వహిస్తున్నారా? గర్భిణుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నారా? వారికి అవసరమైన వైద్య సేవలు అందుతున్నాయా? అనే అంశాలను పరిశీలించాల్సిన వైద్యాధికారులు క్షేత్రస్థాయిలో ఎంతవరకు పర్యవేక్షిస్తున్నారనే చర్చ జరుగుతోంది.

అధికారులు స్పందించాలి..

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, పీహెచ్‌సీ వైద్యాధికారులు గ్రామాలను సందర్శించి ఆశా వర్కర్ల విధులపై సమీక్ష నిర్వహించాలి. గర్భిణులకు వైద్య సేవలు అందడంలో ఎక్కడైనా లోపాలు ఉంటే గుర్తించి సరిదిద్దాలి. తల్లి, బిడ్డ ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ నిరంతర పర్యవేక్షణ చేపట్టాలి.ప్రభుత్వ ఆరోగ్య సేవలు కాగితాలకే పరిమితం కాకుండా ప్రతి గర్భిణీకి అందినప్పుడే వాటి లక్ష్యం నెరవేరుతుంది. ఈ దిశగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు



సమస్యలపై సర్పంచుల గళం

- అధికారుల దృష్టికి గ్రామ సమస్యలు.!
- విద్యుత్, తాగునీటి సమస్యలపై వాడివేడిగా చర్చ
- గైర్హాజరైన సభ్యులపై ఎంపీడీఓ ఆగ్రహం
- నీరు, విద్యుత్ పొదుపుగా వినియోగించుకోవాలి
- మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి సూచన

ప్రజావాయిస్,మోమిన్‌పేట:మోమిన్‌పేట్ మండల సర్వసభ్య సమావేశం వాడివేడిగా సాగింది. గ్రామాల్లో నెలకొన్న విద్యుత్, తాగునీటి సమస్యలపై సర్పంచులు గళమెత్తారు. ఆయా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, తక్షణ పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు.ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఎలనినో ప్రభావం నేపథ్యంలో నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. మరోవైపు సమావేశానికి గైర్హాజరైన సభ్యులపై ఎంపీడీఓ సృజన సాహిత్య అసహనం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహించే సమావేశాలకు సభ్యులు తప్పని సరిగా హాజరుకావాలని సూచించారు.ఈ సమావేశంలో ప్రత్యేకాధికారి సదానందం, పీఏసీఎస్ చైర్మన్ శంకర్ యాదవ్, తహసీల్దార్ మునిరొద్దీన్, ఎంపీఓ సంజయ్ కుమార్, అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.





నకిలీ తూనికలపై లీగల్ మెట్రాలజీ ఉక్కుపాదం.!

- నిర్మల్ లో ఆకస్మిక తనిఖీలు
- రెండు వ్యాపార సంస్థలపై కేసులు నమోదు
- నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు: జిల్లా అధికారి పి. శంకర్

ప్రజా వాయిస్,నిర్మల్: వినియోగదారులను మోసం చేస్తూ, ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించే వ్యాపారులపై లీగల్ మెట్రాలజీ శాఖ కొరడా ఝళిపించింది. నిర్మల్ పట్టణంలోని పలు వ్యాపార సంస్థల్లో శుక్రవారం అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన రెండు ప్రముఖ వ్యాపార సంస్థలపై కేసులు నమోదు చేసినట్లు జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి పి. శంకర్ వెల్లడించారు.వ్యాపారులు తమ సంస్థల్లో వినియోగించే ఎలక్ట్రానిక్ వెయింగ్ మిషన్లు, కాండా బాట్లు, ఇతర తూనిక పరికరాలకు నిర్ణీత గడువులోగా లీగల్ మెట్రాలజీ శాఖ ద్వారా స్టాంపింగ్ చేయించుకోవాలని ఆయన సూచించారు. స్టాంపింగ్ గడువు ముగిసిన లేదా ముద్రలు లేని పరికరాలను వినియోగిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.అలాగే, వస్తువులను ప్యాకింగ్ చేసి విక్రయించే వ్యాపారులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్యాకింగ్ లైసెన్స్ పొందాలని స్పష్టం చేశారు. లైసెన్స్ లేకుండా విక్రయాలు జరిపితే సంబంధిత వస్తువులను సీజ్ చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.జిల్లాలోని వ్యాపారులందరూ ప్రభుత్వ నిబంధనలకు లోబడి, పారదర్శకంగా వ్యాపారాలు నిర్వహించుకోవాలని సూచించారు. వినియోగదారుల ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా అధికారి పి. శంకర్ హెచ్చరించారు. తనిఖీల్లో లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇది మీకు తగునా సీఐ ఇంద్రసేనారెడ్డి

- గోదావరిఖనిలో ప్రజాస్వామ్యం ఉందా.. ప్రశ్నించే గొంతుకలను అణచివేస్తారా?
- దళిత కార్పొరేటర్ పై పోలీసుల తీరును ప్రశ్నించిన సీఐ ఇంద్రసేనారెడ్డి
- ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దగ్ధం చేస్తే చొక్కా చించి, మెడలు పట్టుకుని లాక్కెళ్లడం ఎంతవరకు న్యాయం?
- అధికార పార్టీ నాయకుల రోడ్డు బంద్ లు, సభలపై పోలీసుల చర్యలేవీ?
- పేదరికం గా కనిపిస్తే ఈ సీఐ కి వెర్రెక్కుతోంది
- సీఐ ని సస్పెండ్ చేయాలని దళిత సంఘాలు డిమాండ్

ప్రజా వాయిస్ గోదావరిఖని పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రాంతంలో పోలీసుల తీరు రోజురోజుకు ప్రశ్నార్థకంగా మారుతోందని సీఐ ఇంద్రసేనారెడ్డి తీవ్రంగా స్పందించారు. అధికార పార్టీ నాయకుల కార్యక్రమాలకు ఒక రకంగా, ప్రతిపక్షాల నిరసనలకు మరో రకంగా పోలీసులు వ్యవహరిస్తున్నారా? ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలకు నిరసన తెలిపే హక్కు లేదా? ప్రశ్నించే గొంతుకలను అణచివేయడమే లక్ష్యంగా పోలీసుల చర్యలు సాగుతున్నాయా? అంటూ ఆయన ప్రశ్నించారు. రామగుండం ఎమ్మెల్యే మక్కా సింగ్‌కు వ్యతిరేకంగా దిష్టిబొమ్మ దగ్ధం చేశాడనే కారణంతో దళిత కార్పొరేటర్ సిపిఐ ఫ్లోర్ లీడర్ మార్కాపురి సూర్య చొక్కా చించి, మెడలు పట్టుకుని పోలీసులు లాక్కెళ్లడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. చిన్నపాటి నిరసనకే ఇంతటి కఠినంగా వ్యవహరించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ నాయకులు రోడ్లను బంద్ చేసి, ట్రాఫిక్‌ను నిలిపివేసి సభలు నిర్వహించిన సందర్భాల్లో పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. దేశ ప్రధాని, ప్రధాన ఎన్నికల కమిషనర్ దిష్టిబొమ్మలు దగ్ధం చేసిన సందర్భాల్లో ఎన్ని కేసులు నమోదు చేశారని నిలదీశారు. ప్రతిపక్షాల నిరసనలపై వెంటనే స్పందించే పోలీసులు, అధికార పార్టీ నాయకుల కార్యక్రమాల విషయంలో అదే స్థాయిలో స్పందిస్తున్నారా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయని పేర్కొన్నారు.

ప్రతిపక్షాలను బ్యాన్ చేసే చట్టం తెస్తే సరిపోతుందా?

గోదావరిఖని ప్రాంతంలో పోలీసుల తీరు చూస్తుంటే ప్రతిపక్షాలను నిషేధిస్తున్నామని ఒక చట్టం తెస్తే సరిపోతుందనే పరిస్థితి కనిపిస్తోందని ఇంద్రసేనారెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, ప్రశ్నించే గొంతుకలను అణచివేయాలని చూస్తే అది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలపై స్పందించే నాయకులను, నిరసన తెలిపే ప్రతిపక్షాలను పోలీసుల ద్వారా అణచివేయాలని చూస్తే ప్రజాస్వామ్యంలో అది నడవదని ఆయన హెచ్చరించారు.

పోలీసులారా.. ఇది మీకు తగునా?

ఒక దళిత కార్పొరేటర్ నిరసన తెలిపినందుకు చొక్కా చించి, మెడలు పట్టుకుని లాక్కెళ్లడం పోలీసుల విధి నిర్వహణలో భాగమేనా? ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన పోలీసులే ప్రశ్నించే గొంతుకలను అణచివేస్తే సామాన్య ప్రజలకు న్యాయం ఎక్కడ లభిస్తుందని ఇంద్రసేనారెడ్డి ప్రశ్నించారు. అధికార పార్టీ, ప్రతిపక్షాల విషయంలో సమానంగా వ్యవహరించి ప్రజాస్వామ్య హక్కులను కాపాడాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని పేర్కొన్నారు.







కాకతీయుల కళావైభవానికి విదేశీ అతిథుల ఫిదా

- రామప్ప రమణీయతను తిలకించిన బంగ్లాదేశ్ జర్నలిస్టులు, అధికారులు
- 40 మంది ప్రతినిధుల బృందానికి ఘన స్వాగతం
- ఆలయ విశిష్టతలను వివరించిన అర్చకులు, పర్యాటక మార్గదర్శి
- రామప్ప శిల్పకళ, నిర్మాణ నైపుణ్యం అద్భుతమంటూ ప్రశంసలు.

ప్రజా వాయిస్ – ములుగు జిల్లా ప్రతినిధి: తెలంగాణ చారిత్రక వైభవానికి ప్రతీకగా, ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన ములుగు జిల్లా పాలంపేటలోని రామప్ప దేవాలయాన్ని శుక్రవారం బంగ్లాదేశ్‌కు చెందిన 40 మంది జర్నలిస్టులు, అధికారులు సందర్శించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్న ఈ బృందం భారత్ దర్శన్ కార్యక్రమంలో భాగంగా రామప్ప క్షేత్రానికి చేరుకుంది.ఈ సందర్శనంగా ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్ సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతినిధులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం పర్యాటక మార్గదర్శి గోరంట్ల విజయ్ కుమార్ బృందానికి రామప్ప దేవాలయ చరిత్ర, కాకతీయుల కాలం నాటి నిర్మాణ విశేషాలు, అపురూపమైన శిల్పకళా సంపద, ఆలయ ప్రత్యేకతలను వివరించారు.

కాకతీయుల శిల్పకళకు అద్దం పట్టిన రామప్ప!

రామప్ప ఆలయ గోడలపై చెక్కిన అద్భుతమైన శిల్పాలు, నాట్య భంగిమలు, స్తంభాలపై కనిపించే సున్నితమైన కళారూపాలు, నిర్మాణంలో ఉపయోగించిన ప్రత్యేక సాంకేతికత గురించి తెలుసుకున్న బంగ్లాదేశ్ ప్రతినిధులు ఆసక్తి కనబరిచారు. వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయం నేటికీ తన కళావైభవాన్ని చాటుతుండటం విశేషమని ఆలయ నిర్మాణ శైలిని ఆసక్తిగా పరిశీలించారు.

రామప్ప చెరువులో బోటింగ్.. ప్రకృతి అందాల సందర్శన!

ఆలయ సందర్శన అనంతరం బృందం రామప్ప చెరువును సందర్శించి బోటింగ్ చేశారు. చెరువు పరిసరాల్లోని ప్రకృతి అందాలను ఆస్వాదించారు. చారిత్రక కట్టడాలతో పాటు ప్రకృతి సౌందర్యం కలగలిసిన రామప్ప ప్రాంతం పర్యాటకులకు ప్రత్యేక అనుభూతిని అందిస్తోందని ఈ పర్యటనలో భాగంగా తెలుసుకున్నారు. భారత్ దర్శన్ పర్యటనలో భాగంగా బంగ్లాదేశ్ ప్రతినిధులు వరంగల్ కోట, వెయ్యి స్తంభాల దేవాలయాన్ని కూడా సందర్శించారు. కాకతీయుల పాలన, వారి కళాభిరుచి, నిర్మాణ వైభవాన్ని ప్రతిబింబించే చారిత్రక కట్టడాలను తిలకించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఇమ్మడి భాస్కర్, మానవ వనరుల అభివృద్ధి సంస్థ అధికారులు, పర్యాటక పోలీసులు బద్రు, శ్రీనివాస్, అరుణ్, శ్రీకాంత్, రెవెన్యూ, పురావస్తు, దేవాదాయ, పర్యాటక శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇసుకాసురుల ఇష్టారాజ్యం.!

- వాజేడు మండలంలో ప్రకృతి సంపదకు ముప్పు
- చింతూరు,లింగపేట పరిసరాల్లో యథేచ్ఛగా తవ్వకాలు.?
- నిబంధనలు బేఖాతర్
- అక్రమ రవాణాపై అధికారుల పర్యవేక్షణ ఏదీ.?

అనుమతులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్



ప్రజా వాయిస్ ,ములుగు జిల్లా ప్రతినిధి: ములుగు జిల్లా వాజేడు మండలంలో ప్రకృతి సంపదకు రక్షణ కరువవుతోందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని చింతూరు–లింగపేట పరిసరాల్లో ఇసుక తవ్వకాలు, రవాణా వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. ఇసుక వనరుల వినియోగానికి నిబంధనలు ఉన్నప్పటికీ, వాటి అమలు ఎంతవరకు జరుగుతోందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రకృతి ప్రసాదించిన నదులు, వాగుల్లో ఇసుకను ఇష్టారాజ్యంగా తవ్వితే పర్యావరణ సమతుల్యత దెబ్బతినడమే కాకుండా, భూగర్భ జలాలపై కూడా ప్రభావం పడే ప్రమాదం ఉంది.

మామూళ్ల మత్తులోనా.. పర్యవేక్షణ లోపమా.?

చింతూరు,లింగపేట ప్రాంతంలో ఇసుక తవ్వకాలు, రవాణాపై సంబంధిత శాఖల పర్యవేక్షణ ఉందా, లేదా, అన్న సందేహాలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి. అనుమతులకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమాలకు పాల్పడుతున్నట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి.. ప్రకృతి వనరులకు నష్టం

అక్రమ ఇసుక తవ్వకాల వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడటంతో పాటు సహజ వనరులు దెబ్బతినే ప్రమాదం ఉంది. ఇసుక తవ్వకాలకు ఇచ్చిన అనుమతులు, రవాణా పత్రాలు, తవ్వకాల పరిమితులను అధికారులు తనిఖీ చేయాల్సిన అవసరం ఉంది. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నాయా, అనుమతుల పరిధి దాటి ఇసుక తరలిస్తున్నారా, అన్న అంశాలపై సమగ్ర విచారణ జరపాలని స్థానికులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులు స్పందించేనా.?

చింతూరు,లింగపేట ప్రాంతంలో ఇసుక తవ్వకాలపై జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. క్షేత్రస్థాయి విచారణ చేపట్టి అనుమతుల వివరాలను వెల్లడించడంతో పాటు అక్రమాలు నిర్ధారణ అయితే కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రకృతి సంపదను కాపాడాల్సిన బాధ్యత అధికారయంత్రాంగంపై ఉందని, ఇప్పటికైనా నిరంతర పర్యవేక్షణ చేపట్టి ఇసుక దందాకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



దీపావళి అనుమతుల మాటున వసూళ్ల దందా.!

- ఒక్కో టపాసుల దుకాణం నుంచి రూ.10 వేల వరకు డిమాండ్
- వికారాబాద్ , తాండూరు, కొడంగల్ , పరిగిలో వసూళ్ల ఆరోపణలు
- అధికారిక ఫీజు ఎంత.? వసూలు చేస్తున్నదెంత.?
- ఫైర్ శాఖ అధికారుల తీరుపై వ్యాపార వర్గాల్లో చర్చ
- కలెక్టర్ సారు సమగ్ర విచారణ జరిపితేనే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం

ప్రజావాయిస్ , వికారాబాద్ బ్యూరో: దీపావళి పండుగ వ్యాపారులకు ఆనందం పంచాల్సింది పోయి.. కొందరు అధికారులకు కాసుల పంటగా మారుతోందా టపాసుల దుకాణాలకు ఫైర్ సర్వీస్ అనుమతుల జారీ పేరుతో వికారాబాద్ జిల్లాలో అక్రమ వసూళ్లు జరుగుతున్నాయనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. వికారాబాద్, తాండూరు, కొడంగల్, పరిగి ప్రాంతాల్లో ఒక్కో దుకాణం నుంచి సుమారు రూ.10 వేల వరకు డిమాండ్ చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అనుమతుల పేరుతో ఒత్తిళ్లు.?

జిల్లా ఫైర్ అధికారి (డీఎఫ్ఓ), సంబంధిత ఫైర్ స్టేషన్ అధికారుల స్థాయిలో ఈ వ్యవహారం జరుగుతోందనే ఆరోపణలు వ్యాపార వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. దుకాణాలకు అనుమతులు పొందాలంటే భారీ మొత్తాలు చెల్లించాల్సి వస్తోందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. జిల్లావ్యాప్తంగా దుకాణాల సంఖ్యను పరిగణనలోకి తీసుకుంటే ఈ వసూళ్ల మొత్తం లక్షల్లో ఉండవచ్చనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

అధికారిక ఫీజు ఎంత.?

ప్రభుత్వం నిర్ణయించిన ఫైర్ అనుమతుల అధికారిక రుసుము ఎంత రూ.10 వేల వరకు వసూలు చేయడానికి ఏమైనా నిబంధనలు ఉన్నాయా, చెల్లించిన మొత్తానికి రసీదులు ఇస్తున్నారా, లేక అనధికారికంగా వసూళ్లు చేస్తున్నారా, అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ అంశాలపై ఫైర్ శాఖ అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

లెక్టర్ సారు విచారణ జరపాలి.?

దీపావళి పండుగ వేళ వ్యాపారులపై అదనపు ఆర్థిక భారం పడకుండా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి జిల్లాలోని అన్ని ఫైర్ స్టేషన్లలో అనుమతుల జారీ, ఫీజుల వసూళ్లపై సమగ్ర విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

హత్య కేసులో ఇద్దరికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష

- మంథని క్రైమ్ నంబర్ 257/2021 కేసులో గోదావరిఖని కోర్టు తీర్పు

ప్రజా వాయిస్ మంథని మంథని పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన హత్య కేసులో ఇద్దరు నిందితులకు గోదావరిఖని అదనపు జిల్లా సెషన్స్ కోర్టు పదేళ్ల కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ.5 వేల జరిమానా విధించింది. పోలీసుల వివరాల ప్రకారం.. 2021 అక్టోబర్ 31న మంథని మండలం తోటగోపయ్యపల్లి గ్రామంలో కుటుంబ వివాదం నేపథ్యంలో బండెల రాయగట్టు, బండెల లింగయ్య అనే సోదరులు బండెల లక్ష్మి ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి ఆమెతో పాటు ఆమె భర్తపై కర్రలతో దాడి చేశారు. ఈ క్రమంలో అడ్డుకునేందుకు ప్రయత్నించిన లక్ష్మి కుమారుడు బండెల రవిపై కూడా దాడి చేశారు. ఏ1 రాయగట్టు గొడ్డలితో రవి తలపై కొట్టగా, ఏ2 లింగయ్య కర్రతో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన రవి మరుసటి రోజు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.ఈ ఘటనపై కేసు నమోదు చేసిన మంథని పోలీసులు 2021 నవంబర్ 3న నిందితులను అరెస్టు చేసి, అదే ఏడాది డిసెంబర్ 22న కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన గోదావరిఖని అదనపు జిల్లా సెషన్స్ కోర్టు ఇద్దరు నిందితులను దోషులుగా నిర్ధారిస్తూ పదేళ్ల కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ.5 వేల జరిమానా విధించింది.గౌరవనీయ న్యాయమూర్తి సునీత కుంచాల (ఇన్‌ఛార్జి) తీర్పు వెలువరించగా, ప్రాసిక్యూషన్ తరపున ప్రజా న్యాయవాది సీహెచ్ పద్మజ వాదనలు వినిపించారు. కేసు దర్యాప్తును మంథని ఎస్ఐ పి. చంద్రకుమార్, సీఐ జి. సతీష్ నిర్వహించారు.





ప్రభుత్వ భూముల్లో అక్రమ మట్టి తవ్వకాలపై కొరడా!

- అనుమతులు లేకుండా మట్టి తరలిస్తే కఠిన చర్యలు తప్పవు
- కేశ్వాపూర్, యాకత్పురలో అక్రమ తవ్వకాలపై అధికారుల క్షేత్రస్థాయి విచారణ
- కౌన్సిలర్ ఫిర్యాదుతో కదిలిన రెవెన్యూ, మైనింగ్ అధికారులు

శామీర్ పేట, ప్రజా వాయిస్ : ప్రభుత్వ భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపి తరలించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని మైనింగ్ ఏడీ సైదులు, మూడుచింతలపల్లి మండల తహశీల్దార్ మహ్మద్ గులాం ఇద్రిస్ హెచ్చరించారు.శుక్రవారం మూడుచింతలపల్లి మండల పరిధిలోని కేశ్వాపూర్, యాకత్పుర గ్రామాల్లో ప్రభుత్వ భూముల నుంచి అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపిన ప్రాంతాలను మైనింగ్, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.... కేశ్వాపూర్ రెవెన్యూ పరిధిలోని యాకత్పుర గ్రామంలోని సర్వే నంబర్లు 72, 74లో కొందరు వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా పెద్ద ఎత్తున మట్టిని తవ్వి తరలించినట్లు ప్రాథమికంగా గుర్తించామని తెలిపారు. స్థానిక కౌన్సిలర్ మెరుపాటి గోవర్ధన్ రెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఈ అక్రమ మట్టి తవ్వకాలపై ఫిర్యాదు చేయడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టినట్లు వెల్లడించారు.ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ప్రభుత్వ భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపి తరలిస్తున్న వారిని గుర్తించి చట్ట ప్రకారం చర్యలు తీసుకునేందుకు శామీర్‌పేట పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కొండ నర్సింహారెడ్డికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను అక్రమంగా తవ్వినా, మట్టిని తరలించినా ఉపేక్షించేది లేదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ మహ్మద్ గులాం ఇద్రిస్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ సరస్వతి, ఎస్సై సాయికృష్ణ, స్థానిక కౌన్సిలర్ మెరుపాటి గోవర్ధన్ రెడ్డి, జీపీఓ సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం

- రోడ్డెక్కిన మురుగునీరు
- కమిషనర్ గారూ.. కాస్త ఇటు చూడండి!
- ఎన్ని కథనాలు వచ్చినా స్పందించని ప్రభుత్వ ఉద్యోగులు
- పోచమ్మవాడ వాసులు, వాహనదారుల ఇక్కట్లు

ప్రజా వాయిస్ మంథని పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ బాలుర పాఠశాల/కళాశాల నుంచి వెలువడుతున్న మురుగునీరు రోడ్డుపైకి చేరి కాలువలా ప్రవహిస్తోంది. డ్రైనేజీ పనులు అసంపూర్తిగా ఉండటంతో నిత్యం మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తూ వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. ఈ సమస్యపై ఇప్పటికే పలు కథనాలు ప్రచురితమైనా అధికారులు పట్టించుకోవడం లేదని పోచమ్మవాడ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళాశాల నుంచి నిత్యం వెలువడుతున్న వ్యర్థాలు, మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నెలలు గడుస్తున్నా డ్రైనేజీ పనులు పూర్తి కాకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా



మంథని మున్సిపల్ కమిషనర్ ప్రత్యేకంగా దృష్టి సారించి అసంపూర్తి పనులను పూర్తి చేయించి, సమస్యకు పరిష్కారం చూపాలని పోచమ్మవాడ ప్రజలు కోరుతున్నారు.

మల్లన్నసాగర్ కట్ట సమీపంలో బ్లాస్టింగ్‌లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

- గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్ చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి
- కట్టకు 200 మీటర్ల లోపే అనుమతుల్లేకుండా భారీ పేలుళ్లు
- కట్టకు పగుళ్లు, నీటి లీకేజీ.. తిప్పారంలో ఇళ్లకు నష్టం
- కంపెనీ డైరెక్టర్లపై క్రిమినల్ , నాన్ బెయిలబుల్ కేసులకు డిమాండ్
- కుకునూరుపల్లి ఎస్ ఐకి ఫిర్యాదు



ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం :మల్లన్నసాగర్ రిజర్వాయర్ కట్టకు కేవలం 200 మీటర్ల లోపే అనుమతులు లేకుండా భారీ బ్లాస్టింగ్‌లు నిర్వహిస్తూ రిజర్వాయర్ భద్రతకు, తిప్పారం గ్రామ ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగిస్తున్న మెగా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ కంపెనీ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. 50 టీఎంసీల సామర్థ్యం కలిగిన మల్లన్నసాగర్ రిజర్వాయర్ దాదాపు 16.23 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు హైదరాబాద్, సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్, జనగామ, సిరిసిల్ల తదితర జిల్లాలకు తాగునీటిని సరఫరా చేస్తున్న కీలకమైన జలవనరు అని తెలిపారు. మూసీ నది సుందరీకరణ కోసం నీటిని తరలించేందుకు రిజర్వాయర్ కట్టకు సమీపంలో హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ వాటర్ పంప్‌హౌస్ నిర్మాణ పనులు చేపడుతున్నారని పేర్కొన్నారు. ఇరిగేషన్ శాఖ నిబంధనల ప్రకారం రిజర్వాయర్ కట్ట ఎత్తు 40 మీటర్లు ఉండగా, దానికి పది రెట్ల దూరం అంటే 400 మీటర్ల పరిధిలో బ్లాస్టింగ్‌లు నిర్వహించకూడదని తెలిపారు. అయినప్పటికీ పోలీసు శాఖ, తిప్పారం గ్రామపంచాయతీతో పాటు సంబంధిత శాఖల అనుమతులు లేకుండానే గత రెండు నెలలుగా దాదాపు 20 మీటర్ల లోతులో జిలెటిన్ స్టిక్స్ ఉపయోగించి పగలు, రాత్రి భారీ పేలుళ్లు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఈ పేలుళ్ల ధాటికి రిజర్వాయర్ కట్టపై ఉన్న రాళ్లు ఎగిరిపడటంతో పాటు కట్టకు పగుళ్లు ఏర్పడి నీటి లీకేజీ జరుగుతోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. తిప్పారం గ్రామంలోని పలు ఇళ్ల పైకప్పులు దెబ్బతినడంతో పాటు గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయని, దీంతో గ్రామ ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. రిజర్వాయర్ భద్రతకు ముప్పు వాటిల్లితే తాగునీరు, సాగునీటిపై ఆధారపడిన ప్రజలకు తీవ్ర నష్టం కలిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ పీవీ కృష్ణారెడ్డి, డైరెక్టర్ బి.శ్రీనివాస్‌రెడ్డితో పాటు ఈ వ్యవహారంలో బాధ్యులైన వారిపై సమగ్ర విచారణ జరిపి చట్టప్రకారం క్రిమినల్, నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయాలని వంటేరు ప్రతాప్‌రెడ్డి ఫిర్యాదులో కోరారు. అలాగే అన్ని రకాల బ్లాస్టింగ్‌లు, తవ్వకాలు, సంబంధిత పనులను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రిజర్వాయర్ కట్ట భద్రతతో పాటు తిప్పారం గ్రామ ప్రజల ప్రాణాలను కాపాడేందుకు అధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.



మానవత్వం చాటుకున్న సర్పంచ్ కిష్టయ్య

- బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం

ప్రజా వాయిస్/మోమిన్ పేట్ వికారాబాద్ జిల్లా మోమిన్ పేట్ మండల పరిధిలోని కేసారం గ్రామానికి చెందిన పుర్ర బాలయ్య మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని గ్రామ సర్పంచ్ గుజ్జరి కిష్టయ్య పరామర్శించి అండగా నిలిచారు. కుటుంబ పెద్దను కోల్పోయి విషాదంలో ఉన్న ఆ కుటుంబానికి తన వంతు సహాయంగా రూ.5,000 ఆర్థిక సాయం అందజేశారు.ఆపద సమయంలో బాధిత కుటుంబానికి అండగా నిలవడం మానవత్వానికి నిదర్శనమని గ్రామస్తులు సర్పంచ్ గుజ్జరి కిష్టయ్య సేవలను అభినందించారు.



- పర్యావరణ పరిరక్షణ పేరుతో వచ్చిన ఎన్జీవోలతో ఆర్థిక వివాదం
- పోలీస్ స్టేషన్ ఎదుట రాత్రి వరకు బేరసారాలు
- స్థానికులే లేని ప్రజాభిప్రాయ సేకరణ
- ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పర్యావరణ ప్రేమికుల హడావుడి!
- 21.643 హెక్టార్ల నాలుగు గనుల క్లస్టర్ పై ప్రజల అభిప్రాయాలేవీ.?
- ప్రజాభిప్రాయ సేకరణ అనంతర పరిణామాలపై జిల్లా యంత్రాంగం విచారణ చేపట్టాలనే డిమాండ్

ప్రజా వాయిస్, ఖమ్మం:పర్యావరణ పరిరక్షణ.. ప్రజాహితం.. స్థానికుల అభిప్రాయాలకు ప్రాధాన్యం.. ఇవీ మైనింగ్ అనుమతుల కోసం నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణలో కీలక అంశాలు. కానీ ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం బోదులబండలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో మాత్రం అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. పర్యావరణ పరిరక్షణ పేరుతో వచ్చిన కొందరు ఎన్జీవోలు, పర్యావరణ ప్రేమికులు.. కార్యక్రమం ముగిసిన అనంతరం ఆర్థిక వివాదంతో పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగినట్లు సమాచారం. దీంతో ప్రజాభిప్రాయ సేకరణ ప్రక్రియపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

స్థానికులే లేని ప్రజాభిప్రాయ సేకరణ.!

బోదులబండ గ్రామంలోని సర్వే నంబర్లు 353/పార్ట్, 354/పార్ట్ పరిధిలో సింగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన బైరు సాయికృష్ణ 7.790 హెక్టార్ల విస్తీర్ణంలో బ్లాక్ గ్రానైట్ క్వారీ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. రూ.235 లక్షల ప్రాజెక్టు వ్యయంతో చేపట్టనున్న ఈ క్వారీకి సంబంధించి తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు.ఖమ్మం జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి సమక్షంలో అధికారికంగా జరిగిన ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కనీసం హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది. స్థానికుల అభిప్రాయాలు సేకరించాల్సిన ప్రక్రియలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఎన్జీవోలు, పర్యావరణ ప్రేమికులు పాల్గొని తమ అభిప్రాయాలు వెల్లడించినట్లు సమాచారం.

పర్యావరణ ప్రేమ.. ఆర్థిక ప్రయోజనమా.?

ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన కొందరు ఎన్జీవోలు, పర్యావరణ ప్రేమికులు తమకు అనుకూలంగా అభిప్రాయాలు తెలిపిన అనంతరం ఆర్థిక ప్రయోజనాల విషయంలో వివాదానికి దిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చామని, కనీసం రవాణా ఖర్చులు కూడా ఇవ్వలేదని కొందరు బహిరంగంగా ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం.క్వారీ అనుమతుల ప్రక్రియలో తమను పావులుగా ఉపయోగించుకుని చివరకు పట్టించుకోవడం లేదంటూ వారు ఆందోళనకు దిగినట్లు తెలుస్తోంది. ఈ వివాదం ముదిరి పోలీస్ స్టేషన్ వరకు చేరడం.. పర్యావరణ పరిరక్షణ పేరుతో నిర్వహించిన కార్యక్రమం వెనుక ఆర్థిక అంశాలు ఉన్నాయా? అనే ప్రశ్నలకు తావిస్తోంది.

పోలీస్ స్టేషన్ ఎదుట రాత్రి వరకు రచ్చ

యాజమాన్యానికి, బయటి ప్రాంతాల నుంచి వచ్చిన బృందానికి మధ్య ఆర్థిక అంశాల్లో పొసగకపోవడంతో వివాదం తీవ్రరూపం దాల్చినట్లు సమాచారం. పోలీస్ స్టేషన్ ఎదుట రాత్రి 9 గంటల వరకు నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. చివరకు తమ డిమాండ్లు నెరవేరుస్తామని, ఇవ్వాల్సినవి ఇస్తామని యాజమాన్యం హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించినట్లు తెలిసింది.

వాడి వేడిగా సాగిన తెలకపల్లి మండల సర్వసభ్య సమావేశం

- అధికారులపై ఎమ్మెల్యే ఫైర్

- ఏలోనిన్ ఎదుర్కొనడానికి చర్యలు చేపట్టాలి
- పద్ధతి మార్చుకొకపోతే చర్యలు తప్పవు



ప్రజా వాయిస్ తెలకపల్లి అక్టోబర్ 30 మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి సర్వసభ్య సమావేశం వాడివేడిగా సాగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశం ప్రారంభం నుంచి చివరి వరకు అధికారుల పనితీరుపై ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఎంపీడీవో, ఎమ్మార్వో, స్పెషల్ ఆఫీసర్ తో పాటు వివిధ శాఖల మండల స్థాయి అధికారులు హాజరయ్యారు.సమావేశంలో పలు శాఖల అధికారులు తమ నివేదికలు సమర్పించారు. అయితే కొన్ని శాఖల అధికారులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా తాను మౌనంగా గమనిస్తున్నానని, ఇప్పటివరకు తన మౌనాన్ని మాత్రమే చూశారని, ఇకపై ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ప్రజలకు సేవ చేయడానికే అధికారులు ఉన్నారని, ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే తాను ఏమాత్రం సహించబోనని హెచ్చరించారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హులైన లబ్ధిదారునికి చేరాలని ఆదేశించారు. పథకాల అమలులో అలసత్వం వహిస్తే సంబంధిత అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకుంటానని హెచ్చరికలు జారీ చేశారు. ముఖ్యంగా రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల్లో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఇళ్ల స్థలాలు, రైతుబంధు, పింఛన్లు, రేషన్ కార్డుల వంటి అంశాల్లో ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని సూచించారు.ఈ సందర్భంగా కరెంటు, వ్యవసాయ మరియు నీటిపారుదల శాఖల అధికారులపై ఎమ్మెల్యే ప్రత్యేకంగా దృష్టి సారించారు. రాబోయే రోజుల్లో ఎల్-నినో ప్రభావం ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులను ముందే అప్రమత్తం చేయాలని, ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలని, విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించేందుకు చర్యలు తీసుకోవాలని, రైతులకు వ్యవసాయానికి ఇబ్బంది కలగకుండా చూడాలని, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ ఫార్మర్ల మరమ్మతులు వెంటనే చేపట్టాలని సూచించారు. నీటిపారుదల శాఖ అధికారులు చెరువులు, కుంటల్లో నీటి నిల్వలను పరిశీలించి, తాగునీటికి ఇబ్బంది లేకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.ముఖ్యంగా వైద్య మరియు విద్యా శాఖల అధికారులపై ఎమ్మెల్యే కీలక ఆదేశాలు జారీ చేశారు. విద్యా విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడేది లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని, మౌలిక వసతుల కొరత ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని మండల విద్యాధికారిని ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకం నాణ్యతగా అమలు చేయాలని, విద్యార్థుల హాజరు శాతం పెంచాలని సూచించారు. అదేవిధంగా వైద్య శాఖ అధికారులు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండాలని, దవాఖానాల్లో మందుల కొరత లేకుండా చూడాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలని, మిషన్ భగీరథ పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఉపాధి హామీ పనుల ద్వారా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తే విధంగా వ్యవహరిస్తే ఏ అధికారి అయినా తప్పించుకోలేరని, ప్రజల పక్షాన తాను నిలబడతానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను వెల్లడించారు. ఎమ్మార్వో మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖల పురోగతిని వివరించారు.ఈ కార్యక్రమంలో తెలకపల్లి సర్పంచ్ కొమ్ము.చంద్రశేఖర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రమణా రావు మాజీ ఎంపిపి బాండ పర్వతాలు పలు శాఖల అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా

- ప్రమాద బాధితులను కాపాడి ఉదారత చాటుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్
- ఇచ్చోడ ప్రయాణంలో మోడల్ స్కూల్ వద్ద అకస్మాత్తుగా పల్టీ కొట్టిన వాహనం
- ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని సురక్షితంగా బయటకు తీసిన ప్రజాప్రతినిధి
- తక్షణమే వైద్య సహాయం అందించి రోడ్డు రాకపోకలు పునరుద్ధరించడంపై సర్వత్రా హర్షం.

ప్రజా వాయిస్, ఇచ్చోడ / బోథ్ నియోజకవర్గంఇచ్చోడ మండలం నుండి బజార్ హత్నూర్ వైపు వేగంగా వెళ్తున్న ఆటో అకస్మాత్తుగా అదుపుతప్పి మోడల్ స్కూల్ రహదారి సమీపంలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న పలువురు తీవ్రంగా గాయపడ్డారు. సరిగ్గా అదే సమయంలో ఆ మార్గం గుండా వెళ్తున్న బోథ్ శాసనసభ్యులు అనిల్ జాదవ్ బోల్తా పడిన ఆటోను గమనించి వెంటనే తన వాహనాన్ని నిలిపివేసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాద తీవ్రతను గ్రహించిన ఎమ్మెల్యే, తన వ్యక్తిగత సహాయకులు మరియు స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి వేగంగా సహాయక చర్యలు ప్రారంభించారు.ఆటో కింద ఇరుక్కుపోయి తీవ్ర భయాందోళనకు గురైన డ్రైవర్, ప్రయాణికులను ఎంతో చాకచక్యంగా మరియు సురక్షితంగా బయటకు తీశారు. అనంతరం గాయపడిన క్షతగాత్రులను తక్షణ వైద్య సహాయం కోసం వెంటనే ఆసుపత్రికి తరలించేలా చర్యలు తీసుకున్నారు. బోల్తా పడిన ఆటోను రోడ్డుపై నుంచి పక్కకు జరిపించి వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ట్రాఫిక్ పునరుద్ధరించారు. ఆపద సమయంలో దేవుడిలా వచ్చి తమ ప్రాణాలను కాపాడిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు బాధితులు, డ్రైవర్ కంటతడి పెట్టుకుంటూ కృతజ్ఞతలు తెలిపారు.



పెద్దపల్లి నిధులు.. పక్కదారి.!

- సింగరేణి గనుల నుంచి రావాల్సిన డీఎంఎఫ్ టీ నిధులు ఇతర ప్రాంతాలకు మళ్లుతున్నాయా.?
- రూ.760 కోట్ల బకాయిలపై అంతుచిక్కని లెక్కలు
- పూర్తయిన 453 పనులకు రూ.135.80 కోట్ల బిల్లులు పెండింగ్
- పనులు పూర్తి చేసినా పైసా రాని వైనం
- అప్పుల ఊబిలో కాంట్రాక్టర్లు
- జిల్లా వాటా నిధులు జిల్లాకే ఖర్చు చేయాలి
- మద్దెల దినేష్ డిమాండ్



ప్రజా వాయిస్, గోదావరిఖని: సింగరేణి గనులు.. బొగ్గు సంపద.. కానీ ఆ సంపద నుంచి పెద్దపల్లి జిల్లాకు రావాల్సిన అభివృద్ధి నిధులే అందడం లేదు జిల్లా ప్రజల సంక్షేమం, మౌలిక వసతుల కల్పన కోసం వినియోగించాల్సిన డీఎంఎఫ్‌టీ నిధులు ఇతర ప్రాంతాలకు మళ్లుతున్నాయనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఒకవైపు రూ.760 కోట్ల నిధుల బకాయిలు.. మరోవైపు పూర్తయిన పనులకు రూ.135.80 కోట్ల బిల్లులు పెండింగ్ పనులు చేసిన కాంట్రాక్టర్లు బిల్లుల కోసం ఎదురుచూస్తుండగా, అభివృద్ధి పనులు ముందుకు సాగని పరిస్థితి నెలకొందని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేష్ ఆవేదన వ్యక్తం చేశారు.శుక్రవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. రామగుండం-1, 2, 3 గనుల నుంచి 2022 నుంచి ఇప్పటి వరకు సుమారు రూ.760 కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులు బకాయిగా ఉన్నాయని తెలిపారు. పెద్దపల్లి జిల్లాకు రావాల్సిన నిధులు ఇతర ప్రభుత్వ కార్యక్రమాలకు, పక్క జిల్లాల అభివృద్ధి పనులకు మళ్లుతున్నాయనే విమర్శలు ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లా డీఎంఎఫ్‌టీ కమిటీకి తెలియకుండానే నిధుల మళ్లింపు జరుగుతోందని ఆరోపించారు.

453 పనులు.. రూ.135.80 కోట్ల బకాయిలు

జిల్లాలో ఎంబీ రికార్డులు పూర్తయిన 453 అభివృద్ధి పనులకు సంబంధించి రూ.135.80 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉందని దినేష్ వివరించారు. ఇందులో 2023 తర్వాత చేపట్టిన 269 పనులకు రూ.107.14 కోట్లు, అంతకుముందు చేపట్టిన 184 పనులకు రూ.28.65 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో రూ.70 కోట్లకు పైగా, మంథని నియోజకవర్గంలో సుమారు రూ.51 కోట్ల మేర బకాయిలు ఉన్నాయని తెలిపారు.

జిల్లా వాటా.. జిల్లాకే ఖర్చు చేయాలి

సింగరేణి బొగ్గు రాయల్టీ ఆధారంగా డీఎంఎఫ్‌టీకి నిధులు రావాల్సి ఉన్నప్పటికీ మూడేళ్లుగా బకాయిలు పేరుకుపోతున్నాయని విమర్శించారు. జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు డీఎంఎఫ్‌టీ కమిటీలో సభ్యులుగా ఉన్నా నిధుల మళ్లింపుపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. పెద్దపల్లి జిల్లాకు రావాల్సిన నిధులను ఇతర ప్రాంతాలకు మళ్లించకుండా జిల్లాలోనే అభివృద్ధి పనులకు కేటాయించాలని, పూర్తయిన పనులకు పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కలెక్టర్ ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని కోరారు.

ఆదిలాబాద్‌ను ఆగం పట్టించింది కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలే.!

- పదేళ్ల పాలనలో ప్రాజెక్టుల నిర్లక్ష్యం.. అభివృద్ధికి గ్రహణం
- చనఖా-కొరటా అంచనాల పెంపుపై కవిత ఫైర్
- ఆరు గ్యారంటీలు అమలు చేయలేని కాంగ్రెస్ .. సాగునీరు అందించని బీఆర్ఎస్
- ఉచిత విద్య, వైద్యం.. యువతకు రూ.20 కోట్ల వరకు రుణాలు
- ఇంద్రవెల్లి పాంచజన్య సంకల్ప సభలో టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు కవిత ఘాటు వ్యాఖ్యలు

ప్రజా వాయిస్, ఇంద్రవెల్లి/ఆదిలాబాద్: అపారమైన వనరులు.. అద్భుతమైన ప్రకృతి సంపద.. అయినా అభివృద్ధిలో మాత్రం అట్టడుగునే! ఆదిలాబాద్ జిల్లా వెనుకబాటుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల దశాబ్దాల నిర్లక్ష్యమే కారణమని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధినేత్రి కల్వకుంట్ల కవిత నిప్పులు చెరిగారు. ప్రాజెక్టులను పట్టించుకోకుండా రైతుల సాగునీటి ఆశలను నీరుగార్చారని మండిపడ్డారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. శుక్రవారం ఇంద్రవెల్లిలో నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభలో అమరుల స్థూపానికి నివాళులర్పించిన అనంతరం ఆమె ఘాటుగా ప్రసంగించారు.



ప్రాజెక్టుల పేరుతో నిర్లక్ష్యం.. అంచనాల పేరుతో దోపిడీ.!

తుమ్మిడిహెట్టి, కేపీ రావు, జగన్నాథ ప్రాజెక్టులను పెండింగ్‌లో పెట్టి లక్షలాది ఎకరాలకు సాగునీరు అందకుండా చేశారని కవిత విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో చనఖా-కొరటా ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.368 కోట్ల నుంచి రూ.2,100 కోట్లకు పెంచడంపై తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రాజెక్టుల నిర్లక్ష్యంతో రైతుల జీవితాలు దుర్భరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆరు గ్యారంటీలు ఏమయ్యాయి.?

కరువు పేరుతో రైతులను పంటలు వేయవద్దని చెప్పిన చరిత్ర సీఎం రేవంత్ రెడ్డిదేనని కవిత ఎద్దేవా చేశారు. మూడేళ్లలో జిల్లాకు రెండుసార్లు మాత్రమే వచ్చిన ముఖ్యమంత్రి.. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు.

అధికారంలోకి వస్తే ఉచిత విద్య, వైద్యం

తమ పార్టీ అధికారంలోకి వస్తే ప్రైవేటు రంగంలోనూ ఉచితంగా నాణ్యమైన విద్య, వైద్యం అందిస్తామని కవిత హామీ ఇచ్చారు. యువత వ్యాపారాలు ప్రారంభించేందుకు రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు రుణాలు అందిస్తామని ప్రకటించారు. ఐటీడీఏ జీవోలను పునరుద్ధరించి ఆదివాసీల ఆస్తులకు, పోషకాహార భద్రతకు న్యాయం చేస్తామని తెలిపారు.

బీసీలకు పెద్దపీట.. ఇద్దరు యువకులకు ఎమ్మెల్సీ టికెట్లు

రాజకీయ, ఆర్థిక నేపథ్యం లేని బీసీ ఉద్యమకారులు శ్రీకాంత్ గౌడ్, ఆకాశ్‌లను ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ప్రకటించి సామాజిక న్యాయాన్ని చేతల్లో చూపించామని కవిత పేర్కొన్నారు. జిల్లా ప్రజల ఆశీర్వాదంతో రాబోయే రోజుల్లో అన్ని స్థానాల్లో తమ పార్టీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

ఫిర్యాదు ఫలించింది

- రాళ్లగూడ రోడ్డులో డ్రైనేజీ పనులకు మోక్షం
- వారం రోజుల క్రితం అధికారులకు బీఆర్ఎస్ నాయకుల వినతి
- కోణమొల్ల శ్రీనివాస్ చొరవతో ప్రారంభమైన పనులు



ప్రజావాయిస్||శంషాబాద్:రాళ్లగూడ రోడ్డులో చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ సమస్యపై ఎట్టకేలకు అధికారులు స్పందించారు.స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన 119వ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కోణమొల్ల శ్రీనివాస్ సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో డ్రైనేజీ పనులు ప్రారంభమయ్యాయి.గత వారం కోణమొల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు హెచ్ఎండీఏ, హెచ్జీసీఎల్ కార్యాలయాలకు వెళ్లి ఎస్ఈ,డీఈ,ఈఈ స్థాయి అధికారులకు సమస్యను వివరించారు.డ్రైనేజీ,రోడ్డు పనులు అసంపూర్తిగా ఉండటంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలియజేసి,పనులు వెంటనే పూర్తి చేయాలని కోరారు.బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదుపై స్పందించిన అధికారులు సమస్యను పరిశీలించి డ్రైనేజీ పనులు ప్రారంభించారు.దీంతో రాళ్లగూడ రోడ్డు సమస్యకు పరిష్కారం లభిస్తుందన్న ఆశ స్థానికుల్లో వ్యక్తమవుతోంది.ఈ పనుల ప్రారంభానికి 119వ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కోణమొల్ల శ్రీనివాస్ చేసిన కృషితో పాటు రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి,మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సహకారం ఉందని పార్టీ నాయకులు తెలిపారు. ప్రారంభించిన పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని వారు కోరారు.



పదేళ్లయినా రామగిరి మండలానికి అభివృద్ధి ఏది?

- సింగరేణి సీఎస్ఆర్, డీఎంఎఫ్ నిధులు ఇతర జిల్లాలకు.. ప్రభుత్వ భవనాలు ఎక్కడ?

- బీజేపీ నేత మొలుమూరి శ్రీనివాస్ ప్రశ్న

ప్రజా వాయిస్ రామగిరి

మండలం ఏర్పడి పదేళ్లు గడుస్తున్నా పెద్దపల్లి జిల్లా రామగిరిలో అభివృద్ధి ఆశించిన స్థాయిలో జరగలేదని బీజేపీ ఎంపీటీసీల ఫోరం పెద్దపల్లి జిల్లా మాజీ అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్ విమర్శించారు. 16 గ్రామపంచాయతీలు, సింగరేణి ప్రభావిత గ్రామాలు ఉన్న మండలానికి సీఎస్ఆర్, డీఎంఎఫ్ నిధులు సక్రమంగా కేటాయించడం లేదని ఆరోపించారు. 40 వేల ఓట్లు, 60 వేల జనాభా కలిగిన మండలంలో నేటికీ నూతన ప్రభుత్వ భవనాలు ఏర్పాటు చేయకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. మండల ప్రజాపరిషత్, తహసీల్దార్, పోలీస్ స్టేషన్, గ్రంథాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జూనియర్ కళాశాల, ఐటీఐ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వ భవనాల నిర్మాణానికి సింగరేణి యాజమాన్యం వెంటనే స్థలాలు కేటాయించాలని, ప్రజలకు ఉపయోగపడే స్థలాల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయడం సమంజసం కాదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రామగిరి అభివృద్ధిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నిధులు కేటాయించి భవనాల నిర్మాణం చేపట్టకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.



ములుగులో కోహినూర్ దాబా, ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రారంభం

పర్యాటకులకు మరింత ఆతిథ్య శోభ

నాణ్యమైన ఆహారం అందించడం అభినందనీయం

ప్రజా వాయిస్,ములుగు:

ములుగు జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన, లీలా గార్డెన్ ఎదురుగా ఏర్పాటు చేసిన కోహినూర్ దాబా, ఫ్యామిలీ రెస్టారెంట్‌ను డాక్టర్ ఎం. రాజా, కౌన్సిలర్ గుంటోజు పావని,నిరంజన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం. రాజా మాట్లాడుతూ.. ములుగు పర్యాటక ప్రాంతానికి వచ్చే సందర్శకులకు నాణ్యమైన రుచికరమైన ఆహారం అందించడం అభినందనీయమన్నారు. కౌన్సిలర్ గుంటోజు పావని,నిరంజన్ మాట్లాడుతూ.. నూతన ఫ్యామిలీ రెస్టారెంట్ అందుబాటులోకి రావడం సంతోషకరమని, నాణ్యమైన ఆహారంతో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.రెస్టారెంట్ ప్రొప్రైటర్లు పవన్,ప్రాజంల్ మాట్లాడుతూ.. వినియోగదారులకు సంతృప్తికరమైన సేవలు, ఆత్మీయ ఆతిథ్యం అందించడమే తమ లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు ఏర్ల వెంకన్న ముదిరాజ్, గడ్డమీది భాస్కర్, మెపా జిల్లా అధ్యక్షుడు అచ్చునూరి కిషన్ ముదిరాజ్, పోరిక రాహుల్, శానవేని అశోక్ ముదిరాజ్, మారం సుమన్ రెడ్డి, పాండ్య కుమార్, సోమా నాయక్, మాట్ల సంపత్, బద్రీ, కుటుంబ సభ్యులు, మిత్రులు, బంధువులు, శ్రేయోభిలాషులు, పలువురు ఆహ్వానితులు పాల్గొన్నారు.



నీటి పొదుపు పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలి

రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డా. ఆలవాల ఉమా రాజశేఖర్

ప్రజా వాయిస్/కోట పల్లి:

ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతంలో హెచ్చుతగ్గులు, నీటి కొరత ఏర్పడే అవకాశాలున్నందున రైతులు నీటి పొదుపు పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డా. ఆలవాల ఉమా రాజశేఖర్, మండల వ్యవసాయ అధికారి కె. శ్రీకాంత్ శనివారం మోత్కుపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, అన్నారు.నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, పసుపు పంటలో చీడపీడల నివారణకు సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలని తెలిపారు. సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పాటు నానో యూరియా, నానో డీఏపీ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. తక్కువ పెట్టుబడితో అధిక నికర ఆదాయం పొందేలా శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బి. నారాయణ, ఉపసర్పంచ్ మాధవరెడ్డి, ఏఈఓ అశ్విని, హెచ్ఈఓ రాజు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో చెరగని ముద్ర.. ముగ్గురు పోలీస్ అధికారులకు ఘన వీడ్కోలు..

పదవి విరమణ పొందిన ముగ్గురు అధికారులకు ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఘన సత్కారం

ప్రజా వాయిస్,నల్గొండ.

పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం పాటు ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా అంకితభావంతో విధులు నిర్వహించిన ముగ్గురు పోలీస్ అధికారులకు నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ ఘనంగా సన్మానించి గౌరవ వందనం సమర్పించారు.నల్గొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో మిర్యాలగూడ II టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ చింతల రమేష్, నల్గొండ రూరల్ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ శంకర్ రాజు, కొండమల్లేపల్లి పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ వై. రామలింగయ్య పదవీ విరమణ సందర్భంగా ఎస్పీ వారిని ఘనంగా సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో పనిచేయడం అంటే కేవలం ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించడం మాత్రమే కాదని, ప్రజల భద్రత కోసం నిరంతరం అంకితభావంతో



పనిచేయాల్సిన గొప్ప బాధ్యత అని పేర్కొన్నారు. సుదీర్ఘకాలం పాటు వివిధ ప్రాంతాల్లో, వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తూ ప్రజలకు విశేష సేవలందించిన వారి కృషి అభినందనీయమన్నారు.విధి నిర్వహణలో ఎదురైన ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ క్రమశిక్షణ, నిబద్ధత, బాధ్యతతో పనిచేసి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకువచ్చారని కొనియాడారు.పదవీ విరమణ అనేది ఉద్యోగ జీవితానికి ముగింపు మాత్రమేనని, వ్యక్తిగత జీవితంలో మరో కొత్త అధ్యాయానికి ప్రారంభమని అన్నారు. ఇకపై కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా, ప్రశాంతమైన జీవితం గడపాలని ఆకాంక్షించారు. తమ సుదీర్ఘ అనుభవాలను అవసరమైన సందర్భాల్లో ఇతరులకు పంచుకుంటూ పోలీస్ శాఖతో అనుబంధాన్ని కొనసాగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏ.ఓ శివ ప్రసాద్, ఆర్.ఐ సంతోష్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు సైదులు, ఉపాధ్యక్షుడు సీఐ కరుణాకర్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొని పదవీ విరమణ పొందిన అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం.. శారీరక దృఢత్వం

మార్కులతో పాటు క్రీడలకూ ప్రాధాన్యం ఇవ్వాలి

క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలకు క్రీడలే పునాది

నారాయణ హైస్కూల్‌లో ఘనంగా ఎన్‌పీఎల్ క్రీడోత్సవాలు

జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన అతిథులు

ప్రజా వాయిస్,నిర్మల్:

నేటి ఆధునిక విద్యా విధానంలో మార్కులతో పాటు శారీరక శ్రమ, క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని ఆదిలాబాద్ జోన్ ఏజీఎం కె. ప్రసాద్ అన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్ కాలనీలో గల నారాయణ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన (ఎన్‌పీఎల్) క్రీడోత్సవాలను ఆయన ఘనంగా



ప్రారంభించారు.పాఠశాల ప్రిన్సిపాల్ డి. రమేష్, ఏడీ రాజశేఖర్, ఏఓ రవికుమార్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమని, విద్యార్థులు వాటిని సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఐకమత్యం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వానికి దోహదపడతాయని పేర్కొన్నారు.విద్యార్థుల్లో దాగి ఉన్న మేధోశక్తితో పాటు క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు నారాయణ విద్యాసంస్థలు ప్రతి ఏటా క్రీడోత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నాయని తెలిపారు. అనంతరం మైదానంలో నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. విజేతల ప్రదర్శనకు తోటి విద్యార్థుల నుంచి ప్రశంసలు లభించాయి.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం కల్పించాలి

ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహాను కలిసి వినతినిచ్చిన రాష్ట్ర కమిటీ నాయకులు

సానుకూలంగా స్పందించిన ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజానర్సింహా

రాష్ట్ర అధ్యక్షుడు కుర్రి సైదయ్య,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్న బోస్క నరేష్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ అజ్మీర కిరణ్ కుమార్, రాజు

ప్రజా వాయిస్,హైదరాబాద్:

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న సుమారు 20 వేల మంది శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ, సూపర్‌వైజర్, మెడికల్ అండ్ హెల్త్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్రూా అసోసియేషన్ రాష్ట్ర కమిటీ నాయకులు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహాను కలిశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రిని కలిసి కార్మికుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా స్రూా రాష్ట్ర అధ్యక్షుడు కుర్రి సైదయ్య మాట్లాడుతూ.. 2022లో జారీ



చేసిన జీవో నంబర్ 60 ప్రకారం బెడ్‌సైడ్ కార్మికులకు నెలకు రూ.15,600 వేతనం నిర్ణయించినప్పటికీ, రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కార్మికులకు జీవో ప్రకారం పూర్తి స్థాయిలో వేతనాలు అందడం లేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో పారిశుధ్యం, రోగుల సంరక్షణ, భద్రత వంటి అత్యంత కీలకమైన బాధ్యతలను కార్మికులు నిర్వహిస్తున్నప్పటికీ, గత 20 ఏళ్లుగా సేవలందిస్తున్న అనేకమంది కార్మికులకు సరైన గుర్తింపు, భద్రత లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.కార్మికులందరినీ IFMISలో నమోదు చేసి, కనీస వేతనంగా నెలకు రూ.26,000 చెల్లించాలని, ప్రతి కార్మికుడికి రూ.10 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే 2025 జూన్ నుంచి ప్రభుత్వ ఆసుపత్రుల్లో విధుల్లోకి తీసుకున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ, సూపర్‌వైజర్ కార్మికులను ప్రస్తుతం విధుల నుంచి నిలిపివేస్తున్నారని, అటువంటి వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు.కార్మిక సంఘ నాయకులు వివరించిన సమస్యలను సావధానంగా విన్న ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహం స్పందిస్తూ.. కార్మికుల వేతనాల పెంపు అంశాన్ని త్వరలోనే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు అసోసియేషన్ నాయకులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చిన్నస్థాయి కార్మికుల పక్షాన ఉంటుందని, కార్మికులతో పాటు వారి కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని మంత్రి భరోసా ఇచ్చినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్రూా రాష్ట్ర అధ్యక్షుడు కుర్రి సైదయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్న బోస్క నరేష్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ అజ్మీర కిరణ్ కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.


దేవరుప్పుల మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించాలి.

రైతులకు సాగునీరు అందించాలి.. లేకపోతే ప్రజాగ్రహం తప్పదు: పల్లా సుందర్ రాంరెడ్డి

రైతులు నీళ్లు అడిగితే కేసులు పెడతారా? రైతుల కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధం

ప్రజా వాయిస్ । పాలకుర్తి నియోజకవర్గం । అక్టోబర్ 30:

దేవరుప్పుల మండలంలో నెలకొన్న కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించాలని బీఆర్ఎస్ పార్టీ జనగామ జిల్లా నాయకులు పల్లా సుందర్ రాంరెడ్డి డిమాండ్ చేశారు. రైతులకు సాగునీరు అందించాలని కోరుతూ శుక్రవారం దేవరుప్పుల తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా పల్లా సుందర్ రాంరెడ్డి మాట్లాడుతూ.. దేవరుప్పుల మండలంలో సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు. రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు నీళ్లు అడిగితే కేసులు పెడతారా? అని ప్రశ్నించారు. తమపై కోపం ఉంటే ఎన్ని కేసులైనా పెట్టుకోవచ్చని, కానీ రైతులకు మాత్రం వెంటనే సాగునీరు



అందించాలని ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు.పక్క నియోజకవర్గాల్లో సాగునీటి పరిస్థితులను చూసైనా పాలకులు కళ్లు తెరవాలని హితవు పలికారు. రైతుల కష్టాలు కనిపించడం లేదా? ఎండిపోతున్న పంటలు కనిపించడం లేదా? అని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను నిలదీశారు. రైతుల కన్నీళ్లు తుడవాల్సిన పాలకులు ప్రేక్షకపాత్ర వహించడం సిగ్గుచేటని మండిపడ్డారు.దేవరుప్పుల మండలాన్ని వెంటనే కరువు మండలంగా ప్రకటించి, నష్టపోయిన రైతులకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రైతులను ఆదుకోకుండా కాలయాపన చేస్తే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. రైతుల పాపం కాంగ్రెస్ నాయకులకు తప్పకుండా తగులుతుందని, ప్రజలే తగిన సమయంలో బుద్ధి చెబుతారని అన్నారు. రైతుల హక్కుల కోసం ఎంతటి పోరాటానికైనా తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.ఈ ధర్నా కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ముప్పుపై ముందస్తు సమరం.. మిర్యాలగూడను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం..

యాసంగిలో సాగర్ నీరు అందే అవకాశం లేదు..

రైతులు ఆరుతడి పంటల వైపు మళ్లాలి

కరువు వేళ ప్రజలకు అండగా 12 నెలల జీతం

సేవా కార్యక్రమాలకు కేటాయింపు

జనవరి నుంచి బిఎల్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో

తాగునీరు, పెరుగన్నం పంపిణీ

119 గ్రామపంచాయతీలు, 48 మున్సిపల్

వార్డుల్లో అవగాహన కార్యక్రమాలు

నీటి వనరుల ఆడిట్‌కు కలెక్టర్ ఆదేశాలు..

సమన్వయంతో ముందస్తు కార్యాచరణ

హాజరైన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ బి. చంద్ర శేఖర్





ప్రజా వాయిస్,మిర్యాలగూడ:

రాబోయే రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమిష్టిగా ముందస్తు కార్యాచరణతో సిద్ధం కావాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (దీ=) పిలుపునిచ్చారు. సమస్య వచ్చిన తర్వాత స్పందించడం కంటే.. సమస్య రాకముందే అప్రమత్తమై నివారణ చర్యలు చేపట్టడమే బాధ్యతాయుతమైన పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. ఎల్‌నినో సవాలును సమర్థవంతంగా ఎదుర్కొని మిర్యాలగూడ నియోజకవర్గాన్ని రాష్ట్రానికే ఆదర్శంగా నిలపాలని ఆకాంక్షించారు. మిర్యాలగూడ పట్టణంలోని కళావేదికలో ఎల్‌నినో ప్రభావం, దాని నివారణ చర్యలపై నిర్వహించిన నియోజకవర్గస్థాయి అవగాహన, సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

యాసంగిలో సాగర్ నీరు లేనట్టే.. రైతులు అప్రమత్తం కావాలి

నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 537 అడుగులకు పడిపోయిందని, డెడ్‌స్టోరేజీకి ఎగువన సుమారు 55 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి వివరించారు. ఈ నీటిని హైదరాబాద్ తాగునీటి అవసరాలతో పాటు ఇతర అత్యవసర అవసరాలకు వినియోగించాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఈ నేపథ్యంలో రాబోయే యాసంగి సీజన్‌లో సాగర్ నుంచి సాగునీరు అందించే అవకాశం లేదని స్పష్టం చేశారు. రైతులు ఈ పరిస్థితిని ముందుగానే గుర్తించి వరి సాగుకు దూరంగా ఉండాలని సూచించారు. కేవలం బోర్లపై ఆధారపడి వరి సాగు చేసి ఆర్థికంగా నష్టపోవద్దని, తక్కువ నీటితో సాగయ్యే జొన్న, పెసర, మినుము తదితర ఆరుతడి పంటలను సాగు చేయాలని కోరారు. అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతు వేదికల ద్వారా పంటల మార్పిడి, మార్కెట్ డిమాండ్, లాభదాయకమైన ప్రత్యామ్నాయ పంటలపై వ్యవసాయ అధికారులు విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. నీటి లభ్యత లేదని తెలిసినా రాజకీయ స్వార్థంతో రైతులను వరి సాగు వైపు ప్రోత్సహించడం బాధ్యతారాహిత్యమని వ్యాఖ్యానించారు.

12 నెలల జీతం ప్రజాసేవకు అంకితం..ఎమ్మెల్యే బత్తుల

రాబోయే కరువు పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో తన 12 నెలల జీతాన్ని బిఎల్ఆర్ బ్రదర్స్ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలకు కేటాయిస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. వచ్చే జనవరి నుంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రజలకు తాగునీటితో పాటు పెరుగన్నం అందించే కార్యక్రమాన్ని చేపడతామని వెల్లడించారు. ప్రజలకు కష్టకాలంలో అండగా నిలవడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావం ఒక్క ప్రభుత్వ శాఖ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఒక్కరూ భాగస్వాములై పనిచేయాలని పిలుపునిచ్చారు.

119 గ్రామపంచాయతీలు, 48 వార్డుల్లో అవగాహన

నియోజకవర్గ పరిధిలోని 119 గ్రామపంచాయతీలు, 48 మున్సిపల్ వార్డుల్లో ఎల్‌నినో ప్రభావంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే సూచించారు. నీరు, విద్యుత్, భూగర్భ జలాలను పొదుపుగా వినియోగించేలా ప్రజలను చైతన్యపరచాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని, బస్తాండ్లు, జనసమ్మర్ధ ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. పశుగ్రాసం కొరత రాకుండా రైతులు తమ వద్ద ఉన్న పశుగ్రాసాన్ని భవిష్యత్తు అవసరాల కోసం నిల్వ చేసుకోవాలని సూచించారు. వీబీజీ రామ్‌జీ పథకం కింద వర్షపు నీటి సంరక్షణ పనులు, ఇంకుడు గుంతలు, ఊటకుంటలు, నీటి నిల్వ నిర్మాణాలు, ఫీడర్ ఛానళ్ల మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. ప్రతి ఇంటిపై పడే వర్షపు నీటిని వృథా చేయకుండా సోక్‌పిట్లు, వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాల ద్వారా భూగర్భ జలాలను పెంపొందించాలని సూచించారు. దామరచర్ల పెద్ద చెరువును మూసీ నది నీటితో నింపే అవకాశాలను పరిశీలించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.

కరువు నివారణకు సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలి

గతంలో రాష్ట్రంలో 20 వేల మెగావాట్ల గరిష్ఠ విద్యుత్ డిమాండ్ నమోదైనప్పటికీ, ఎంత ఖర్చయినా విద్యుత్ కొనుగోలు చేసి రైతుల పంటలు ఎండిపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఎమ్మెల్యే గుర్తుచేశారు. మరోవైపు దామరచర్లలో యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణం వల్ల ప్రజలపై సుమారు రూ.40 వేల కోట్ల దీర్ఘకాలిక ఆర్థిక భారం పడిందని, 2015లో అప్పటి కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ నీటి వాటాను 299 టీఎంసీలకు పరిమితం చేయడం ద్వారా దక్షిణ తెలంగాణకు అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. గ్రామాల్లో ఉపాధి కోల్పోకుండా సంక్రాంతి నాటికి వేల కోట్ల రూపాయలతో రహదారులు, కాలువల మరమ్మతులు చేపట్టేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. వికసిత్ భారత్ గ్రామీణ రోజ్‌గార్ అభియాన్ కింద 2026--27 సంవత్సరంలో రూ.6,311 కోట్లతో 11 కోట్ల పనిదినాల కల్పనకు సంబంధించిన కార్యక్రమాలను ప్రస్తావించారు.

నీటి వనరుల ఆడిట్ నిర్వహించాలి: కలెక్టర్

జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పటిష్టమైన కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో అందుబాటులో ఉన్న నీటి వనరులు, వాటి నిల్వ సామర్థ్యం, ఎంతకాలం నీరు అందుబాటులో ఉంటుందనే అంశాలపై సర్పంచులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు నీటి వనరుల ఆడిట్ నిర్వహించాలని సూచించారు. నీటి లీకేజీలను అరికట్టి ప్రతి నీటి చుక్కను పొదుపుగా వినియోగించాలన్నారు. వీబీజీ రామ్‌జీ పథకం కింద ప్రారంభం కాని పనులను వెంటనే ప్రారంభించి నీటి నిల్వ నిర్మాణాలు, కూలీలు అధికంగా అవసరమయ్యే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. రైతు వేదికల్లో ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమాన్ని, ప్రతి శుక్రవారం జరిగే రైతుల అవగాహన సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న, తక్కువ కాలవ్యవధిలో పండే పంటలను సాగు చేయాలని, వాటికి మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సమన్వయంతోనే ఎల్‌నినోను ఎదుర్కోగలం: ఎమ్మెల్సీ శంకర్ నాయక్

ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయం, తాగునీటి సరఫరా, సాగునీటి రంగాలపై పడే ప్రభావాలను ముందుగానే అంచనా వేయాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ముందస్తు నివారణ చర్యలను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి ఎల్‌నినో ప్రభావం, వివిధ శాఖలు చేపట్టాల్సిన ప్రత్యామ్నాయ చర్యలను వివరించారు. వ్యవసాయం, భూగర్భ జలాలు, ఉద్యానవనం, తాగునీరు, గ్రామీణాభివృద్ధి తదితర శాఖల అధికారులు తమ శాఖల కార్యాచరణను వివరించారు. ఈ సమావేశంలో మిర్యాలగూడ ఆర్డీవో రమణారెడ్డి, మున్సిపల్ వైర్‌పర్సన్ చిలుకూరి సుధా బాలకృష్ణ,, వైస్ చైర్‌పర్సన్ గుడిపాటి శిరీష నవీన్, మున్సిపల్ కమిషనర్ నర్రా శ్రీజా రెడ్డి వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు.. రైతులు, రైతు కూలీలను ఆదుకోవాలి!

కరువు మండలాల గుర్తింపు పెంచాలి

ఎకరాకు రూ.20 వేల పరిహారం అందించాలి: పోగుల సైదులు గౌడ్

తెలంగాణ రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టి రైతులను, రైతు కూలీలను ఆదుకోవాలని తెలుగుదేశం పార్టీ నాయకులు పోగుల సైదులు గౌడ్ డిమాండ్ చేశారు.రాష్ట్రంలో కరువు మండలాల గుర్తింపు సంఖ్యను పెంచడంతోపాటు, కరువు ప్రభావిత ప్రాంతాల్లోని రైతులు, రైతు కూలీలకు అండగా నిలిచేందుకు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ప్రకటించాలని కోరారు. ప్రభుత్వం యాసంగి పంటలు వేయవద్దని సూచిస్తే, పంటలు సాగు చేయని రైతులకు ఎకరాకు రూ.20 వేల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.రైతుబంధు పథకంతో సంబంధం లేకుండా రైతులకు, వ్యవసాయ కూలీలకు ప్రత్యేకంగా ఆర్థిక సహాయం అందించాలని సూచించారు. కరువు పరిస్థితులపై సమగ్రంగా చర్చించేందుకు అఖిలపక్ష నాయకులను ఢిల్లీకి తీసుకెళ్లి ప్రధానమంత్రి దృష్టికి సమస్యలను తీసుకెళ్లేలా ముఖ్యమంత్రి చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.రైతులు నష్టపోకుండా ప్రభుత్వం ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధమైన చర్యలు చేపట్టాలని పోగుల సైదులు గౌడ్ కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ తెలుగుదేశం పార్టీ బీసీ విభాగం మాజీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గంధం శ్రీనివాస్, మాజీ నల్లగొండ పార్లమెంట్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండీ జానిమియా, మైనార్టీ సెల్ పార్లమెంట్ కోశాధికారి షేక్ సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.



సురక్షిత్ బచ్పన్ అభియాన్' వేదికగా విద్యార్థులకు 'పోక్సో చట్టం'పై విస్తృత అవగాహన!

గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై కళ్లకు కట్టినట్లు వివరించిన గౌరవ న్యాయమూర్తి!

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి

నిర్మల్ జిల్లా కేంద్రంలోని వాసవి పాఠశాలలో 'సురక్షిత్ బచ్పన్ అభియాన్' (పాన్ ఇండియా స్కూల్ అవేర్‌నెస్ క్యాంపెయిన్) లో భాగంగా'బాలల రక్షణ–పోక్సో చట్టం–2012పై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన న్యాయమూర్తి రవీందర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, చదువుకునే వయసులో మొబైల్ వాడకం తప్పు కాదని, కానీ సామాజిక మాధ్యమాల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమాజంలోగానీ, విద్యాసంస్థల్లోగానీ ఎవరైనా లైంగికంగా వేధింపులకు గురిచేస్తే అస్సలు భయపడకుండా వెంటనే 1098 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి సమాచారం అందించాలని పిలుపునిచ్చారు. నేటి డిజిటల్ యుగంలో సోషల్ మీడియా అపరిచిత స్నేహాలు విద్యార్థుల జీవితాలను ప్రమాదంలోకి నెడుతున్నాయని, ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికలపై గుర్తుతెలియని వ్యక్తుల నుండి వచ్చే ఫ్రెండ్ రిక్వెస్ట్‌లను నిరాకరించకపోతే ఫోటోల మార్ఫింగ్, బ్లాక్‌మెయిలింగ్ వంటి తీవ్ర మానసిక హింసను ఎదుర్కోవాల్సి వస్తుందని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ (ఞూూూ) సెక్రటరీ రవీందర్ హెచ్చరించారు ఈ సందర్భంగా విద్యార్థులకు గుడ్ టచ్ (మంచి స్పర్శ), బ్యాడ్ టచ్ (చెడు స్పర్శ) లపై అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ అమూల్యమైన సమయాన్ని మొబైల్స్‌కు కేటాయించకుండా, చదువుకు మొదటి ప్రాధాన్యతనిచ్చి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని హితవు పలికారు.ఈ కార్యక్రమంలో వాసవి విద్యా సంస్థల కరస్పాండెంట్ పోతారెడ్డి, సీనియర్ న్యాయవాదులు జి. నరేంద్రనాథ్, బి. సాయికుమార్, ఎండీ సిరాజ్ కైసర్, పాఠశాల ప్రిన్సిపాల్ ఎం. రాజ్‌కుమార్, ఉపాధ్యాయ బృందం మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని సదస్సును విజయవంతం చేశారు.



స్కూల్ బ్యాగులతో '1930' ఆకృతి.. సైబర్ నేరాలపై బాలికల వినూత్న చైతన్యం

నేషనల్ సైబర్ సెక్యూరిటీ అవేర్‌నెస్ మంత్ సందర్భంగా ప్రత్యేక అవగాహన

సైబర్ అంబాసిడర్ చంద నాగరాజు, ఉపాధ్యాయుల మార్గదర్శనం

విద్యార్థుల చొరవను అభినందించిన ఇన్ ఛార్జ్ హెచ్ఎం చౌల లక్ష్మీనారాయణ

ప్రజా వాయిస్, కోరుట్ల:

నేషనల్ సైబర్ సెక్యూరిటీ అవేర్‌నెస్ మంత్ సందర్భంగా కోరుట్ల పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు సైబర్ నేరాలపై వినూత్న రీతిలో అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ స్కూలు బ్యాగులను నేలపై '1930' (సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నంబర్) ఆకారంలో అమర్చి అందరినీ ఆకట్టుకున్నారు. సైబర్ మోసాల పట్ల ప్రజల్లో చైతన్యం తెచ్చేలా చేపట్టిన ఈ కార్యక్రమానికి సైబర్ అంబాసిడర్ చంద నాగరాజు, ఆర్ట్ టీచర్ పిస్కా వేణు, కే. శ్రీనివాస్ సర్ మార్గదర్శనం చేశారు. విద్యార్థుల వినూత్న ఆలోచనను ఇన్ ఛార్జ్ ప్రధానోపాధ్యాయులు చౌల లక్ష్మీనారాయణ ప్రత్యేకంగా అభినందించారు.



రోడ్లపై వరికుప్పలు..ప్రయాణికులకు తప్పని ప్రమాద భయం!

ప్రజా వాయిస్, పాపన్నపేట

పాపన్నపేట మండల వ్యాప్తంగా ప్రధాన రహదారులు, గ్రామీణ రోడ్లపై రైతులు ధాన్యాన్ని నూర్పిడి చేసి, వరికుప్పలు పోస్తుండటంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారుల పక్కన, కొందరు ఏకంగా రోడ్లపైనే వరికుప్పలు, ధాన్యం రాశులు పోయడంతో పాటు రోడ్డు ఆక్రమించేలా అడ్డంగా రక్షణ గోడలు (దిమ్మెలు/రాళ్ళు) నిర్మిస్తుండటంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.ముఖ్యంగా పాపన్నపేట ప్రధాన రహదారితో పాటు పోచ్చెన్‌పల్లి, మిన్‌పూర్, కొత్తపల్లి, చిత్తరియాల్ తదితర గ్రామాల వైపు వెళ్లే రహదారులపై రాత్రి వేళల్లో ఈ ధాన్యం రాశులు వాహనదారులకు సరిగ్గా కనిపించక ద్విచక్ర వాహనదారులు స్కిడ్ అయి కిందపడుతున్నారు. ప్రయాణికుల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అధికారులు స్పందించాలి:

రహదారులపై ధాన్యం ఆరబోయకుండా, వరికుప్పలు వేయకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలు లేదా కల్లాల్లోనే ఆరబెట్టుకోవాలని, రోడ్లపై రాశులు పోసి ఇతరుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టవద్దని ప్రయాణికులు, స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



సింగరేణి కార్మికుల సొంత ఇంటి కల నెరవేర్చే వరకు పోరాటం

- సీఐటీయూ పోరాట ఫలితంగానే ఇంటి స్థలాలపై ప్రభుత్వ ప్రకటన

- దీపావళిలోపు ఆర్జీ-1 ఏరియాలో శంకుస్థాపనకు సన్నాహాలు

ప్రజా వాయిస్ గోదావరిఖని (8వ కాలనీ)

సింగరేణి కార్మికుల దశాబ్దాల సొంత ఇంటి కల నెరవేర్చే వరకు తమ పోరాటం ఆగదని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) రామగుండం–2 బ్రాంచ్ కార్యదర్శి కుంట ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు. వకీల్‌పల్లి గని వద్ద శుక్రవారం కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ఆరేళ్లుగా సీఐటీయూ ఆధ్వర్యంలో సొంత ఇంటి సాధన కోసం పోరు జాతాలు, బస్సు జాతాలు, ఆమరణ నిరాహార దీక్షలు, జీఎం కార్యాలయాల ముట్టడి వంటి కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. కార్మికుల నుంచి సంతకాల సేకరణ చేపట్టి ఎమ్మెల్యేలు, సింగరేణి యాజమాన్యం, సీఎండీ, డైరెక్టర్లకు వినతిపత్రాలు అందజేశామని గుర్తుచేశారు. కార్మికుల్లో చైతన్యం కల్పించేందుకు బ్యాలెట్ ఓటింగ్ కూడా నిర్వహించి యాజమాన్యం, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చామని పేర్కొన్నారు. ఈ పోరాటాల ఫలితంగానే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇటీవల సింగరేణి కార్మికులకు సొంత ఇంటి స్థలాలు, ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించడం హర్షణీయమన్నారు. దీపావళిలోపు ఆర్జీ–1 ఏరియాలో శంకుస్థాపనకు ప్రభుత్వం సిద్ధమవుతుండటం కార్మికులకు శుభపరిణామమని తెలిపారు. ఉద్యోగ విరమణ సమయానికి సొంత ఇల్లు ఉంటే కార్మికులకు ఆర్థికంగా ఎంతో భరోసా లభిస్తుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వకీల్‌పల్లి గని పిట్ కార్యదర్శి తిరుపతి, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి రాజశేఖర్, నాయకులు సుధాకర్, రమేష్, సాయి, వెంకటస్వామి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడలతో ప్రపంచస్థాయి గుర్తింపు సాధించాలి

- ఆర్చరీలో చికితకు రెండు స్వర్ణాలు.

- రూ.4.32 కోట్ల ప్రోత్సాహం

ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :

క్రీడల ద్వారా ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందడంతోపాటు రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ ప్రాంతం క్రీడలకు పుట్టినిల్లుగా నిలుస్తోందని, గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడా ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.శుక్రవారం సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలబాలికల వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ, చదువుతోపాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని, క్రమశిక్షణతో సాధన చేస్తే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని క్రీడాకారులకు సూచించారు.

చికిత విజయాలు గర్వకారణం :

సుల్తాన్‌పూర్‌కు చెందిన ఆర్చరీ క్రీడాకారిణి చికిత ఆసియా క్రీడల్లో రెండు స్వర్ణ పతకాలు సాధించడం తెలంగాణకు గర్వకారణమని అన్నారు. ఆమెకు రూ.4.32 కోట్ల ప్రోత్సాహం అందించడం క్రీడా ప్రతిభకు లభించిన గుర్తింపుగా అభివర్ణించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. నాలుగు జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొనగా, నిర్వాహకులు, వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, కార్యదర్శి అమిరిశెట్టి తిరుపతి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కనుకుంట్ల లక్ష్మణ్, ప్రజాప్రతినిధులు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



రక్తదానం ప్రాణదానంతో సమానం

- డీసీపీ భూక్య రామ్ రెడ్డి

- రక్తదానం.. ముగ్గురికి ప్రాణదానం

- రక్తదానం చేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :

రక్తదానం చేసి ఆపదలో ఉన్న ముగ్గురి ప్రాణాలను కాపాడవచ్చని పెద్దపల్లి డీసీపీ భూక్య రామ్ రెడ్డి అన్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంచుకొని సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం సుల్తానాబాద్ సర్కిల్ పోలీసుల ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్వీఆర్ గార్డెన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన డీసీపీ భూక్య రామ్ రెడ్డి, ఏసీపీ గజ్జి కృష్ణ లు మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ఎంతోమంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రక్తదాతలు ముందుకు వస్తే విలువైన ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు.రక్తదానం చేయడం వల్ల ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తవని, దానం చేసిన రక్తాన్ని శరీరం కొద్ది నెలల్లోనే తిరిగి ఉత్పత్తి చేసుకుంటుందని వివరించారు. సాధారణంగా ఒక్కో రక్తదాత నుంచి 250 నుంచి 300 మిల్లీలీటర్ల రక్తాన్ని సేకరించి అవసరమైన వారికి అందిస్తారని తెలిపారు. రానున్న రోజుల్లో సుల్తానాబాద్ సర్కిల్ పరిధిలో సుమారు వెయ్యి మంది రక్తదాతలను గుర్తించి, వారిని రక్తదానానికి ప్రోత్సహించేలా ఎస్ఐలు ప్రత్యేక చొరవ చూపాలని డీసీపీ సూచించారు.ఈ శిబిరంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పొన్నమనేని రంజిత్ రావు, ఎస్ఐలు చంద్రకుమార్, మధుకర్, సుధాకర్, రెడ్‌క్రాస్ సొసైటీ, లయన్స్ క్లబ్ సభ్యులు, పోలీస్ సిబ్బంది, పెద్ద సంఖ్యలో యువకులు పాల్గొన్నారు.



సంగెంలో ఘనంగా 'ఖేత్ భచావో అభియాన్'

భూసారాన్ని కాపాడుకునే విధానాలపై ఏవో నాగమణి అవగాహన

యాసంగిలో వరికి బదులు అపరాల సాగు చేయాలని సూచన

సబ్సిడీ మినుము విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజా వాయిస్, కోరుట్ల:

కోరుట్ల మండలం సంగెం గ్రామంలో 'ఖేత్ భచావో అభియాన్' (సాగు భూమి సంరక్షణ) కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి నాగమణి మాట్లాడుతూ భూసారాన్ని ఏ విధంగా సంరక్షించుకోవాలో రైతులకు వివరించారు. యాసంగిలో నీటి కొరత దృష్ట్యా వరి పంట వేయకుండా అపరాల సాగుకు మొగ్గు చూపాలని సూచించారు. ప్రస్తుతం ప్రభుత్వం సబ్సిడీపై మినుము విత్తనాలను అందిస్తోందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, రైతులు పాల్గొన్నారు.



బజార్‌హత్నూర్‌లో 102, 108 వాహనాల తనిఖీ: ప్రజలకు వేగవంతమైన ఉచిత వైద్య సేవలు అందాలి

నూతన ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ ఎన్. జనార్దన్ ఆకస్మిక తనిఖీ

వాహనాల రికార్డులు, నిర్వహణ, సిబ్బంది పనితీరు పరిశీలన

గర్భవతులతో నేరుగా మాట్లాడి సేవల అందుబాటుపై వివరాల సేకరణ

ప్రజా వాయిస్, బజార్‌హత్నూర్/ బోథ్ నియోజకవర్గం

బజార్‌హత్నూర్ మండల కేంద్రంలో గురువారం 102, 108 అత్యవసర అంబులెన్స్ వాహనాలను ఉమ్మడి జిల్లా నూతన ప్రోగ్రామ్ మేనేజర్ (పీవీ) ఎన్. జనార్దన్ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాలకు సంబంధించిన రికార్డులు, నిర్వహణ విధానం, సిబ్బంది పనితీరు మరియు సేవల నాణ్యతను ఆయన స్వయంగా పరిశీలించారు.అనంతరం మండలంలోని మంజరం తండా, టెంబి, అనంతపూర్ గ్రామాల నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి (ూనజ) వైద్య పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణీ స్త్రీలతో ఆయన నేరుగా మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో 102 అమ్మఒడి, 108 అంబులెన్స్ సేవల అందుబాటు, సిబ్బంది స్పందనపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యవసర సమయాల్లో ప్రజలందరూ 108, 102 ఉచిత అంబులెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సేవల నాణ్యతను మరింత మెరుగుపరిచి, బాధితులకు తక్షణమే వేగవంతమైన వైద్య సహాయం అందించాలని సిబ్బందిని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ 108 జిల్లా కోఆర్డినేటర్ సూరం శేఖర్, 102 జిల్లా కోఆర్డినేటర్ బి. మనోహర్, 102 పైలట్లు భగత్, నవీన్ కుమార్, 108 పైలట్ ప్రశాంత్, ఈఎమ్‌టీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా 1600 మీటర్ల రన్

ప్రజా వాయిస్ కొత్తగూడ

మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ కేంద్రంలో పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా 1600 మీటర్ల రన్నింగ్ కార్యక్రమం నిర్వహించారు.కొత్తగూడ అంబేద్కర్ సెంటర్ నుంచి బైపాస్ రోడ్డు వరకు నిర్వహించిన ఈ రన్నింగ్ కార్యక్రమాన్ని కొత్తగూడ ఎస్ఐ రాజ్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గంగారం ఎస్ఐ కోటేశ్వరరావు, ఎంఈఓ గుమ్మడి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, యువతలో క్రీడాస్ఫూర్తి, ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించారు.



భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయడంలో రైతులు సహకరించాలి

హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

ఎన్ హెచ్ 163జి భూసేకరణపై జాతీయ రహదారులు,..

రెవెన్యూ అధికారులు, పలు గ్రామాల రైతులతో జిల్లా కలెక్టర్ సమావేశం

ప్రజా వాయిస్ హన్మకొండ /పరకాల

ఎన్ హెచ్ 163జి పరకాల పరిధిలో మిగిలి ఉన్న భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయడానికి రైతులు సహకరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు.శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో 163జి జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి జాతీయ రహదారులు, రెవెన్యూ శాఖల అధికారులతో కలిసి భూసేకరణ ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న దామెర, శాయంపేట, పరకాల మండలాల పరిధిలో ఉన్న పలు గ్రామాల రైతులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణానికి రైతులు సహకరించాలని తెలిపారు.భూసేకరణలో భాగంగా భూములిచ్చిన రైతులకు పరిహారాన్ని త్వరగా ఇచ్చే విధంగా చర్యలు చేపడతామన్నారు.ఈ సమావేశంలో నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా వరంగల్ ప్రాజెక్టు డైరెక్టర్ భరద్వాజ్ , మేనేజర్ లింగయ్య, పరకాల ఆర్డీవో డీఎస్. వెంకన్న, శాయంపేట, దామెర,పరకాల తహసీల్దార్లు ప్రవీణ్ కుమార్, జ్యోతి వరలక్ష్మి దేవి , విజయలక్ష్మి, భూసేకరణ విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, తదితరులతో పాటు పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.



ఆంధ్ర వరద బాధితులకు సత్యం పవర్ సిస్టమ్స్ చేయూత

- విద్యుత్ మరమ్మతుల కోసం కార్మికులు, యంత్రాలతో రంగంలోకి..

- ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటాం..

- సత్యం పవర్ సిస్టమ్స్ చైర్మన్ మిట్టపల్లి ప్రవీణ్ కుమార్

ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :

ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో సంభవించిన వరదల కారణంగా తీవ్రంగా నష్టపోయిన ప్రాంతాల్లో విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరించేందుకు సత్యం పవర్ సిస్టమ్స్ సంస్థ ముందుకు వచ్చింది. ఆపదలో ఉన్న వారికి అండగా నిలవాలనే సంకల్పంతో సంస్థ చైర్మన్ మిట్టపల్లి ప్రవీణ్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు.తెలంగాణలోని కరీంనగర్ నుంచి అవసరమైన విద్యుత్ మరమ్మతుల పనులు చేపట్టేందుకు నైపుణ్యం కలిగిన కార్మికులతో పాటు, అవసరమైన యంత్రాలు, పరికరాలను సమకూర్చి ఆంధ్రప్రదేశ్‌కు బృందాన్ని పంపించారు. వరదల కారణంగా దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను సాధ్యమైనంత త్వరగా పునరుద్ధరించి బాధిత ప్రాంతాలకు విద్యుత్ సరఫరా అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఈ చర్య చేపట్టారు.ఆపద సమయంలో మానవతా దృక్పథంతో స్పందించి, వరద బాధిత ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరణకు సత్యం పవర్ సిస్టమ్స్ అందిస్తున్న సహకారంపై పలువురు అభినందనలు వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ డీఈలు, ఏడీలు, ఏఈలు, విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

క్రమశిక్షణ, పట్టుదలతో లక్ష్యాలను సాధించాలి

ప్రజా వాయిస్ దౌల్తాబాద్



విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ శంకర్ అన్నారు. శుక్రవారం దౌల్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ పార్టీ వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ జీవితంలో ఎంతో కీలకమైన అని ఈ సమయంలోనే భవిష్యత్తుకు పునాది వేసుకోవాలన్నారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని దాన్ని సాధించేందుకు ప్రణాళికబద్ధంగా తగిన కృషి చేయాలని అన్నారు. చదువుతోపాటు క్రమశిక్షణ, సమయపాలన మంచి నడవడికను అలవర్చుకోవాలని సూచించారు. ఎన్ని కష్టాలు ఎదురైనా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ లక్ష్య సాధనకు నిరంతరం కృషి చేయాలని పేర్కొన్నారు. ఉన్నత విద్యను అభ్యసించి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చడంతో పాటు కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కళాశాల తెలుగు అధ్యాపకుడు రాజు గత విద్యా సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు రూ.1,116 నగదును అందజేశారు. అలాగే ఏపిఎం మహిపాల్ కళాశాల అవసరాల కోసం ఎలక్ట్రానిక్ ప్రింటర్ను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మధు శ్రీవాత్సవ అధ్యాపకులు సుధాకర్, లక్ష్మీనారాయణ, దయానంద్, శివకుమార్, మంగతా నాయక్, సంపత్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, భాగ్యమ్మ, నాగేశ్వరరావు, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు....



వాతావరణ మార్పులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ తిరుపతి సూచన

చీడపీడల నివారణకు తగిన చర్యలు తీసుకుంటే సరిపోతుందని వెల్లడి

ఎల్నినో ప్రభావంతో రబీలో వరికి బదులు ఆరుతడి పంటలు వేయాలని విజ్ఞప్తి

ప్రజా వాయిస్, జగిత్యాల:

వేగంగా మారుతున్న వాతావరణ పరిస్థితులకు తగినట్లుగా పంటల్లో జాగ్రత్తలు పాటించేందుకు రైతులు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం జగిత్యాల కోఆర్డినేటర్ డాక్టర్ తిరుపతి తెలిపారు. శుక్రవారం ధర్మపురి మండలంలో మండల వ్యవసాయాధికారి రాజ్ కుమార్‌తో కలసి ఆయన పంట క్షేత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాతావరణ మార్పులతో చీడపీడలు తీవ్రమవుతున్నప్పటికీ రైతులు ఆందోళన చెందకుండా తగిన నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఎంఈఓ రాజ్ కుమార్ మాట్లాడుతూ.. ఎల్నినో అలాగే నీటి ఎద్దడి దృష్ట్యా రబీలో వరికి బదులు ఆరుతడి పంటలు వేసి నేల సారాన్ని పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు వేముల విక్రమ్ రెడ్డి, వేముల కరుణాకర్ రెడ్డి, శేర్ల మహేందర్, గంధం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జీవో నెంబర్ 76 లో జరుగుతున్న అవకతవకలపై విచారణ జరిపించాలి

రైతు వేదిక స్థలంలో ఇంటి పట్టాలా..

లక్ష్మణ్ అగర్వాల్ కుటుంబ సభ్యుల,స్నేహితుల ఇంటి పట్టాల దరఖాస్తులు రద్దు చేయాలి

జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్

ప్రజా వాయిస్ కొత్తగూడెం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం 76 జీవోలో జరుగుతున్న అవకతవకలపై విచారణ జరిపించాలని,కాంగ్రెస్ నాయకుడు లక్ష్మణ్ అగర్వాల్ కుటుంబ సభ్యులు,స్నేహితుల ఇంటి పట్టాల దరఖాస్తులు తిరస్కరించాలని జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శుక్రవారం పార్టీ శ్రేణులతో కలిసి కలెక్టర్ కార్యాలయం ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు.ఈ సందర్భంగా కామేష్ మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు కాంగ్రెస్,సిపిఐ పార్టీల రాజకీయ నాయకులతో,ప్రజా ప్రతినిధులతో కుమ్మక్కై లక్షల రూపాయలతో ఇంటి పట్టాలు మాట్లాడుకుని,కోట్ల రూపాయల ప్రభుత్వ స్థలాలను కబ్జాదారులకు కట్టబెట్టేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు.గతంలో ఐదవ వార్డు గంగాబిషన్ బస్తీలో కాంగ్రెస్ నాయకుడు లక్ష్మణ్ అగర్వాల్ తన కుటుంబ సభ్యులు,స్నేహితులు ఎనిమిది మందితో సుమారు 5,175 గజాలకు దరఖాస్తు చేసుకొనగా వాటిని రెండుసార్లు తిరస్కరించడం జరిగిందని అంతకు పూర్వం సదరు స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడితే 2019లో నాటి కలెక్టర్ రజత్ కుమార్ షైనీ అట్టి నిర్మాణాలను కూల్చివేసి అక్కడ రైతు వేదిక ఏర్పాటు చేయడం జరిగిందని గుర్తు చేశారు.మరల అట్టి స్థలంలో దరఖాస్తులపై విచారణ జరిపించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు.అదేవిధంగా గతంలో గొల్లగూడెం 16వ వార్డు నందు సుమారు 1500 గజాల ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపట్టగా నాటి తహసీల్దార్ అట్టి నిర్మాణాలను కూల్చివేయడం జరిగిందని మరల ఇప్పుడు 1500 గజాలకు ముగ్గురు పేర్లపై కమ్యూనిస్టు నాయకుడు ఇంటి పట్టాలకు దరఖాస్తులు చేయించింది వాస్తవం కాదా అని నిలదీశారు.అదేవిధంగా ఎంజీ రోడ్డులో దేవాదాయ శాఖకు సంబంధించిన భూమి విషయమై హైకోర్టులో కేసు పెండింగ్ ఉండగా అట్టి స్థలానికి కూడా దరఖాస్తులు చేయడం,దానికి రెవెన్యూ అధికారులు సహకరించడం సరైనది కాదన్నారు.జలగం వెంకట్రావు



శాసనసభ్యులుగా ఉన్నప్పుడు కొత్తగూడెం పట్టణంలో ప్రభుత్వ స్థలాలపై ఎన్ని బోర్డులు ఏర్పాటు చేయడం జరిగింది,ఇప్పుడు అట్టి స్థలాలలో ఎన్ని స్థలాలు ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయి,ఎన్ని స్థలాలు కబ్జాలకు గురి అయ్యాయో ఎమ్మెల్యే కూనంనేని సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.జిల్లా అధికారులు స్పందించి గతంలో తిరస్కరించబడి మరల ఇప్పుడు విచారణ చేపడుతున్న ఇంటి పట్టాల దరఖాస్తులపై ఉన్నత స్థాయి కమిటీ వేసి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంధం మల్లికార్జునరావు,జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ వీరు నాయక్,బీమా,మురళి,కార్తీక్,అనిత తదితరులు పాల్గొన్నారు.



జూలూరుపాడును కరువు ప్రాంతంగా ప్రకటించాలి

సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ డిమాండ్

తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా, వినతి పత్రం సమర్పణ

జూలూరుపాడు, ప్రజా వాయిస్:

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండలాన్ని తక్షణమే కరువు ప్రాంతంగా ప్రకటించాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ జిల్లా నాయకులు బాణోత్ ధర్మ, ఏదులాపురం గోపాలరావు లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎల్ నీనో ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా కరువు పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయని, సాగు చేసిన కొద్దిపాటి పంటలు కూడా నీళ్లు లేక ఎండిపోతున్నాయని తెలిపారు. ఈ క్లిష్ట పరిస్థితుల దృష్ట్యా మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని కోరారు. రైతులు పండించిన అన్ని రకాల పంటలకు కనీస మద్దతు ధరను నిర్ణయించి, దళారీ వ్యవస్థను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను కట్టడి చేసి, సామాన్యుడిపై భారం తగ్గించాలని కోరారు. దిగుబడి తగ్గిన పత్తి పంటకు మద్దతు ధర 15 వేల రూపాయలు ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక ఎమ్మెల్యే చొరవ చూపి ఇక్కడి పరిస్థితులను ప్రభుత్వం దృష్టిలో పెట్టి రీ సర్వే చేయించి మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ మండల నాయకులు లింగాల వీరభద్రం, తోటకూరి నరేష్, ధనమంతరావు, భద్ర, లొక్య, రమేష్, చిన్న, బాలు, బోడకా, సరోజిని, రమణి, సప్న, సీతారాం, రాములు తదితరులు పాల్గొన్నారు.

రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకుని రీ సర్వే పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి

రోజువారీగా లక్ష్యాలను నిర్దేశించుకుని రీ సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.శుక్రవారం నర్సాపూర్ (జి) మండలం చాక్ పల్లి గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టిన భూముల రీ సర్వే వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. మొత్తం రీ సర్వే చేయాల్సిన భూమి, పట్టా భూములు, ఎస్ఆర్ఎస్పీ భూములు, తదితర భూముల వివరాలు అడిగారు. భూముల హద్దుల గుర్తింపు పక్కాగా ఉండాలన్నారు. రీ సర్వే ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. సర్వే బృందం మొత్తం సభ్యుల పర్యవేక్షణలో, సంబంధిత రైతుల సమక్షంలో మాత్రమే



సర్వే చేపట్టాలన్నారు. నిర్దీత గడువులోగా రీ సర్వే ప్రక్రియను పూర్తి చేయాలన్నారు.రీ సర్వే ప్రక్రియ చేపట్టే సిబ్బంది తప్పనిసరి ఎండ నుండి రక్షణ పొందేలా టోపీలు ధరించాలని సూచించారు.తాగునీరు తగినంత అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలని పేర్కొన్నారు. అధికారులు, రైతుల పరస్పర సమన్వయంతో రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని తెలిపారు.స్థానిక రైతుతో మాట్లాడుతూ, ఆయన సాగు చేసిన పంటల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, నీటి కొరత అంశాలను బేరీజు వేసుకొని తక్కువ నీటితో పండే పంటలు మాత్రమే పండించాలని సూచించారు. వ్యవసాయ క్షేత్రంలో పంట కుంటలు (ఫామ్ పాండ్) లు నిర్మించుకోవాలని అన్నారు. పంట కుంటల నిర్మాణంతో భవిష్యత్తులో నీటి ఇబ్బందులు కలగకుండా ఉంటాయని చెప్పారు. రైతులు తమ పంట పొలాలలో పంట కుంటలు నిర్మించుకునే విధంగా అధికారులు ప్రోత్సహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీకాంత్, సర్వేయర్ విలాస్, సర్పంచ్ సుధాకర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



టి పి టి ఎఫ్ మండల కమిటీ ఎన్నిక..

మండల శాఖ ఎన్నికల్లో మాలోత్ రామేశ్వరరావుకు ఘన విజయం..

ఎంవీ రామేశ్వరరావుకు 33 ఓట్లు..

ప్రధాన కార్యదర్శిగా మాలోత్ బాబ్ సింగ్ విజయం

టి జి టి టి ఎఫ్..

ప్రజా వాయిస్, బయ్యారం..

తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) మండల శాఖ ఎన్నికలు గురువారం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో మండల శాఖ అధ్యక్షుడిగా ఎంవీ రామేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా మాలోత్ బాబ్ సింగ్ ఘన విజయం సాధించారు. ఉపాధ్యాయులు



పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఎన్నికల ఫలితాల్లో అధ్యక్ష పదవికి పోటీ చేసిన ఎంవీ రామేశ్వరరావుకు 33 ఓట్లు



లభించగా, ఆయన ప్రత్యర్థి జి. గోవర్ధన్‌కు 23 ఓట్లు వచ్చాయి. దీంతో రామేశ్వరరావు 10 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శి పదవికి పోటీ చేసిన మాలోత్ బాబ్ సింగ్‌కు 36 ఓట్లు లభించగా, ప్రత్యర్థి జి. కిషన్‌కు 18 ఓట్లు వచ్చాయి. దీంతో మాలోత్ బాబ్ సింగ్ 18 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

నూతన కార్యవర్గం ఎన్నిక..

మండల శాఖ నూతన కార్యవర్గంలో ఉపాధ్యక్షులుగా రాము, కృపావతి చింతి శ్రీలత; కార్యదర్శులుగా రవ్వ వెంకటేశ్వర్లు, బెల్లి లక్ష్మయ్య, ప్రేమల బిజ్జి శ్రీలత; జిల్లా కౌన్సిలర్లుగా కొమిరె ఉప్పలయ్య, కావటోయిన శ్రీనివాస్, ప్రేమల విజయలక్ష్మి; ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా దొంగం శ్రీనివాసరావు ఎన్నికయ్యారు...

సాగు భూమిపై అక్రమ రిజిస్ట్రేషన్‌కు యత్నం.!

20 ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన భూమికి హద్దులు మార్చి రిజిస్ట్రేషన్ చేసుకునే ప్రయత్నం

బీఆర్ఎస్ నేతల అనుచరులపై రైతు అంబటి జంగయ్య ఆరోపణలు

రిజిస్ట్రేషన్ నిలిపివేసి న్యాయం చేయాలని తహసీల్దార్‌కు వినతి

ప్రజా వాయిస్, తలకొండపల్లి:

రెండు దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూమిపైనే వివాదం నెలకొంది. తాను కొనుగోలు చేసి స్వాధీనంలో ఉంచుకున్న వ్యవసాయ భూమిని ఇతరులు తమదిగా చూపుతూ అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలానికి చెందిన రైతు అంబటి జంగయ్య ఆరోపించారు.మండల కేంద్రం గ్రామ శివారులోని సర్వే నంబర్ 17లో ఉన్న భూమిని 20 ఏళ్ల క్రితం కండే కృష్ణయ్య వద్ద కొనుగోలు చేసినట్లు జంగయ్య తెలిపారు. అప్పటి నుంచి భూమిని సాగు చేసుకుంటున్నానని పేర్కొన్నారు. అయితే బీఆర్ఎస్ పార్టీకి చెందిన రాష్ట్రస్థాయి నాయకుడి అనుచరులుగా చెప్పుకుంటున్న కొందరు, తన భూమికి హద్దులు ఏర్పాటు చేసి రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.గత నెల రోజులుగా ఈ వ్యవహారంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నానని, తన కుటుంబ సభ్యులు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. తన భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిలిపివేసి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.ఈ మేరకు కాంగ్రెస్, బీజేపీ నాయకులతో కలిసి తహసీల్దార్ కె. రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. భూ రికార్డులు, హద్దులను సమగ్రంగా పరిశీలించి అక్రమాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

అధికారులు మారినా..

పాలకులు మారినా తీరని రోడ్డు గోస!

పాపన్నపేట మండల పరిధిలోని కొత్తపల్లి రోడ్డుకు మోక్షం ఎప్పుడు?

గుంతలమయంగా మారిన రహదారి.. తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, వాహనదారులు

ప్రజా వాయిస్,పాపన్నపేట

అధికారులు మారుతున్నారు, పాలకులు మారుతున్నారు.. కానీ ఆ రోడ్డు పరిస్థితి మాత్రం మారడం లేదు! ఏళ్లు గడుస్తున్నా నిత్యం వేలాది మంది ప్రయాణించే కొత్తపల్లి రహదారి దుస్థితి చూసి ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుంతలమయమైన ఈ రహదారిపై ప్రయాణం నరకప్రాయంగా మారిందని ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర అవేదన వ్యక్తం చేస్తున్నారు.

?హామీలకే పరిమితమైన అభివృద్ధి:

?కొత్తపల్లి రహదారి ఆధునీకరణ, బీటీ రోడ్డు నిర్మాణానికి సంబంధించి ప్రజాప్రతినిధులు ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు ఇస్తున్నప్పటికీ, అవి కార్యరూపం దాల్చడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో వంతెన (బ్రిడ్జి) నిర్మించినప్పటికీ, దానికి ఇరువైపులా రోడ్డు పనులను పూర్తిస్థాయిలో చేపట్టకుండా వదిలేయడంతో రాకపోకలకు తీవ్ర విఘాతం కలుగుతోంది. చిన్నపాటి వర్షం పడితే చాలు, పెద్ద పెద్ద గుంతల్లో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. రాత్రి వేళల్లో వాహనదారులు గోతుల్లో పడి ప్రమాదాల బారిన పడుతుండటంతో ఆసుపత్రుల పాలవుతున్నారు.

ప్రయాణికుల నరకయాతన:

ఈ రోడ్డు గుండా నిత్యం పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, అత్యవసర వైద్యం కోసం వెళ్లే రోగులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు వాహనాలు నడపాలంటేనే భయాందోళనకు గురవుతున్నారు. తరచూ వాహనాలు పాడైపోయి ఆర్థికంగానూ నష్టపోతున్నామని డ్రైవర్లు వాపోతున్నారు.

అధికారుల నిర్లక్ష్యంపై నిరసన:

పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్లనే నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి కొత్తపల్లి రోడ్డుకు శాశ్వత పరిస్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు.

తక్షణమే బిటి రోడ్డు నిర్మించాలి:

"ఏళ్లుగా ఈ రోడ్డు సమస్య తీవ్రంగా ఉంది. రోడ్డు నిండా గుంతలే ఉండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఇకనైనా సంబంధిత రోడ్లు-భవనాల శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తక్షణమే నూతన బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలి. లేనిపక్షంలో మండల ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ధర్నాలు, ఆందోళన కార్యక్రమాలు చేపడతాం."





ముస్త్యాలపల్లిలో శివాలయ నిర్మాణానికి భూమిపూజ

ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి హాజరు

త్వరితగతిన ఆలయ నిర్మాణం పూర్తికావాలని ఆకాంక్ష

ప్రజా వాయిస్, హన్మకొండ / దామెర:

దామెర మండలం ముస్త్యాలపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించనున్న శివాలయానికి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు వేదమంత్రోచ్చారణలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు.అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామ ప్రజల భక్తి, ఐక్యతతో చేపడుతున్న శివాలయ నిర్మాణం త్వరితగతిన పూర్తిచేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆకాంక్షించారు. పరకాల నియోజకవర్గ ప్రజలందరిపై శివయ్య ఆశీస్సులు ఉండాలని ప్రార్థించారు.



నవంబర్ 7న జరుగు కామ్రేడ్ పాలడుగు క్రిష్ణ స్మారక బహిరంగ సభ జయప్రదం చేయండి

ప్రజా వాయిస్,కొత్త గూడ

నవంబర్ 1 నుండి 9 వరకు జరుగు అమరవీరుల సంస్మరణ సభలలో భాగంగా నవంబర్ 7న కొత్తగూడ లో జరుగు కామ్రేడ్ పాలడుగు కృష్ణ స్మారక బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ కొత్తగూడ లో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మండల కమిటీ ఆధ్వర్యంలో మోటార్ సైకిల్స్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కామ్రేడ్ సూర్యం, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ గూడూరు డివిజన్ కార్యదర్శి పాల్గొని మాట్లాడుతూ దోపిడి, పిడన,అసమానతలు లేని నూతన సమాజం కోసం భారత విప్లవధ్యంలో అమరత్వం పొందిన అమరవీరులకు జోహార్లు అర్పిస్తూ నవంబర్ 1 నుండి 9 వరకు జరుగు సభలను గ్రామ గ్రామాన విస్తృతంగా జరపాలని కోరుతూ నవంబర్ 7న కొత్తగూడ లో జరుగు కామ్రేడ్ పాలడు కృష్ణ స్మారక బహిరంగ సభను ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ యొక్క కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు పుల్లన్న, శ్రీశైలం, పూర్ణచందర్, బుర్కా బుచ్చి రాములు, గజ్జి సోమయ్య, నిర్మల, ఉడుత వెంకన్న, తాళ్ల పెళ్లి ప్రభాకర్, భూక్య శంకర్, మోహన్, బిచ్చు, రామచంద్రు, రాజా, మద్దెల వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా కొత్తపల్లిలో పోచమ్మ తల్లి విగ్రహ ప్రాణప్రతిష్ఠ

జన్నారం ప్రజావాయిస్

గుమ్మడిదల మండలం కొత్తపల్లి గ్రామంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో మండల పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో,కొనసాగుతున్నాయి. శుక్రవారం నాడు వేదమంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ వేదమూర్తులు పోచమ్మ తల్లి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ వి.ఆదర్శ్ రెడ్డి, రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి కొలన్ బాల్రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ హాజరై పోచమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని, గ్రామం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మంజుల సత్తయ్య, ఉప సర్పంచ్ రామేశ్వరి ఉమారెడ్డి, అనంతారం సర్పంచ్ కొమ్ము శీను, తొంట అంజయ్య, దేవేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు, వార్డు సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా వ్యాసరచన పోటీలు

చెడు వ్యసనాల జరిగే అనర్థాలను వివరించిన ఎస్సై శోభన్ బాబు

ప్రజావాయిస్/మునుగోడు:

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా శుక్రవారం మునుగోడు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మండల స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఎస్సై శోభన్ బాబు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని,ముఖ్యంగా ఆన్‌లైన్ మోసాలు, వ్యక్తిగత సమాచార దుర్వినియోగం వంటి అంశాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. అదేవిధంగా మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ, విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు.ఈ పోటీల్లో సైబర్ నేరాల నివారణలో పౌరులు మరియు పోలీసుల పాత్ర, మాదకద్రవ్యాల బెడద నివారణలో పోలీసుల పాత్ర, విద్యార్థులు వాటికి దూరంగా ఉండాల్సిన విధానం అనే అంశాలపై తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. అనంతరంవిద్యార్థులను బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో మండల విద్యాధికారి తల్లమల్ల మల్లేశం, ప్రధానోపాధ్యాయులు కే. బాలప్రసాద్,కుడతాల రత్నయ్య, గ్యార నర్సింహ, నలపరాజు వెంకన్న, గంగావతి, సదా లక్ష్మీ,వెంకటేశ్వర్లు, చంద్రం, సుధాకర్ రెడ్డి, జాల నాగమణి, సత్తి రెడ్డి,నాగరాజు,సతీష్ ,అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సేవలు చిరస్మరణీయం

పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ సైకిల్ ర్యాలీ..
విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసులకు ఘన నివాళి
సీఐ రవీందర్..

ప్రజా వాయిస్, బయ్యారం..

సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిరంతరం శ్రమిస్తూ, విధి నిర్వహణలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల రక్షణకు అంకితమవుతున్న పోలీసుల సేవలు చిరస్మరణీయమని సీఐ రవీందర్ అన్నారు. దేశ రక్షణలో, ప్రజల భద్రతలో భాగంగా విధి నిర్వహణ చేస్తూ అమరులైన పోలీసుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్ జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది, యువత సైకిళ్లపై ర్యాలీలో పాల్గొని పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. పోలీసుల సేవల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడం, విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల స్ఫూర్తిని యువతలో నింపడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ర్యాలీ ద్వారా పోలీసుల త్యాగనిరతిని, కర్తవ్యదీక్షను, సమాజం పట్ల వారికున్న బాధ్యతను చాటిచెప్పారు.



ప్రజల రక్షణే పోలీసుల ప్రథమ కర్తవ్యం..

పోలీసు విధులు కేవలం శాంతిభద్రతల పరిరక్షణకే పరిమితం కావని, ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణతో పాటు సమాజంలో నేరాలను అరికట్టడం, బాధితులకు న్యాయం అందించడం, విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలవడం వంటి అనేక బాధ్యతలను పోలీసులు నిర్వర్తిస్తున్నారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. విధి నిర్వహణలో ఎన్నో సవాళ్లు ఎదురైనా ప్రజల భద్రతే ధ్యేయంగా పోలీసులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు.పోలీస్ అమరవీరుల త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని, వారి సేవలను ఎప్పటికీ మరచిపోలేమని సీఐ రవీందర్ అన్నారు. సమాజంలో శాంతి, సామరస్యం నెలకొనేలా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించడమని తెలిపారు.బయ్యారం పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సైకిల్ ర్యాలీ పోలీస్ అమరవీరుల సేవలను స్మరించుకునే కార్యక్రమంగా నిలిచింది. పోలీసు అధికారులు, సిబ్బంది, యువత పాల్గొని అమరవీరుల త్యాగాలకు ఘనంగా నివాళులర్పించారు...

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, చట్టాలను గౌరవిస్తూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని సూచించారు.

అమరవీరుల త్యాగాలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకం..

దేశంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలను అర్పించిన పోలీసు అమరవీరుల కుటుంబాలకు సమాజం ఎల్లప్పుడూ అండగా నిలవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం అంటే వారికి నివాళు లర్పించడమే కాకుండా, వారు ఆశించిన శాంతియుత సమాజ నిర్మాణానికి ప్రతి

హౌసింగ్ సొసైటీ భూముల్లో ప్రభుత్వ భూమి కలవడంతో కోర్టులో వివాదం

వివాదాస్పద భూములను పరిశీలించిన కలెక్టర్
సర్వేతో హద్దుల గుర్తింపు.. ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్ వేయిస్తామన్న కలెక్టర్ ప్రతీక్ జైన్

పటన్ చెరు ప్రజావాయిస్

అమీన్‌పూర్‌లో హౌసింగ్ సొసైటీ పట్టా భూములతో పాటు ప్రభుత్వ భూమి కూడా కలిసి ఉండటంతో తలెత్తిన వివాదం కోర్టులో కొనసాగుతున్న నేపథ్యంలో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. అమీన్‌పూర్‌లోని నారాయణరావు లేఅవుట్, మల్లికార్జున నగర్ పరిధిలో ఉన్న ఇండస్ట్రియల్ ఎంప్లాయీస్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ భూములను పరిశీలించారు. తమ పట్టా భూములపై కొందరు ప్రైవేట్ వ్యక్తులు కన్నేసి కబ్జాకు ప్రయత్నిస్తున్నారని బాధితులు ప్రజావాణి కార్యక్రమంలో పలుమార్లు ఫిర్యాదులు చేయడంతో కలెక్టర్ స్పందించారు.సర్వే నంబర్లు 948 నుంచి 953, 969, 970, 989 నుంచి 994, 996 నుంచి 999, 1001 నుంచి 1008, 1010, 1014, 1016, 1018 నుంచి 1020, 1023, 1030, 1033, 1034, 1050, 1057, 1060 నుంచి 1064, 1110 నుంచి 1112, 1114 నుంచి 1116, 1118, 1119, 1123



పరిధిలో సుమారు 90 నుంచి 92 ఎకరాల భూములు ఉన్నాయని బాధితులు తెలిపారు. ఈ భూముల్లో పట్టా భూములతో పాటు ప్రభుత్వ భూమి కూడా కలిసి ఉండటంతో సరిహద్దుల విషయంలో వివాదం తలెత్తి కోర్టులో కేసు కొనసాగుతోందని వివరించారు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని కొందరు ప్రైవేట్ వ్యక్తులు భూములను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.దీనిపై స్పందించిన కలెక్టర్ ప్రతీక్ జైన్ ప్రభుత్వ, పట్టా భూములను సర్వే చేయించి హద్దులు గుర్తించడంతో పాటు ప్రభుత్వ



భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. ఏళ్ల తరబడి భూముల సరిహద్దుల వివాదం పరిష్కారం కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. 2014 హైకోర్టు ఆదేశాలను పరిగణనలోకి తీసుకుని, కోర్టులో కొనసాగుతున్న వివాదానికి అనుగుణంగా చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరారు. తమ పట్టా భూములకు రక్షణ కల్పించడంతో పాటు ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ క్షేత్రస్థాయి పర్యటనతో భూముల సరిహద్దులపై స్పష్టత వచ్చి, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యకు పరిష్కారం లభిస్తుందని బాధితులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నేరరహిత వరంగల్ - డ్రగ్స్ రహిత సమాజమే మా లక్ష్యం

వరంగల్ సిపి ఎన్.శ్వేత

ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది.ఇందులో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత ఆధ్వర్యంలో పోలీసు బృందాలు ఆటోనగర్, కరీమాబాద్, కాశిబుగ్గ, శంభునిపేట, శివనగర్, ఎల్.బి. నగర్ ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తుకు, సమాజ భద్రతకు తీవ్ర ముప్పు అని పేర్కొన్నారు. డ్రగ్స్ సరఫరా, విక్రయాలు, అక్రమ రవాణాకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యసనానికి గురైన వారికి చికిత్స, కౌన్సెలింగ్ అందించి సాధారణ జీవనంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ



తనిఖీలో భాగంగా రౌడీషీటర్లు, పాత నేరస్థులు, డ్రగ్స్ కేసుల్లో ప్రమేయం ఉన్నవారు, అనుమానితులతో కలిపి మొత్తం 107 మందిని అదుపులోకి తీసుకొని డ్రగ్స్ పరీక్షలు చేయగా, వారిలో 29 మందికి పాజిటివ్ రిపోర్ట్ వచ్చిందని, వీరిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, తెలిపారు.అలాగే సరైన ధ్రువపత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 17 ద్విచక్ర వాహనాలు, 2 కార్లు, 3 ఎలక్ట్రిక్ మోటార్ పంపులను నిబందనల ప్రకారం స్వాధీనం చేసుకున్నామని, అలాగే మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో మానవ అక్రమణ (పిటా) యాక్ట్ చట్టం కింద ఒక కేసు నమోదు చేశామని తెలిపారు.కమ్యూనిటీ కనెక్ట్

కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రజలతో మాట్లాడి ఆయా ప్రాంతాల్లోని నేరాలు, అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం సేకరించామని, నేరాల నియంత్రణలో సీసీటీవీ కెమెరాల ప్రాధాన్యతను వివరిస్తూ, ప్రతి కాలనీలో కమ్యూనిటీ సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

ఇకనుండి ఇదేవిదమైన ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, డ్రగ్స్ వినియోగం, విక్రయాలు లేదా ఇతర నేరాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే డయల్ 100 / 112కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని స్థానిక ప్రజలను కోరుతూ, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డిసిపి ధార కవిత వరంగల్ ఇంచార్జీ ఏసిపి నరసింహారావు మట్టేవాడ, ఇంతేజార్ గంజ్, మిల్స్ కాలనీ, మడికొండ, ఐటి కోర్ ఇన్స్పెక్టర్లు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

కమలాపూర్ మండల కేంద్రంలోని జనజ.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన హనుమకొండ జిల్లా కలెక్టర్

ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన నాణ్యమైన వైద్య సేవలను అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు.శుక్రవారం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని జనజ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా హాస్పిటల్ కి ప్రతిరోజు ఎంతమంది ఓపి సేవల నిమిత్తం వస్తుంటారని, పేషెంట్ల వివరాలు ఆన్లైన్లో నమోదు చేస్తున్నారా అని వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.ఆరోగ్య కేంద్రంలోని మేల్, ఫిమేల్ వార్డులను, ఓపి నమోదును కలెక్టర్ పరిశీలించారు.టీకాల గది, మెడికల్ రికార్డు విభాగం, మెడికల్ స్టోర్ ను తనిఖీ చేశారు. ఆసుపత్రిలో వైద్యులు సిబ్బంది హాజరు వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకుని రిజిస్టర్ ను పరిశీలించారు.



ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. వైద్య సేవలపై ప్రజల్లో నమ్మకం పెంచే విధంగా వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు.వైద్య సేవల నిమిత్తం వచ్చే రోగులకు ఆరోగ్య కేంద్రంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. పేషంట్లకు అవసరమైన అన్ని సదుపాయాలు ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.మండల నిర్వహణ సరిగ్గా ఉండాలన్నారు.

కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలోనే తెలంగాణకు భరోసా

అర్హులైన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు కావాలి

మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఎన్నికల ములుగు జిల్లా ఇంఛార్జీ ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి



ప్రజా వాయిస్ ములుగు జిల్లా:
ఏటూరునాగారం మండలం:

తెలంగాణ ప్రజల హక్కుల పరిరక్షణకు, రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం పోరాడే శక్తి బీఆర్ఎస్ పార్టీయేనని, తెలంగాణ సాధకుడు కేసీఆర్, పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ నాయకత్వంలోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్చార్జీ ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆదేశాల మేరకు ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు నివాసంలో ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియపై సన్నాహక సమావేశం నిర్వహించారు.

కేసీఆర్ దూరదృష్టితోనే తెలంగాణ సాధన, పదేళ్ల అభివృద్ధి.

ఈ సందర్భంగా ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి మాట్లాడుతూ..... తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, పదేళ్ల పాటు సకల జనుల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. ఆయన పాలనలో అన్ని వర్గాల అభ్యున్నతికి పెద్దపీట వేశారని, తెలంగాణ అభివృద్ధికి బలమైన పునాదులు వేశారని పేర్కొన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, పరిశ్రమల అభివృద్ధి, పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంలో కేటీఆర్ కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. ఆయన సమర్థవంతమైన నాయకత్వం పార్టీకి మరింత బలాన్ని ఇస్తుందని అన్నారు.

ప్రతి పట్టభద్రుడు, ఉపాధ్యాయుడు ఓటరుగా నమోదు కావాలి:

రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలు అత్యంత కీలకమని, అర్హులైన ప్రతి పట్టభద్రుడు, ఉపాధ్యాయుడు తమ ఓటు హక్కును నమోదు చేసుకునేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కేసీఆర్ పాలనలో అమలైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. అర్హులైన వారందరినీ గుర్తించి ఓటరు నమోదులో భాగస్వాములను చేయాలని దిశానిర్దేశం చేశారు.

ఈ సమావేశంలో ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి, కాకులమర్రి ప్రదీప్ రావు, పోరిక గోవిందు నాయక్, తుమ్మ మల్లారెడ్డి, తాడూరి రఘు, మండల పార్టీ అధ్యక్షుడు గడదాసు సునీల్ కుమార్, ఎండీ ఖాజా పాషా, సయ్యద్ సర్దార్ పాషా, కర్రె రవీందర్, తురం పద్మ, ఉపసర్పంచ్ పర్వతాల, సర్పంచ్ నాగార్జున, రాంనగర్ సర్పంచ్, దన్నపునేని కిరణ్, కుమ్మరి చంద్రబాబు, జాడి భోజరావు, చిన్నికృష్ణ, కత్త యాదగిరి, బెడుక రమేష్, తిరుపతి, లక్ష్మయ్య, గారే ఆనంద్, ఇట్టం నాగరాజు, మెరుగు వెంకటేశ్వర్లు, బాబా, గంప కిరణ్, ఏంపెల్లి రాజు, పెద్దబోయిన బాలకృష్ణ, గండేపల్లి నాగరాజు, వీరన్న, గోపి, కాళ్ల రామకృష్ణ, ఆవుల లక్ష్మీనారాయణ, నాగసాగర్, ఈసం స్వరూప, చందా లక్ష్మీనారాయణ, కొండాయి చిన్ని, బట్టు రమేష్, బండి లక్ష్మితో పాటు ఏటూరునాగారం మండలంలోని అన్ని గ్రామాల ఎమ్మెల్సీ ఇన్‌చార్జులు, గ్రామ కమిటీ అధ్యక్షులు, మాజీ, ప్రస్తుత సర్పంచులు, మహిళా నాయకులు, ముఖ్య నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



బార్వాద్, జిన్నారం గ్రామాల్లో రేషన్ కార్డుల పంపిణీ

కూలిపోయిన ఇంటిని పరిశీలించిన అధికారులు, ప్రజా ప్రతినిధులు

ప్రజావాయిస్/కోట్ పల్లి:

మండలంలోని బార్వాద్, జిన్నారం గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఎంఆర్ఓ ఆనందరావు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రామావత్ అనితా రమేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తేనె రామచంద్ర రెడ్డి, బర్వాద్ సర్పంచ్ ప్రతిభా రమేష్, జిన్నారం సర్పంచ్ హుస్సేన్, గ్రామాల నాయకులు పాల్గొని కార్డులను అందజేశారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కూలిపోయిన ఇంటి పరిశీలన

మండలంలోని బార్వాద్ గ్రామంలో ఇటీవల కూలిపోయిన ఇంటిని మండల ఎంఆర్ఓ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రామావత్ అనితా రమేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తేనె రామచంద్ర రెడ్డి పరిశీలించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం తరఫున తగిన సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు.



ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ప్లాట్లకు ఎల్ఆర్ఎస్ ఛార్జీల మినహాయింపు

- **మల్లన్నసాగర్ నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం ఊరట**
- **అర్హులైన అసలు లబ్ధిదారులకు ఎల్ఆర్ఎస్ రుసుముల నుంచి మినహాయింపు**
- **మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ**
- **ఇళ్ల నిర్మాణ అనుమతుల ప్రక్రియలో ఆర్థిక భారం తగ్గనున్న ఉపశమనం**
- **ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కాలనీ కౌన్సిలర్లు, ప్రజల కృతజ్ఞతలు**

ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం :

మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయి, పునరావాసంలో భాగంగా గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముట్రాజ్‌పల్లిలో ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో ప్లాట్లు పొందిన అర్హులైన నిర్వాసిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఊరట కల్పించింది. ఆయా ప్లాట్లకు లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం కింద చెల్లించాల్సిన రుసుముల నుంచి



మినహాయింపు కల్పిస్తూ మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 26న జారీ చేసిన మెమో నంబర్ 9022/plg.III/2026 ప్రకారం, ప్రభుత్వ పునరావాస ప్రక్రియలో భాగంగా ప్లాట్లు పొందిన అసలు అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే ఈ మినహాయింపు వర్తిస్తుంది. దీంతో అర్హులైన నిర్వాసిత కుటుంబాలు ఎల్ఆర్ఎస్ రుసుముల చెల్లింపు భారం నుంచి ఉపశమనం పొందనున్నాయి. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన అనుమతుల ప్రక్రియలోనూ ఈ నిర్ణయం ప్రయోజనకరంగా ఉండనుంది. అయితే, ఈ మినహాయింపు వల్ల భవన నిర్మాణానికి సంబంధించిన ఇతర తప్పనిసరి నిబంధనల నుంచి మినహాయింపు లభించదు. ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయి పునరావాస కాలనీల్లో నివసిస్తున్న కుటుంబాలకు ఈ నిర్ణయం ఆర్థికంగా కొంత ఊరటనివ్వనుంది. ముఖ్యంగా ఇళ్ల నిర్మాణానికి ముందుగా ప్లాట్ల క్రమబద్ధీకరణ రుసుముల భారం తగ్గడంతో, అర్హులైన కుటుంబాలకు నిర్మాణ అనుమతుల ప్రక్రియలో వెసులుబాటు కలగనుంది. అయితే, మినహాయింపు వర్తించే అర్హతలను సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. ఈ నిర్ణయం పట్ల ఆర్‌అండ్‌ఆర్ కాలనీ కౌన్సిలర్లు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. మినహాయింపు కల్పించిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి, నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి సహకరించిన సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తూంకుంట అంక్షారెడ్డి, మాజీ ఎమ్మెల్యే, గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తూంకుంట నర్సారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

వడ్ల కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి..!

సిపిఎం ఆధ్వర్యంలో ఎమ్మార్వోకు వినతిపత్రం

ప్రజా వాయిస్/దుబ్బాక :

నియోజకవర్గంలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలనీ, దుబ్బాక మండలంలో వడ్ల కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలనీ డిమాండ్ చేస్తూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో దుబ్బాక తహశీల్దార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.భాస్కర్ మాట్లాడుతూ... దుబ్బాక నియోజకవర్గం అంటేనే వెనుకబడిన ప్రాంతంగా ఉంటుందనీ, భూగర్భ జలాలు అడుగంటిపోయి రైతుల పంటలు దిగుబడి రాక రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రస్తుతం ఎల్ నీనో ప్రభావంతో వర్షపాతం కూడా చాలా తక్కువగా కురిసినందున తెలంగాణ రాష్ట్రంలో 365 మండలాలను కరువు మండలాలుగా పర్కటించిన రాష్ట్ర ప్రభుత్వం దుబ్బాక నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కూడా అదే



తరహాలో కరువు నెలకొన్నదనీ తెలిపారు. ప్రస్తుతం రైతుల బోరుబావులు ఎండిపోయి భూగర్భజలాలు అడుగంటి పోతున్నాయనీ ప్రజలకు తాగునీరు కూడా అందడానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఈ నేపథ్యంలో దుబ్బాక నియోజకవర్గంలోని అన్ని మండలాలను వెంటనే కరువు మండలాలుగా ప్రకటించి దుబ్బాక నియోజకవర్గం పరిధిలోని ప్రజలను,రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. దుబ్బాక మండలం మరియు మున్సిపల్ పట్టణ పరిధిలోని ఐకెపి, పిఎసిఎస్ సొసైటీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలనీ డిమాండ్ చేశారు. రైతులు పండించిన ధాన్యం బయటనే పూర్తిగా ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలలోకి తేవాలని అధికారులు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. అకాల వర్షాలు కురిస్తే చేతికి వచ్చిన పంట పూర్తిగా నష్టపోయి రైతులు దివాలా తీసే ప్రమాదం పొంచి ఉన్నందునీ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలకు రైస్ మిల్లులను మంజూరు చేసి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలనీ డిమాండ్ చేశారు. రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న ధాన్యం తూకాలలో ఎలాంటి కోతలు విధించకుండా రైతులకు న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు ఎండీ .సాదిక్, కంపే ఎల్లయ్య, శ్రీనివాస్, ఎండీ. సాజిద్, లక్ష్మీనర్సయ్య, కృష్ణహరి, బొప్పారం స్వామి, ఎస్. స్వామి తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లోకి పీఎంకిసాన్ 24వ విడత నిధులు

ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకంచేసిన బీజేపీ నాయకులు

ప్రజా వాయిస్ హన్మకొండ /ఆత్మకూర్

రైతుల సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని బీజేపీ ఆత్మకూర్ మండల అధ్యక్షులు ఉప్పుగళ్ల శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆత్మకూరు మండల రైతు వేదిక వద్ద ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రైతుల సంక్షేమం కోసం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో భాగంగా 24వ విడత నిధులను రైతుల ఖాతాల్లోకి విడుదల చేసిన సందర్భంగా ఆత్మకూరు మండల రైతులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆత్మకూరు రైతు వేదికలో పీఎం కిసాన్ నిధుల విడుదల కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. అనంతరం బీజేపీ ఆత్మకూర్ మండల శాఖ ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు ఉప్పుగళ్ల శ్రీకాంత్ రెడ్డి నేతృత్వంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధి లక్ష్యంగా కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, పీఎం కిసాన్ పథకం ద్వారా అర్హులైన రైతులకు ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు గట్టు వేణుగౌడ్, మాజీ మండల అధ్యక్షులు ఇర్సంద్ల సదానందం, ప్రధాన కార్యదర్శి బయ్యా పైడి, ఆచార్య రవ్వ శివప్రసాద్, జిల్లా నాయకులు మామునూరు శ్రీనివాస్, ఉగా సాయికృష్ణ, మండల నాయకులు జక్కుల మహేందర్, వజ్ర రవికుమార్, వంగాల బుచ్చిరెడ్డి, దుంపాల జైపాల్ రెడ్డి, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కరువు మండలాల జాబితాలో దుబ్బాకను చేర్చాలి..

- మహానాడు నియోజకవర్గం కన్వీనర్ నర్సింలు

ప్రజా వాయిస్ /దుబ్బాక:



ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో సిద్దిపేట జిల్లాలోని దుబ్బాక మండలానికి చోటు కల్పించకపోవడం పట్ల మాల మహానాడు దుబ్బాక నియోజకవర్గం కన్వీనర్ నీరటి నర్సింలు పార్టీ యువజన నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ...మండలంలోని రైతులు ఎదుర్కొంటున్న వ్యవసాయ సమస్యలు, పంటల పరిస్థితి, సాగునీరు, వర్షాభావ పరిస్థితులను ప్రభుత్వం సమగ్రంగా పరిశీలించాలని ఆయన కోరారు. క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా కరువు మండలాల జాబితాను ప్రకటించడం వల్ల అర్హులైన రైతులకు ప్రభుత్వ సహాయం అందకుండా నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. దుబ్బాక మండలంలోని గ్రామాల్లో వ్యవసాయ పరిస్థితులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం మండలాన్ని కరువు మండలాల జాబితాలో చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణమే స్పందించి, దుబ్బాక మండలాన్ని కరువు మండలాల జాబితాలో వెంటనే చేర్చాలని మాల మహానాడు దుబ్బాక నియోజకవర్గం కన్వీనర్ నీరటి నర్సింలు కోరారు.లేనిపక్షంలో దుబ్బాక రైతు ల ఆదేశాల మేరకు రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

వ్యవసాయంలో మార్పులకు రైతులు సిద్ధం కావాలి: అదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

నేల, నీటి సంరక్షణతోనే సుస్థిర వ్యవసాయం సాధ్యం

పిప్పల్‌కోటిలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతు అవగాహన సదస్సు

కరువు వేళ బ్యాంకర్లు మానవతా దృక్పథంతో వ్యవహరించాలి.. రుణాలు, బకాయిల పేరిట వేధించవద్దు

ప్రజా వాయిస్, /ఆదిలాబాద్

సాంప్రదాయ సాగు పద్ధతులకు స్వస్తి పలికి, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక వ్యవసాయ విధానాలను అనుసరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా రైతులకు పిలుపునిచ్చారు. శుక్రవారం భీంపూర్ మండలం పిప్పల్‌కోటి గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం (ఖఎఖ) ఆధ్వర్యంలో నిర్వహించిన 'సాగుభూమి సంరక్షణ' అవగాహన సదస్సుకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో సాధారణం కంటే 35 నుండి 36 శాతం తక్కువ వర్షపాతం నమోదు కావడంతో భీంపూర్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించామని, రైతులు అధైర్యపడవద్దని భరోసానిచ్చారు. కరువు పరిస్థితుల నేపథ్యంలో పాత బకాయిలు, రుణాల వసూళ్ల పేరిట రైతులను ఇబ్బంది పెట్టవద్దని బ్యాంకర్లకు స్పష్టమైన సూచనలు చేశారు. పిప్పల్‌కోటి రిజర్వాయర్ భూసేకరణ నిధులు సిద్ధంగా ఉన్నాయని, త్వరలోనే నిర్వాసిత రైతులకు నిబంధనల ప్రకారం పరిహారం అందజేస్తామని తెలిపారు.అంతకుముందు గ్రామంలో 'వీబీ-జీ రామ్ జీ' పథకంలో భాగంగా నిర్మిస్తున్న ఫార్మ్ పాండ్ పనులను, ఇంకుడు గుంతలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం కలెక్టర్ చొరవతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తయినందుకు గాను లబ్ధిదారులు ఆయనను



శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, ణూూూ రవీందర్ సింగ్, ణ=ణూ్రాణ రాథోడ్ రవీందర్, ఖఎఖ శాస్త్రవేత్త రాంగోపాల్ వర్మ, తహశీల్దార్ రమేష్ నాయక్, ఫీణూ గోపాలకృష్ణ రెడ్డి, స్థానిక సర్పంచ్ రమేష్, నాయకులు భోజారెడ్డి, అధికారులు, రైతులు పాల్గొన్నారు.



నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలి

- ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలి

- ఎల్‌నినో ప్రభావంపై కళాప్రదర్శనతో అవగాహన

ప్రజా వాయిస్ దౌల్తాబాద్:

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు సాగు, తాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, విద్యుత్‌ను వృథా చేయకుండా జాగ్రత్తలు పాటించాలని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు సూచించారు. శుక్రవారం దౌల్తాబాద్ మండలం గోవిందాపూర్ గ్రామంలో ఉపాధి హామీ పనుల వద్ద సిద్దిపేట జిల్లా కలెక్టర్, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బిజ్జూరి రవికుమార్ ఆదేశాల మేరకు దుబ్బాక టీం కళాకారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కళాకారులు మాట, పాటల రూపంలో ఎల్‌నినో ప్రభావం, దాని వల్ల వ్యవసాయ రంగంపై పడే ప్రభావాలను వివరించారు. రైతులు పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగులో మార్పులు చేసుకోవాలని, అధిక నీరు అవసరమయ్యే వరి పంటకు ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలను ప్రోత్సహించాలని సూచించారు. భవిష్యత్తులో నీటి కొరత తలెత్తకుండా ఇప్పటి నుంచే సాగు, తాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలని అవగాహన కల్పించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి కూడా ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమంలో దుబ్బాక తెలంగాణ సాంస్కృతిక సారథి టీం లీడర్ బిట్ల ఎల్లయ్య, కళాకారులు ఆస రామారావు, కమ్మరి నర్సయ్య, పిల్లుట్ల ప్రకాశ్, జినుక దేవదాసు, తుమ్మల ఎల్లయ్య, సందుర్ల శేఖర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



భక్తి, ఆధ్యాత్మికతతోనే సమాజంలో సుఖశాంతులు

- పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో ప్రత్యేక పూజలు

- గ్రామ ప్రజలకు అమ్మవారి ఆశీస్సులు కలగాలి

- గజ్వేల్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం :

భక్తి, ఆధ్యాత్మిక చింతనతో మనిషికి మానసిక ప్రశాంతత లభించడంతో పాటు సమాజంలో సుఖశాంతులు నెలకొంటాయని గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వర్గల్ మండలం నాచారం గ్రామంలో నిర్వహించిన శ్రీ పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో ఆయన పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. దైవభక్తి, ఆధ్యాత్మిక చింతన మనిషికి మానసిక ప్రశాంతత, ధైర్యం, సానుకూల ఆలోచనలను అందిస్తాయని పేర్కొన్నారు. గ్రామదేవతల ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రజలంతా భక్తిభావంతో పాటు ఐకమత్యం, సోదరభావంతో ముందుకు సాగాలని సూచించారు. మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. శ్రీ పెద్దమ్మతల్లి దీవెనలతో నాచారం గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలకు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖశాంతులు కలగాలని మనస్ఫూర్తిగా ప్రార్థించారు.



రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

జిన్నారం ప్రజావాయిస్

గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని 1వ, 2వ వార్డుల్లో కొనసాగుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులతో పాటు వివిధ అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ వార్డు కౌన్సిలర్లతో కలిసి పరిశీలించారు. ఆయా వార్డుల్లో జరుగుతున్న పనుల పురోగతిని అడిగి తెలుసుకుని, నిర్మాణ పనులు ఏ విధంగా కొనసాగుతున్నాయో పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పనుల్లో ఎలాంటి లోపాలు లేకుండా, నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగా నిర్మాణాలను పూర్తి చేయాలని తెలిపారు. ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడంతో పాటు, వార్డుల్లో అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అభివృద్ధి పనులను సక్రమంగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, వార్డు కౌన్సిలర్లు వివిధ పార్టీల నాయకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

భూ భారతి రీ సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

- సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి

- జిల్లాలో 103 గ్రామాల్లో భూముల రీ సర్వే

- చిన్న గ్రామాల నుంచి సర్వే ప్రక్రియ ప్రారంభం

- ఆరేపల్లిలో 656 ఎకరాల భూమి సర్వే

- హద్దులను రైతులు స్వయంగా పరిశీలించుకోవాలి

- అభ్యంతరాలుంటే మరోసారి సర్వేకు అవకాశం

ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం :

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి రీ సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె.హైమావతి తెలిపారు. శుక్రవారం గజ్వేల్ మండలం ఆరేపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన భూ భారతి, భూముల రీ సర్వే అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో మొదటి, రెండో విడతల్లో మొత్తం 103 గ్రామాల్లో భూముల రీ



సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. ముందుగా చిన్న గ్రామాలను ఎంపిక చేసుకుని అక్కడి భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఆరేపల్లి గ్రామ పరిధిలోని 656 ఎకరాల్లో తొలుత ప్రభుత్వ భూములు, గ్రామ సరిహద్దులను సర్వే చేసిన అనంతరం పట్టా భూముల సర్వే చేపడతామని వివరించారు. అధునాతన రోవర్ యంత్రాల సహాయంతో కచ్చితత్వం, పారదర్శకతకు ప్రాధాన్యమిస్తూ గూగుల్, జీపీఎస్ ట్రాకింగ్ విధానంలో భూముల హద్దులను గుర్తించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. సర్వేయర్, జీపీఓ, రెవెన్యూ రికార్డుల ఆధారంగా రోజుకు 35 నుంచి 40 ఎకరాల వరకు సర్వే నిర్వహిస్తారని వెల్లడించారు. సర్వే జరిగే సమయంలో భూ యజమానులు, రైతులు తమ భూముల వద్ద ఉండి హద్దులను, సర్వే ప్రక్రియను స్వయంగా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. హద్దుల విషయంలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి మరోసారి సర్వే చేయించుకోవచ్చని స్పష్టం చేశారు. గ్రామాన్ని భూ సమస్యలు లేని గ్రామంగా తీర్చిదిద్దేందుకు భూ యజమానులు, రైతులు అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీ సర్వే ల్యాండ్ సుదర్శన్, గజ్వేల్ తహసీల్దార్, గ్రామ సర్పంచ్, సర్వే అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మల్లన్నసాగర్ నిర్వాసితులకు పదేళ్లపాటు పన్నుల మినహాయింపు ఇవ్వాలి

- ఎల్ఆర్ఎస్ ఫీజు మినహాయింపు మెమోపై హర్షం

- మున్సిపల్ పరిధిలో ఇతర పన్నులూ రద్దు చేయాలి

- పరిహారాలు, ప్యాకేజీలు, రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలి

- ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలి

- నిర్వాసిత కుటుంబాలకు ఉపాధి హామీ కల్పించాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి

ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం :

మల్లన్నసాగర్ భూనిర్వాసితులకు ఎల్ఆర్ఎస్ ఫీజు మినహాయింపుతో పాటు మున్సిపల్ పరిధిలో విధించే అన్ని ఇతర పన్నుల నుంచి పదేళ్లపాటు మినహాయింపు కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎల్ఆర్ఎస్ ఫీజు మినహాయిస్తూ ప్రభుత్వం మెమో నంబర్ 9022/పి ఎల్ జి-×××/2026 జారీ చేయడాన్ని స్వాగతిస్తున్నామని, నిర్వాసిత కుటుంబాలు ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు ఇతర పన్నులు చెల్లించాల్సిన అవసరం లేకుండా ప్రత్యేక జీవో విడుదల చేయాలని కోరారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలనలో మల్లన్నసాగర్ నిర్వాసితులకు ప్రయోజనం చేకూర్చేలా ప్రభుత్వం జారీ చేసిన తొలి అధికారిక ఉత్తర్వుగా ఈ ఎల్ఆర్ఎస్ ఫీజు మినహాయింపును భావిస్తున్నామని తెలిపారు. అయితే మున్సిపాలిటీలో విలీనం చేసిన సమయంలో జనాభా, ప్రాంత విస్తీర్ణానికి అనుగుణంగా వార్డుల సంఖ్య పెంచకపోవడంతో నిర్వాసిత ప్రాంతాల్లో పాలనాపరమైన సమస్యలు నెలకొన్నాయని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అర్హులైన నిర్వాసితులకు అందాల్సిన పరిహారాలు, ప్యాకేజీలు, ఇళ్లు, ఇంటి స్థలాల కేటాయింపులు పూర్తికాలేదని, వాటికి సంబంధించిన రిజిస్ట్రేషన్లు కూడా పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. మరోవైపు ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో పాఠశాలలు, ఆలయాలు, ఇతర అవసరమైన మౌలిక వసతులు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి మూడేళ్లుగా నిర్వాసితులు తమ సమస్యల పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. మల్లన్నసాగర్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో



నివసిస్తున్న నిర్వాసిత కుటుంబాలను వీబీ-జీ రామ్ పథకం కింద అర్హులుగా గుర్తిస్తూ ప్రత్యేక జీవో విడుదల చేయాలని బండ్ల స్వామి కోరారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వాసిత కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎల్ఆర్ఎస్ ఫీజుతో పాటు మున్సిపల్ పరిధిలోని ఇతర పన్నుల నుంచి పదేళ్లపాటు మినహాయింపు, పెండింగ్‌లో ఉన్న పరిహారాలు, ప్యాకేజీలు, ఇళ్ల స్థలాల కేటాయింపులు, రిజిస్ట్రేషన్ల పూర్తి, ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో మౌలిక వసతుల కల్పన, నిర్వాసిత యువతకు ఉపాధి హామీ వంటి అంశాలపై ప్రభుత్వం వెంటనే స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారంలో జాప్యం చేస్తే భూనిర్వాసితుల ఆగ్రహాన్ని ప్రభుత్వం ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి

- నీటి వృథాను అరికట్టేందుకు ప్రజలు సహకరించాలి

- ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి ముప్పు

- పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యలపై చర్చ

- వార్డుల్లో నీటి వృథాపై కౌన్సిలర్ల ప్రస్తావన

- మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్

ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం :

గజ్వేల్ పట్టణంలో నీటి వృథాను అరికట్టి, భవిష్యత్తులో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్ సూచించారు. శుక్రవారం గజ్వేల్, ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆమె అధ్యక్షతన, కమిషనర్ పి. గణేష్‌రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు.



ఈ సమావేశంలో పట్టణ అభివృద్ధి, ప్రజా సౌకర్యాలు, వివిధ వార్డుల్లో నెలకొన్న సమస్యలపై కౌన్సిలర్లు చర్చించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్ మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో ఎల్‌నినో ప్రభావం కారణంగా నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని, అందువల్ల ప్రతి ఒక్కరూ ఇప్పటి నుంచే నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. పట్టణ ప్రజలు నీటి విలువను గుర్తించి అవసరమైన మేరకే వినియోగించాలని, ఇళ్ల వద్ద, బహిరంగ ప్రదేశాల్లో ఎక్కడా నీటిని వృథా చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. నీటి వృథాను అరికట్టేందుకు ప్రజలు మున్సిపాలిటీకి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పలు వార్డుల్లో నీటి వృథా జరుగుతున్న విషయాన్ని కౌన్సిలర్లు ప్రస్తావించారు. పట్టణ అభివృద్ధి, ప్రజా సౌకర్యాలు, వార్డుల్లోని ఇతర సమస్యలపై చర్చించి పలు అంశాలపై నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ కళ్యాణి కార్ పద్మాబాయి నర్సింగరావు, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన డీసీపీ అంకిత్ కుమార్..

ప్రజా వాయిస్,చెన్నారావుపేట :

చెన్నారావుపేట మండల కేంద్రంలోని ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్ సంఖవార్ చేన్నరావుపేట పోలీస్ స్టేషన్లో వార్షిక తనికి చేయడం జరిగినది. ఇట్టి ఇన్స్పెక్షన్ లోఎసిపి నర్సంపేట పి రవీందర్ రెడ్డి మరియు నెక్కొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ పనిధర్ కూడా డిసిపి తో పాల్గొన్నారు.పోలీస్ స్టేషన్ యొక్క పలు రికార్డులను పరిశీలించి మరియు కేసు ఫైళ్లను పరిశీలించి పోలీస్ స్టేషన్ యొక్క పరిసరాలను పరిశీలించి మరియు పోలీస్ స్టేషన్లో ఉన్న అన్ని క్రైమ్ వెహికిల్స్ గురించి కూడా ఇన్స్పెక్షన్ చేసి చేన్నరావుపేట ఎస్సైకి,క్రింది సిబ్బంది అందరికీ కూడా తగు సూచనలు ఇవ్వడం జరిగినది,సిబ్బంది యొక్క మంచి చెడులు అడిగి తెలుసుకుని వారి యొక్క సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడం జరిగినది, ఇన్స్పెక్షన్ లో భాగంగా సైబర్ నేరాల పైన గంజాయి గుట్కా మరియు చెడు



నడవడిక కలిగిన వారిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ గ్రామాలలో ప్రతినిత్యం విజబుల్ పోలిసింగును అమలుపరుస్తూ ప్రజలకు రక్షణ పరంగా అందుబాటులో అందరూ కూడా ఉండి పనిచేయాలని ఉత్తర్వులు ఇవ్వడం జరిగినది మరియు ఎలాంటి ఆస్తి నేరాలు జరగకుండా పెట్రోలింగ్ డ్యూటీలను అమలుపరచవలసిందిగా సూచనలు ఇవ్వడం జరిగింది..

కులం పేరుతో దూషిస్తే చట్టనిత్య నేరం

కుల దురహంకరణ సమాజానికి సవాళ్లు

ఏఎస్ఐ శ్రీనివాస్



ఆగస్ట్ 30 ప్రజా వాయిస్) చేగుంట

చేగుంట మండలంలోని గొల్లపల్లి గ్రామంలో శుక్రవారం నాడు ఎస్సై చైతన్ కుమార్ రెడ్డి అధ్యక్షతన, ఏఎస్ఐ శ్రీనివాస్, ఆధ్వర్యంలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు, ఏఎస్ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ, ఎస్సీ కులస్తులను కులం పేరుతో దూషించిన, గుడిలో రాకుండా అడ్డుపడిన, వారి పైన, ఎస్సీ ఎస్టీ అట్రాసిట్ కేస్ కేసు నమోదు చేసి జైలుకు పంపించడం జరుగుతుందన్నారు, గ్రామంలో ఎవరైనా కులాంతర వివాహం చేసుకున్నట్లయితే వారికి ప్రభుత్వం తరుపున 50 వేల రూపాయలు నగదు., విదేశీ చదువుల. కొరకు రెండు లక్షల రూపాయలు ప్రభుత్వం ఇవ్వడం జరుగుతుంది, అన్నారు, ఈ కార్యక్రమం లో , గ్రామ సర్పంచ్ సబిత జనార్ధన్ రెడ్డి, ఉప సర్పంచ్ గిరిబాబు, రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, సిపిఓ జిపిఓ గోపాల్, ఎస్సీ హాస్టల్ వార్డెన్ రమేష్,పోలీస్ కానిస్టేబుల్ మహేష్ గ్రామ ప్రజలు మహిళలు తదితరులు పాల్గొన్నారు,